ఆదివారం SUNDAY 15.9.2024
హైదరాబాద్ HYDERABAD

మన రాష్ట్రం మన పత్రిక

నమస్తే తెలంగాణ
NAMASTE TELANGANA

వెల (Price) రూ.8.00 | సంపుటి (Volume): 14 | సంచిక (Issue): 101
పేజీలు: 12+4+32 పేజీల ఆదివారం అనుబంధం
Pages: 12+4+32 Pages SUNDAY Supplement
PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD
www.ntnews.com /ntdailyonline



ఎల్లంపల్లి నుంచి కొండపోచమ్మకు గోదావరి పరుగులు
అయినా లక్ష కోట్లు వృథా అంటూ కాంగ్రెస్ దుష్ప్రచారం
మరోవైపు నీటి పంపిణీకి దీన్ని వాడుతామంటూ ప్రకటన

కూలిందెక్కడ? మింగిందెవరు?

వాడుకలోనే 80,377.36 కోట్ల నీటిపంపిణీ వ్యవస్థ

విజయవంతంగా కొనసాగుతున్న కాళేశ్వర ఎత్తిపోతలు

అబద్ధాన్ని పదేపదే చెప్పి జనాన్ని మాయ చేయవచ్చు. కానీ నిటారుగా కండ్లముందు నిలబడ్డ నిజాన్ని మాత్రం నీరుగార్చలేరు. ప్రపంచంలో అతి పెద్ద ఎత్తిపోతల పథకమైన కాళేశ్వరమే దీనికి సాక్ష్యం.

ఒక బరాజ్‌లోని ఒకేఒక (20వ నంబర్) పిల్లరు కుంగితే, ఒకేఒక (7వ) బ్లాకులో సమస్య తలెత్తితే... మొత్తం కాళేశ్వరమే వృథా అయినట్టు కాంగ్రెస్ ఎన్నికలకు ముందు ప్రచారం చేసింది. ఇప్పుడు కూడా అదే పాట పాడుతున్నది. అసలు నిజం ఏమిటంటే...

గత మూడు నెలల్లో వానలు విపరీతంగా పడ్డాయి. గోదావరి-ప్రాణహితకు భారీ వరద వచ్చింది. అయినా గోదావరి మీద నిర్మించిన ఏ ఒక్క బరాజ్ కూడా... లక్ష్మి, పార్వతి, సరస్వతి... ఏదీ చెక్కు చెదరలేదు. ఇప్పుడో అప్పుడో బరాజ్‌లు కూలిపోతాయని కాంగ్రెస్ నేతలు నోరు నొప్పిపుట్టేదాకా అరిచారు. కానీ జూలై 22వ తేదీన మేడిగడ్డ వద్ద ప్రవాహం ఏకంగా 10 లక్షల క్యూసెక్కులుగా, అంటే 103.55 మీటర్లుగా నమోదైంది. అధికారులు మొదటి ప్రమాద హెచ్చరికను కూడా ఎగరేశారు. దాదాపు నెల రోజుల పాటు రోజుకు సగటున 5 లక్షల క్యూసెక్కుల స్థాయిలో ప్రవాహం కొనసాగింది. చివరికి ఇప్పుడు, నిన్న శనివారం కూడా అక్కడ 5.93 లక్షల క్యూసెక్కుల ప్రవాహం ఉంది. అయినా బరాజ్ చెక్కు చెదరలేదు. ఇదీ నిజం.

మరిక కూలింది ఎక్కడ?

'కాళేశ్వరం కట్టినం అన్నరు. లక్ష కోట్లు మింగిండ్రు' ఇదీ మొన్నటికి మొన్న అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నమాట. అర్థంకాని విచిత్రం ఏమిటంటే, రేవంత్ అట్లా మాట్లాడితే, ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్‌కుమార్ మాత్రం కాళేశ్వరం సిస్టంను వాడుకుంటామని ప్రకటించారు. ప్రకటించడమే కాదు. ప్రస్తుతం వాడుతున్నారు కూడా! అసలు కాళేశ్వరానికి అయిన ఖర్చు లక్ష కోట్లు కాదు; 93 వేల కోట్లు.

మరి 93 వేల కోట్లనూ ఎవరో మింగితే ఉత్తమ్ చెప్పిన 'కాళేశ్వరం సిస్టం' ఎక్కన్నుంచి ఎట్లా వచ్చింది?

కాంగ్రెస్ సగంలో వదిలేసిన ఎల్లంపల్లి, మిడ్‌మానేరు రిజర్వాయర్లు, ప్రస్తుతం నిర్మాణం పూర్తయి వినియోగంలో ఉన్న 13 పంపు హౌస్‌లు, అనంతగిరి సాగర్, రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్, బాహుబలి మోటర్లు, సబ్‌స్టేషన్లు, సర్జ్‌పూల్‌లు, పంప్‌హౌస్‌లు, కాల్వలు ఇవన్నీ కేసీఆర్ తేకపోతే ఎవరు తెచ్చినట్టు? గాల్లోంచి ఊడి పడ్డాయా? రేవంత్, ఉత్తమ్ అల్లావుద్దీన్ అద్భుత దీపాన్ని ఏమైనా రుద్దారా?

60 ఏండ్ల కాంగ్రెస్, టీడీపీ పాలనలో ఈ నిర్మాణాలేవీ లేవు. కాళేశ్వరంతో మొత్తం 147 టీఎంసీల నీటి నిల్వకు కేసీఆర్ ప్లాన్ చేస్తే, అందులో 141 టీఎంసీల నీటి నిల్వకు నిర్మాణాలను ఆయన పూర్తి చేశారు. ఆయన కట్టిన సాగరాలు, జలాశయాల్లోనే ఈ రోజున రేవంత్ ప్రభుత్వం 80.21టీఎంసీల నీటిని నిల్వ చేసి ఉంచింది. ఇదీ నిజం..

మరిక 93 వేల కోట్లు మింగిందెవరు?

వివరాలు 4,5లో

"కాళేశ్వరం ప్రాజెక్టు ఓ తెల్లఏనుగు. ఎంత ఖర్చు పెట్టినా దానికి సరిపోవడం లేదు. ఆయకట్టు ప్రాంతం పెరగకపోగా రాష్ట్ర వనరులను అది కరిగిస్తున్నది."
ఇదీ టీపీసీసీ అధ్యక్షుడిగా, ఖమ్మం జనగర్జన సభలో రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్య.

"కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణకు వరప్రదాయిని కాదు. తెలంగాణకు ఒక కళంకం. కేసీఆర్ లక్షల కోట్లు అవినీతికి పాల్పడ్డారు. ప్రాజెక్టుల పేరుతో దోచుకున్నారు."
ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి, ఫిబ్రవరి17న అసెంబ్లీలో చేసిన వ్యాఖ్య.

రైతులు, సాగునీటి నిపుణులు వేస్తున్న ప్రశ్న ఏమిటంటే...

కేసీఆర్ లక్షల (!) కోట్లు దోచుకుంటే అంతకుముందు లేని ఈ నిర్మాణాలన్నీ ఎలా అవతరించాయి? వాటిని రేవంత్ ప్రభుత్వం ఎట్లా వాడుతున్నది? ఒకవేళ కాళేశ్వరం తెల్ల ఏనుగైతే, దానిలో భాగమైన నిర్మాణాలను వాడకుండా ఈ వానకాలం, వచ్చే యాసంగిలో రేవంత్ సర్కారు రైతులకు నీళ్లు ఇవ్వగలదా?

సవాల్ సీదా... జవాబ్ దో!

కాళేశ్వరం రిజర్వాయర్లలో ప్రస్తుత నీటినిల్వలు..

రిజర్వాయర్	నీటినిల్వ సామర్థ్యం (టీఎంసీల్లో)	ప్రస్తుత నిల్వ
ఎల్లంపల్లి	20.18	20.18
నంది రిజర్వాయర్	0.50	0.50
మిడ్‌మానేరు	27.5	25.73
అనంతసాగర్	3.5	2.93
రంగనాయకసాగర్	3	2.62
మల్లన్నసాగర్	50	17.85
కొండపోచమ్మసాగర్	15	10.09

మేఘాకే కొడంగల్ లిఫ్ట్!

పొంగులేటి రక్తసంబంధీకులకు మరో ప్యాకేజీ

- రాఘవ కన్‌స్ట్రక్షన్.. మేఘా లోపాయికారి ఒప్పందం!
- ముందే కూడబలుక్కున్నట్టుగా టెండర్ కొటేషన్లు
- టెక్నికల్ బిడ్ అర్హత సాధించిన నాలుగు కంపెనీలు
- ప్రైస్‌బిడ్లలో 2 ఏజెన్సీలు.. ప్యాకేజీ పనులు చెరొకటి
- వివరాలను చెప్పకుండా అధికారుల గోప్యత
- ఆన్‌లైన్‌లోనూ పెట్టని సాగు నీటిపారుదల శాఖ
- మేఘా కోసం 'టెక్నికల్' నిబంధనలు తుంగలోకి..!
- టెండర్లపై ముందే చెప్పిన 'నమస్తే తెలంగాణ'

హైదరాబాద్, సెప్టెంబర్14 (నమస్తే తెలంగాణ): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకం పనులను మేఘా ఇంజినీరింగ్ కంపెనీ దక్కించుకున్నది. ప్రాజెక్టులోని ఒక ప్యాకేజీ పనులను మేఘా కంపెనీకి, మరో ప్యాకేజీ పనులను మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి రక్త సంబంధీకులకు చెందిన రాఘవ కంపెనీకి ప్రాథమికంగా కట్టబెట్టారు. ఈ పనులను ఈ సంస్థలకే అప్పగించనున్నారనే విషయాన్ని 'నమస్తే తెలంగాణ' ఇటీవల ప్రచురించింది. అదే ఇప్పుడు నిజమైంది. టెండర్‌కు ముందే ఇరు కంపెనీలు కూడబలుక్కున్నాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇందుకు ఆయా కంపెనీలు దాఖలు చేసిన కొటేషన్లే నిదర్శనమని చెప్తున్నారు. మరోవైపు, టెక్నికల్ ఎవాల్యూయేషన్ ప్రక్రియను సజావుగా నిర్వహించలేదనే ఆరోపణలొస్తున్నాయి.

మేఘా, రాఘవ కంపెనీలకు చెరో ప్యాకేజీ

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని నారాయణపేట, కొడంగల్, మక్తల్ నియోజకవర్గాల్లోని రూ.లక్ష ఎకరాలకు సాగునీటితోపాటు నారాయణపేట జిల్లాలో తాగునీటి అవసరాలకు ఎన్‌కేఎల్ఐఎస్ చేపట్టాలని తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించింది. మొత్తంగా రెండు ప్యాకేజీలుగా లిఫ్ట్ పనులను చేపట్టాలని 2వ పేజీలో



బ్లాక్‌లిస్ట్ చేయకుండా పనులా?

'సుంకిశాల' ప్రమాదానికి కారణమైన మేఘాకు కాంట్రాక్టు ఎలా ఇచ్చారు?: కేటీఆర్

- ఆ సంస్థ నుంచి ఏం ఆశించి పనులిస్తున్నవ్?
- మేఘాను నువ్వు ఈస్టిండియా కంపెనీ అనలేదా?
- పాలమూరు ప్రాజెక్టును పూర్తిచేస్తవా? లేదా?
- పేదల కడుపుకొట్టే నువ్వు పాలమూరు బిడ్డవా?
- పేదల ఇండ్లు కూల్చినందుకు క్షమాపణ చెప్పాలి
- ఆవంచలో లక్ష్మారెడ్డిని పరామర్శించిన కేటీఆర్

నాగర్‌కర్నూల్ (నమస్తే తెలంగాణ)/తిమ్మాజిపేట, సెప్టెంబర్ 14: ప్రతిపక్షంలో ఉన్నప్పుడు బూతులు తిట్టిన కంపెనీలకే నేడు కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ పనులను ఎందుకు అప్పగించారో చెప్పాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు డిమాండ్ చేశారు. దొంగలు, దొంగలు కలిసి ఊళ్లు పంచుకున్నట్టుగా సగం 2వ పేజీలో

అమరుడి భార్యకు అష్టకష్టాలు

- లైబ్రేరియన్‌గా పదోన్నతి కల్పించని సర్కారు
- కానిస్టేబుల్ కిష్టయ్య భార్యపై కఠిన వైఖరి
- ఆఫీసుల చుట్టూ తిరిగినా దక్కని న్యాయం
- కేసీఆర్ సర్కారులోనే కుటుంబానికి ఆసరా
- కుటుంబానికి ఇంటి స్థలం కేటాయింపు 7
- కూతురి చదువుల ఖర్చు భరిస్తున్న బీఆర్ఎస్



హైదరాబాద్‌లో విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశంను కలిసి వినతిపత్రం ఇస్తున్న అమరుడు కానిస్టేబుల్ కిష్టయ్య భార్య పద్మావతి

ముహూర్తం

ఆదివారం, సూర్యోదయం: 6-04, సూర్యాస్తమయం: 6-18. శ్రీ క్రోధి నామ సంవత్సరం దక్షిణాయనం వర్ష రుతువు భాద్రపద మాసం శుక్ల పక్షం తిథి: ద్వాదశి సాయంత్రం 6-12 వరకు. నక్షత్రం: శ్రవణం సాయంత్రం 6-49 వరకు. వర్జ్యం: రాత్రి 10-27 నుంచి రాత్రి 11-54 వరకు. రాహుకాలం: సాయంత్రం 4-45 నుంచి సాయంత్రం 6-17 వరకు. దుర్ముహూర్తం: సాయంత్రం 4-39 నుంచి సాయంత్రం 5-28 వరకు. అమృతకాలం: ఉదయం 9-09 నుంచి ఉదయం 10-38 వరకు.

రోజుకు రూ.3తో రిస్క్ కవరేజీ

సైబర్ మోసాలకు రక్షణగా సాషే ప్రొడక్ట్స్ తెస్తున్న బీమా సంస్థలు

వ్యాపార సంస్థల అవసరాలకు తగ్గట్టుగా చిన్న ప్లాన్లు 8

దళితుడి జాగాలో సిద్ధరామయ్య ఇల్లు!

డిప్యూటీ సీఎంగా ఉన్నప్పుడే ఆక్రమించారు.. నా వద్ద ఆధారాలున్నాయి: కుమారస్వామి 10

రియల్ ఢమాల్

హైడ్రా కూల్చివేతలతో తీవ్ర ప్రభావం: క్రెడాయ్

- ఇల్లు కొనాలంటే కొనుగోలుదారుల్లో భయం
- ప్రభావం వాస్తవమేనన్న హైడ్రా కమిషనర్
- అక్టోబర్‌లో హైడ్రాపై ఆర్డినెన్స్: రంగనాథ్

హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 14 (నమస్తే తెలంగాణ): దేశంలో వ్యవసాయ రంగం తర్వాత అత్యధికంగా ఉపాధి కల్పించే రంగం రియల్ ఎస్టేట్. అలాంటి రంగం తెలంగాణలో ఆటుపోట్లను ఎదుర్కొంటున్నది. అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల ముందు నుంచి మొదలైన రియల్ ఎస్టేట్ మందగమనం ఏడాది కాలంగా కొనసాగుతుండగా, తాజాగా హైడ్రా కూల్చివేతలతో మరింత కుప్పకూలిపోయే ప్రమాదం ఉన్నదని రియల్ ఎస్టేట్ ప్రతినిధుల సంస్థ క్రెడాయ్.. హైడ్రా కమిషనర్‌కు విన్నవించింది. హైడ్రా బృందం వచ్చివెళ్లిన ప్రాజెక్టుల వైపు కొనుగోలుదారులు కన్నెత్తి చూడటం లేదు. దీనికి తోడు చెరువులు, నాలాల్లో రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులు ఉన్నాయంటూ కొన్ని యూట్యూబ్ చానళ్లు ఇష్టారాజ్యంగా ప్రచారం చేస్తున్నాయి. దీనివల్ల కొనుగోలుదారులు భయపడుతున్నారు. దీనికి పరిష్కారమార్గాన్ని హైడ్రానే చూపాలంటూ రియల్ ఎస్టేట్ సంస్థల ప్రతినిధులు హైడ్రా కమిషనర్‌ను కలిసి తమ పరిస్థితిని వివరించారు. దీనిపై రంగనాథ్ స్పందిస్తూ.. కూల్చివేతల వల్ల రియల్ ఎస్టేట్‌పై తీవ్రప్రభావం పడిందని, ఇది తాత్కాలికమేనని అన్నారు. కొందరు బిల్డర్లు నాలాలపై స్లాబ్ వేసి చెరువులు పూడ్చి సెట్‌బ్యాక్ చూపుతున్నారనే ఫిర్యాదులొచ్చాయని, విచారణ అనంతరం ఏ అక్రమణలు లేవని తేలితే బిల్డర్లు 7వ పేజీలో



పెద్దాయనకు పరిహారం పేదల బతుకు ఫలహారం

సొంత పార్టీ నేత విల్లాను కూల్చేసిన కాంగ్రెస్

- ఢిల్లీలో పంచాయితీ పెట్టిన 'పెద్దాయన'
- ముఖ్యనేతకు తలంటిన అధిష్ఠానం 7
- పరిహారంగా రూ.30 కోట్ల చెల్లింపు!



పౌర హక్కుల నేతల అరెస్ట్

- రఘునాథపాలెం ఎన్‌కౌంటర్ ప్రాంతానికి వెళ్తుండగా అదుపులోకి..
- అశ్వాపురం పోలీస్‌స్టేషన్‌లో నిర్బంధం
- మీడియాను స్టేషన్‌లోకి అనుమతించని పోలీసులు.. ఉద్రిక్తత 3
- వెంటనే విడుదల చేయాలి: టీపీఎఫ్



ధర్నా చేసుకోండి.. అద్దాలు పగలగొట్టండి

ఇదీ వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర తీరు

సమస్యలు చెప్పకునేందుకు వెళ్లిన స్టాఫ్‌నర్సులపై రుసరుస

హైదరాబాద్, సెప్టెంబర్14 (నమస్తే తెలంగాణ): 'ధర్నాలు చేసుకోండి, అద్దాలు పగలగొట్టండి'.. ఇదీ సమస్యలు చెప్పుకునేందుకు తన వద్దకు వచ్చిన స్టాఫ్ నర్సులకు వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఇచ్చిన ఉచిత సలహా. మంత్రి నుంచి ఊహించని సమాధానం రావడంతో సదరు స్టాఫ్‌నర్సులు హతాశులయ్యారు. కన్నీళ్లతో వెనుదిరిగారు. టిమ్స్ వైద్యశాలల్లో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్‌పై పనిచేస్తున్న స్టాఫ్‌నర్సులు, ఉద్యోగులు తమ సమస్యలను విన్నవించుకునేందుకు మంత్రి దామోదర రాజనర్సింహను శనివారం కలిశారు. అన్ని వైద్యశాలల్లో పనిచేస్తున్న స్టాఫ్‌నర్సులకు పీఆర్సీని 2వ పేజీలో

వైద్య విద్యార్థులతో ఎందుకీ చెలగాటం?

తెలంగాణ బిడ్డలకు నష్టం చేయాలన్నదే కాంగ్రెస్ వైఖరా?: కేటీఆర్

హైదరాబాద్, సెప్టెంబర్ 14 (నమస్తే తెలంగాణ): వైద్య విద్యను అభ్యసించాలని కోటి ఆశలు పెట్టుకున్న విద్యార్థుల జీవితాలతో ఏమిటీ చెలగాటం? అని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు మండిపడ్డారు. రాష్ట్రంలో ఎంబీబీఎస్, బీడీఎస్ అడ్మిషన్లకు బ్రేకులు పడటం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు. అడ్మిషన్లను ఇంకెంత కాలం సాగదీస్తారని ఎక్స్‌వేదికగా ప్రశ్నించారు. 'తెలంగాణ బిడ్డలను నాన్‌లోకల్స్‌గా మార్చి ఇతర రాష్ట్రాల విద్యార్థులకు పెద్దపీట వేసే జీవో33 అమలుకు కాంగ్రెస్ సర్కారు ఎందుకు మొండిపట్టు పడుతున్నది? స్థానికతను నిర్ధారించే విషయాన్ని ఎందుకు వివాదస్పదం చేస్తున్నది? అడ్మిషన్ల ప్రక్రియను న్యాయపరమైన చిక్కుల్లోకి ఎందుకు నెడుతున్నది?' అని ట్వీట్ చేశారు. పిల్లలను డాక్టర్లుగా చూడాలని కలలుగంటున్న తల్లిదండ్రుల ఆకాంక్షలను దెబ్బతీసే నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఎంబీబీఎస్ సీట్లను 8,915కు పెంచుకుని డాక్టర్ల ఫ్యాక్టరీగా తీర్చిదిద్దితే, ఆ సమున్నత లక్ష్యానికి కాంగ్రెస్ సర్కారు తూట్లు పొడుస్తున్నదని మండిపడ్డారు. కేసీఆర్ విజన్‌కు కాంగ్రెస్ సర్కారు వైఫల్యంతో గ్రహణం పట్టిందన్నారు.

15వేలు ఇస్తామన్న జోకర్ పత్తాలేడు

కేసీఆర్ రైతుబంధు కింద రూ.పదివేలు ఇస్తే, తాను రూ.పదిహేను వేలు ఇస్తానని చెప్పిన కాంగ్రెస్ జోకర్ ఎక్కడ? అని కేటీఆర్ ప్రశ్నించారు. వానకాలం సీజన్ ముగింపునకు ఇంకా 17 రోజులే మిగిలిందని, ఆ జోకర్ ఇప్పుడు పత్తాలేకుండా పోయారని విమర్శించారు.

అదానీ విషయంలో ప్రపంచం కండ్లు తెరిచినా..

అదానీ విషయంలో ప్రపంచం కండ్లు తెరిచినా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కండ్లు మూసుకునే ఉన్నాయని కేటీఆర్ ఎద్దేవా చేశారు. అదానీకి సంబంధించి స్విట్జర్లాండ్ (స్విస్) 311 మిలియన్ డాలర్లను ఫ్రీజ్ చేసిందని ఉదహరించారు. ప్రపంచ దేశాల్లో అదానీ అవకతవకల వ్యవహారం వెలుగు చూస్తున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాత్రం ఆయనతో అంటకాగుతున్నాయని మండిపడ్డారు. ప్రజల ప్రయోజనాలను విస్మరిస్తూ క్రోనీ క్యాపిటలిస్టులను రక్షించడానికి ఇంకా ఎందుకు ఉత్సాహం చూపుతున్నారని ప్రశ్నించారు.



హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి నివాసానికి వెళ్లి దాడి ఘటనను తెలుసుకుని పరామర్శిస్తున్న పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. చిత్రంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తదితరులు

రేవంత్‌కు సీఎంగా ఉండే అర్హత ఉందా?

- ఆయన చరిత్రహీన ముఖ్యమంత్రి
- హైదరాబాద్‌లో ఉన్న వాళ్లంతా మా వాళ్లే
- పదేండ్లలో ప్రాంతీయ విద్వేషం లేదు
- ప్రాంతీయతత్వాన్ని రెచ్చగొడుతున్న సీఎం
- ఫిరాయింపుదారుల్లో హైకోర్టు వణుకు
- గాంధీ.. ఇప్పుడు ఏ పార్టీలో ఉన్నారు?
- కౌశిక్‌రెడ్డిని పరామర్శించిన కేటీఆర్

హైదరాబాద్, సెప్టెంబర్ 14 (నమస్తే తెలంగాణ): రేవంత్‌రెడ్డి అంత దౌర్భాగ్యపు, చరిత్రహీన ముఖ్యమంత్రిని గతంలో ఎప్పుడూ చూడలేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు విమర్శించారు. పోలీసులతో ఎస్కార్ట్ ఇచ్చి ఒక ఎమ్మెల్యే ఇంటిపై దాడికి పంపుతారా? ఇదెక్కడి దుష్ట సంప్రదాయమని ప్రశ్నించారు. కేటీఆర్ శనివారం మాదాపూర్‌లోని కౌశిక్‌రెడ్డి నివాసానికి వెళ్లి పరామర్శించారు. దాడిలో పగిలిన ఇంటి అద్దాలను పరిశీలించారు. అనంతరం మీడియాతో కేటీఆర్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే గాంధీ అనుచరులు కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ఇలాంటి సంఘటనల కారణంగా జరగరానిది జరిగితే సీఎం బాధ్యత తీసుకుంటారా? కాంగ్రెస్ ప్రభుత్వం బాధ్యత తీసుకుంటుందా? అని ప్రశ్నించారు. ఎమ్మెల్యే గాంధీని హౌస్ అరెస్ట్ చేయకుండా పోలీసులతో ఎస్కార్ట్ ఇచ్చారని మండిపడ్డారు. గాంధీ రోడ్డుపై ఫ్యాక్షన్ లీడర్‌లాగా వస్తుంటే పోలీసులు ఏమి చేస్తున్నారని నిలదీశారు. ఇదంతా రేవంత్ ఆడిన డ్రామా అని ఆరోపించారు. ఈ రకమైన గూండాగిరి హైదరాబాద్‌లో పదేండ్లలో ఎప్పుడూ లేదని, చేతగాని హోం మంత్రి, ముఖ్యమంత్రి కారణంగా ఈ పరిస్థితి వచ్చిందని దుయ్యబట్టారు. హైదరాబాద్‌లో శాంతిభద్రతలను కాపాడలేని రేవంత్‌కు సీఎంగా ఉండే అర్హత ఉన్నదా? అని ప్రశ్నించారు. 'ఈ నగరానికి ఏమైందంటూ పేపర్లు రాస్తున్నాయి. నెలలో 28 మర్డర్లు అయినట్టు వార్తలొచ్చాయి. హోం మంత్రి ఎవరో తెలియదు. హైదరాబాద్‌లో లా అండ్ ఆర్డర్ కాపాడలేని ముఖ్యమంత్రి రేవంత్' అని విమర్శించారు. కేసీఆర్ నాయకత్వంలో లేవనెత్తుతున్న ప్రశ్నలకు సమాధానం చెప్పే సత్తా లేక చిల్లర ఎత్తుగడలు, చిల్లరమాటలు, బజారుమాటలతో రాజకీయాలను దిగజారుస్తున్నారని దుయ్యబట్టారు.



ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఇంట్లో పగిలిన అద్దాలను పరిశీలిస్తున్న కేటీఆర్

హైదరాబాదీలంతా మా వాళ్లే

గత పదేండ్లలో ఏనాడూ ప్రాంతీయ తత్వంతో తాము దాడులు జరపలేదని, అభివృద్ధి, సంక్షేమం మీదనే దృష్టిపెట్టామని కేటీఆర్ చెప్పారు. హైదరాబాద్‌లో ఉన్న ప్రజలంతా తమ వాళ్లేనని పేర్కొన్నారు. హైదరాబాద్ ప్రజలు తమను ఆశీర్వదించారని, కానీ, రేవంత్ పనికిమాలిన వ్యక్తి అనుకొని ఇక్కడి ప్రజలు ఆయనకు ఒక్క సీటు కూడా ఇవ్వలేదని చెప్పారు. అందుకే హైదరాబాద్ ప్రజలపై రేవంత్‌రెడ్డి విద్వేషం నింపుకొని, పగబట్టారని, ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు.

హైకోర్టు తీర్పుతో ఆ ఎమ్మెల్యేల్లో వణుకు

పార్టీ ఫిరాయింపులపై ఇటీవల హైకోర్టు ఇచ్చిన తీర్పు తర్వాత పార్టీ మారిన ఎమ్మెల్యేల్లో వణుకు పుట్టిందని, అందుకే తాము పార్టీ మారలేదంటూ కొత్త రాగం ఎత్తుకున్నారని కేటీఆర్ ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్‌కు చెందిన పది మంది ఎమ్మెల్యేల ఇంటికి ముఖ్యమంత్రి వెళ్లి, వారిని బతిమిలాడి, కాళ్లుమొక్కి కండువా కప్పుతున్నారని, ఒక్కొక్కరిని ఒక్కొరకంగా ప్రలోభ పెట్టి, బెదిరింపులతో పార్టీ మారేలా ఒత్తిడి చేశారని ఆరోపించారు. హైకోర్టు తీర్పు తరువాత వేటు తప్పదని గ్రహించి, తాము పార్టీ మారలేదంటూ స్వరం మార్చారని దుయ్యబట్టారు. గతంలో కాంగ్రెస్ విధానాలు నచ్చి పార్టీలో చేరానని చెప్పి, ఇప్పుడేమో బీఆర్ఎస్‌లో ఉన్నామని చెప్తున్నారని పేర్కొన్నారు. పార్టీ ఫిరాయింపులపై కోర్టులో కేసు నడిపినందునే కౌశిక్‌రెడ్డిపై కోపం పెంచుకున్నారని ఆరోపించారు. పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన ఎమ్మెల్యేల పదవులు ఊడటం ఖాయమని చెప్పారు. హైకోర్టు తీర్పు ఇచ్చినరోజే సభా సంప్రదాయాలు, రాజ్యాంగ విలువలు, పార్లమెంటరీ పద్ధతులను తుంగలోతొక్కి గాంధీని పీఏసీ చైర్మన్‌గా ఎన్నుకోవడం కాంగ్రెస్ నీతిమాలిన విధానానికి నిదర్శనమని మండిపడ్డారు.

బుల్లబ్బాయి, చిట్టి నాయుడు.. రేవంత్‌కు కొత్త పేర్లు

చేతగాని సీఎం ఉండటం వల్లనే ఎమ్మెల్యే ఇంటిపై దాడి జరిగిందని కేటీఆర్ విమర్శించారు. 'రేవంత్‌రెడ్డి.. నువ్వు ముఖ్యమంత్రివేనా? అసలు నీకు అర్హత ఉన్నదా? నీలాంటి పనికిమాలిన, తలమాసిన సీఎంలను ఏనాడూ చూడలేదు. చంద్రబాబు, వైఎస్సార్, రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి లాంటివాళ్లతో తలపడ్డాం. వాళ్లందరి కంటే చిన్నోడివి. హైదరాబాద్‌లో నీలాంటి వారిని బుల్లబ్బాయి, చిట్టినాయుడు అని అంటారు. అధికారం ఎవరిరీ శాశ్వతం కాదు' అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. 'గాంధీ.. ఏ పార్టీలో ఉన్నావు?' అని నిలదీశారు. కౌశిక్‌రెడ్డి ఇంటి దాకా గూండాలను తీసుకొచ్చిన పోలీసులను వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు. ఎస్ఐ, ఏసీపీని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి ఎన్నిరకాల డైవర్షన్ గేమ్‌లు ఆడినా, హెడ్‌లైన్ మేనేజ్‌మెంట్‌లు చేసినా.. ఆరు గ్యారెంటీలు, రుణమాఫీపై ప్రశ్నిస్తూనే ఉంటామని స్పష్టంచేశారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తల మీద దాడులు చేయిస్తున్నది ముఖ్యమంత్రేనని కేటీఆర్ ఆరోపించారు. ఏ కార్యకర్తకు ఏ చిన్న హాని జరిగినా పార్టీ మొత్తం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. హరీశ్‌రావు సహా పలువురు నేతలను మొన్న పోలీసులు అరెస్ట్ చేసిన సందర్భంలో బీఆర్ఎస్ బలగం పవరేమిటో చూపించారని చెప్పారు. ముఖ్యమంత్రి సొంత జిల్లాలోనే బీఆర్ఎస్ కార్యకర్తలు ప్రభుత్వానికి చుక్కలు చూపించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కల్వకుంట్ల సంజయ్, మాధవరం కృష్ణారావు, అనిల్‌జాదవ్, ఎమ్మెల్సీలు శంభీపూర్ రాజు, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మర్రి జనార్దన్‌రెడ్డి, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, గణేశ్‌గుప్తా, బాల్క సుమన్, బీఆర్ఎస్ నాయకులు గెల్లు శ్రీనివాస్‌యాదవ్, కే వాసుదేవరెడ్డి, మన్నె గోవర్ధన్‌రెడ్డి, పుట్ట విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

దమ్ముంటే రాజీనామా చేయండి

'పార్టీ మారిన ఎమ్మెల్యేలు దమ్ముంటే రాజీనామా చేయండి.. ప్రజాక్షేత్రంలోకి రండి.. రేవంత్‌రెడ్డి, రాహుల్‌గాంధీకి దమ్ముంటే వారితో రాజీనామా చేయించాలి' అని కేటీఆర్ సవాలు చేశారు. రేవంత్‌రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పార్టీ ఫిరాయింపులపై ఏం మాట్లాడారో గుర్తు చేసుకోవాలని సూచించారు. 'రాళ్లతో కొట్టి చంపండి, పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల ఇంటి ముందట చావు డప్పు కొట్టిస్తాం. వారిని ఉరితీయాలి' అంటూ రేవంత్ మాట్లాడారని చెప్పారు.

లోకం పోకడ



వానకాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	37.4°c	21.7°c
రంగారెడ్డి	34.5°c	18.6°c
మెదక్	33.4°c	21.0°c
ఖమ్మం	33.0°c	23.0°c
వరంగల్	32.0°c	24.0°c
కరీంనగర్	32.0°c	24.0°c
మహబూబ్‌నగర్	32.0°c	21.0°c
నిజామాబాద్	31.8°c	23.6°c
నల్లగొండ	31.0°c	24.8°c
హైదరాబాద్	30.8°c	23.0°c

ఆయిల్‌పామ్ రైతులకు మంచిరోజులు

పామాయిల్ దిగుమతి సుంకాన్ని పెంచిన కేంద్రం

5.5 నుంచి 27.5 శాతానికి పెంచుతూ నిర్ణయం

కేసీఆర్ ముందుచూపుతో సాగుకు ప్రోత్సాహం

హైదరాబాద్, సెప్టెంబర్ 14(నమస్తే తెలంగాణ): ఆయిల్‌పామ్ సాగు చేసే రైతులకు భారీ ఊరట లభించింది. పామాయిల్ దిగుమతిపై సుంకాన్ని భారీగా పెంచుతూ కేంద్రం నిర్ణయం తీసుకున్నది. ఇప్పటి వరకు ఉన్నటువంటి 5.5 శాతం సుంకాన్ని ఏకంగా 27.5 శాతానికి పెంచింది. దీంతో పామాయిల్ దిగుమతులు తగ్గి.. స్థానికంగా రైతులు పండించే ఆయిల్‌పామ్ గెలల ధర పెరిగే అవకాశం ఉంటుంది. తద్వారా ఆయిల్‌పామ్ సాగు లాభసాటిగా మారనుంది. పామాయిల్‌పై దిగుమతి సుంకం పెంచడం వల్ల ప్రస్తుతం టన్నుకు రూ. 14,392గా ఉన్న ఆయిల్‌పామ్ గెలల ధర కనీసంగా రూ. 16,500 పైగా ధర పలికే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం రాష్ట్రంలో 2.03 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగులో ఉంది. ఇందులో 44,400 ఎకరాల ఆయిల్ పామ్ పంటల నుంచి 2.80 లక్షల టన్నుల ఆయిల్ పామ్ గెలల దిగుబడి వస్తున్నది. ఈ నేపథ్యంలో దిగుమతి సుంకం పెంచడం వలన 9,366 మంది ఆయిల్ పామ్ రైతులకు లబ్ధి చేకూరే అవకాశం ఉంది. పామాయిల్ దిగుమతి సుంకం పెంపుపై కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్‌కు రాష్ట్ర మంత్రి తుమ్మల కృతజ్ఞతలు తెలిపారు. గతంలో దిగుమతి సుంకం పెంచాలని కోరుతూ మంత్రి తుమ్మల కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయడంతోపాటు ఓసారి రాష్ట్రానికి వచ్చిన కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్‌చౌహాన్‌కు వినపతిపత్రం ఇచ్చారు. ఇప్పుడు సుంకం పెంపు నేపథ్యంలో ఈ అవకాశాన్ని రాష్ట్ర రైతులు సద్వినియోగం చేసుకుని, భారీగా పామ్ ఆయిల్ సాగు చేయాలని మంత్రి కోరారు.

కేసీఆర్ ముందుచూపు

మాజీ సీఎం కేసీఆర్ ముందుచూపుతో తెలంగాణ రైతులకు సాగు లాభసాటిగా మారింది. అంతర్జాతీయంగా పామాయిల్‌కు గల డిమాండ్‌ను గుర్తించిన కేసీఆర్ తెలంగాణ పెద్ద ఎత్తున ఆయిల్‌పామ్ సాగుకు ప్రణాళికలు రూపొందించారు. ఆయిల్‌పామ్ సాగుతో రైతులకు క్రమం తప్పకుండా భారీ ఆదాయం సమకూరుతుందని పదే పదే చెప్పారు. ఇందుకు అనుగుణంగా ఐదేండ్ల ప్రణాళికను తయారు చేసి ఏకంగా 20 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగయ్యేలా చర్యలు తీసుకున్నారు. కేసీఆర్ తీసుకున్న చర్యలతో రాష్ట్రంలో 30వేల ఎకరాల్లో మాత్రమే సాగులో ఉన్నటువంటి ఆయిల్‌పామ్‌ను ఏకంగా 2.03 లక్షల ఎకరాలకు పెంచారు. ఇప్పుడు దిగుమతి సుంకం పెంపుతో రాష్ట్రంలో ఆయిల్‌పామ్ గెలల ధర భారీగా పెరిగే అవకాశం ఉంది. నాడు కేసీఆర్ తీసుకున్న ముందుచూపు నిర్ణయంతో నేడు రైతులకు ఆయిల్‌పామ్ సాగు లాభాల సాగు మారనుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ధర్నా చేసుకోండి.. అద్దాలు పగలగొట్టండి

మొదటిపేజీ తరువాయి...

వర్తింపజేసినా, టిమ్స్‌లోని సిబ్బందికి వర్తింజేయలేదని, తమకు సైతం పీఆర్సీ అమలుచేయాలని కోరారు. తమ వయసు, సర్వీసును పరిగణనలోకి తీసుకుని రెగ్యులర్ స్టాఫ్‌నర్సుల రిక్రూట్‌మెంట్‌లో తమకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఆ వినతులన్నింటినీ మంత్రి తోసిపుచ్చారు. దీంతో తమ సమస్యలను మరింత వివరంగా మంత్రి తెలియజేసేందుకు స్టాఫ్‌నర్సులు ప్రయత్నించారు. దీంతో మంత్రి వారిపై అసహనం వ్యక్తం చేశారు. 'అన్యాయం జరిగితే కోర్టుకు వెళ్లండి.. అవసరమైతే ధర్నా చేసుకోండి.. అద్దాలు పగలగొట్టండి' అంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. లోపలికి రానిచ్చి మాట్లాడటమే తప్పయిందని, వెంటనే వెళ్లిపోవాలంటూ సీరియస్ అయ్యారు. దీంతో టిమ్స్ యూనియన్ స్టాఫ్‌నర్సులు నిర్ఘాంతపోయారు. మంత్రి చులకనగా మాట్లాడటంతో కన్నీటిపర్యంతమవుతూ అక్కడినుంచి వెనుదిరిగారు. తక్షణమే దామోద రాజనర్సింహను మంత్రి పదవి నుంచి తొలగించాలని టిమ్స్ యూనియన్ స్టాఫ్‌నర్స్ అండ్ కాంటాక్ట్ ఔట్ సోర్సింగ్ డిమాండ్ చేసింది.

మేఘాకే కొడంగల్ లిఫ్ట్!

మొదటిపేజీ తరువాయి...

నిర్ణయించింది. మొదటి ప్యాకేజీలో పంచ్‌దేవ్‌పహాడ్, భూత్పూర్ పంపింగ్‌స్టేషన్ల నిర్మాణం, ఊట్కూరు, జయమ్మ, కానుకుర్తి తదితర చెరువుల అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. అందుకు రూ.1,134.62 కోట్లు అవసరమని అంచనా వేశారు. రెండో ప్యాకేజీలో ఊట్కూరు, కానుకుర్తి పంపింగ్‌స్టేషన్ల నిర్మాణం చేపట్టనున్నారు. అందుకు 1,126.23 కోట్లు అవసరమని అంచనా వేశారు. మొత్తంగా పంపింగ్ సిస్టమ్ కోసమే 2,260.85 కోట్లు అవసరమని అంచనా వేశారు. ఇవికాక రెండో దశలో జాజాపూర్, దౌలతాబాద్, బొమ్రాస్‌పేట, లక్ష్మీపూర్, ఎర్లపల్లి, హస్నాబాద్, కొడంగల్ చెరువుల నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచడంతోపాటు గ్రావిటీ కాల్వలు, ఆయకట్టుకు నీటిని అందించే డిస్ట్రిబ్యూటరీ కాల్వల నిర్మాణం, రూ.3 వేల ఎకరాల భూసేకరణ తదితర పనులకు మరో రూ.1,404.50 కోట్లు అవసరమని ఇరిగేషన్ శాఖ అంచనా వేసింది. ఇటీవల ఈ రెండు ప్యాకేజీలకు సంబంధించిన పనులకు ఇరిగేషన్ శాఖ టెండర్లు ఆహ్వానించింది. ఇటీవలనే టెండర్లను తెరిచారు. ఇందులో మొదటి ప్యాకేజీ పనులను రాఘవ కన్‌స్ట్రక్షన్ కంపెనీ, రెండో ప్యాకేజీ పనులను మేఘా ఇంజినీరింగ్ కంపెనీ దక్కించుకున్నాయి. ఆయా పనుల అంచనా వ్యయం కంటే 3.95% అధికంగా కోట్ చేయడం గమనార్హం.

టెక్నికల్ ఎవాల్యూయేషన్‌పై ఆరోపణలు

ఎన్‌కేఎల్ఐఎస్ ప్యాకేజీ పనుల అప్పగింతకు నిర్వహించిన టెండర్ల ప్రక్రియపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మేఘా, రాఘవ కంపెనీలకు టెండర్లను కట్టబెట్టేందుకే టెక్నికల్ ఎవాల్యూయేషన్‌ను సరిగా నిర్వహించలేదని, కావాలనే మరో రెండు కంపెనీలను తప్పించారనే ఆరోపణలున్నాయి. ఈ పనుల కోసం ఎల్‌అండ్‌టీ, ఎన్‌సీసీ (నాగార్జున కన్‌స్ట్రక్షన్ కంపెనీ) సైతం బిడ్లను దాఖలను చేశాయి. వారం రోజుల క్రితం తొలుత టెక్నికల్ బిడ్లను తెరిచారు. అందులో నాలుగు కంపెనీలూ అర్హతను సాధించాయి. దీంతో ప్రైస్ బిడ్లను తాజాగా తెరిచారు. ఇందులో మేఘా, రాఘవ కంపెనీలే అర్హత సాధించాయి. మిగిలిన రెండు కంపెనీలు అర్హతను సాధించలేదని అధికారులు చెప్తున్నారు. సాధారణంగా టెక్నికల్ ఎవాల్యూయేషన్ చేసేటప్పుడు ఆయా కంపెనీల ట్రాక్ రికార్డును పరిశీలిస్తారు. గతంలో కంపెనీ చేపట్టిన నిర్మాణాలు, అందులో వైఫల్యాలు, ప్రమాదాలను కూడా పరిగణనలోకి తీసుకుంటారు. ఆ నిబంధనలను సక్రమంగా అమలు చేసి ఉంటే మేఘా కంపెనీకి టెక్నికల్‌గా అర్హత సాధించే వీలే ఉండదని, ప్రాథమికంగానే తిరస్కరించాల్సి ఉంటుందని ఇంజినీరింగ్ నిపుణులు చెప్తున్నారు. మేఘా కంపెనీ నిర్మిస్తున్న సుంకిశాల ప్రాజెక్టులో ఇటీవల టన్నెల్ గేట్ ధ్వంసం కావడంతోపాటు రిజర్వాయర్ వైపు ఉన్న సైడ్‌వాల్ (రక్షణ గోడ) కూలిపోయింది. దీంతో సంపు, పంప్‌హౌజ్ సూపర్‌స్ట్రక్చర్ నిర్మాణాలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఆ ప్రమాద ఘటనకు పూర్తి బాధ్యత తమదేనని నిర్మాణ సంస్థ మేఘా సైతం అంగీకరించింది. వాటర్‌బోర్డు జారీచేసిన షోకాజ్ నోటీసులకు ఈ మేరకు మేఘా కంపెనీ బదులిచ్చింది. అయినప్పటికీ ప్రస్తుతం ఎన్‌కేఎల్ఐఎస్ టెండర్ల ఖరారులో సుంకిశాల ప్రమాద ఘటనను పరిగణనలోకి తీసుకోలేదని, మేఘా కంపెనీకి కట్టబెట్టేందుకు టెక్నికల్ ఎవాల్యూయేషన్ నిబంధనలను తుంగలో తొక్కారనే ఆరోపణలున్నాయి.

ముందే చెప్పిన 'నమస్తే తెలంగాణ'

నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకం (ఎన్‌కేఎల్ఐఎస్) పనులు మేఘా కంపెనీకే దక్కనున్నాయని, అందుకు అనుగుణంగా ముందస్తుగానే ప్రాజెక్టుకు రూపకల్పన చేశారని 'నమస్తే తెలంగాణ' ఆది నుంచీ చెప్తున్నది. ఇదే విషయమై ఆగస్టు 18న 'మేఘా చేతికే కొడంగల్ 'పేరిట ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. ఇప్పుడు ఒక ప్యాకేజీ పనులను ఆ కంపెనీయే దక్కించుకోవడం గమనార్హం. ఎన్‌కేఎల్ఐఎస్‌కు గతంలోనే ప్రతిపాదనలు సిద్ధంచేశారు. అందులో అప్పుడున్న భూగర్భ సొరంగాల స్థానంలో ఇప్పుడు ప్రెషర్‌మెయిన్స్ ద్వారా నీటిని తరలించాలని ప్రభుత్వం తాజాగా నిర్ణయించింది. మేఘా కంపెనీకి ప్రాజెక్టు పనులను అప్పగించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నారని ఇరిగేషన్‌శాఖ అధికారులు చర్చించుకుంటున్నారు. వాస్తవంగా భూత్పూర్ రిజర్వాయర్ నుంచి నీటిని లిఫ్ట్ చేసి సొరంగాల ద్వారా తరలించాల్సి ఉంటుంది. ఇందుకు దాదాపు 38 కిలోమీటర్ల పొడవు సొరంగాలను తవ్వాల్సి ఉంటుంది. ప్రస్తుతం భూగర్భ సొరంగాలకు బదులుగా ప్రెషర్‌మెయిన్స్ ద్వారా నీటిని లిఫ్ట్ చేయాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. భూసేకరణ, జియోలజికల్ అధ్యయనాలు, సొరంగాలకు అడ్డుగా ఉండే రాళ్లు, బండల కటింగ్‌కు ఎక్కువ సమయం పడుతుందని, రైతులకు సాగునీటిని సత్వరమే అందించేందుకు ప్రెషర్ మెయిన్ నిర్మించాలని నిర్ణయించినట్టు ప్రభుత్వం చెప్తున్నది. ప్రభుత్వ వాదన వట్టిదేనని ఇంజినీరింగ్ నిపుణులు చెప్తున్నారు. ప్రెషర్‌మెయిన్స్‌తో ప్రాజెక్టును చేపట్టినా దాదాపు మూడేండ్ల సమయం పడుతుందని ఇంజినీర్లు వివరిస్తున్నారు. మోటర్లు రావడానికి, పంప్‌హౌజ్‌ల నిర్మాణం, మోటర్ల బిగింపునకు దాదాపు రెండున్నరేండ్లు పడుతుందని, ఆ సమయంలో ఇప్పుడున్న సాంకేతిక టెక్నాలజీ ఆధారంగా భూగర్భ సొరంగాల తవ్వకాన్ని పూర్తి చేయొచ్చని వివరిస్తున్నారు. సొరంగాల నిర్మాణం చేపడితే దీర్ఘకాలంపాటు మెయింటనెన్స్ ఉండబోదని, కానీ ప్రెషర్స్‌మెయిన్స్‌తో అదనంగా మెయింటనెన్స్ భారం పడుతుందని వెల్లడిస్తున్నారు. సొరంగాల ద్వారా పంపింగ్ సిస్టమ్‌ను పూర్తిచేయడానికి రూ.963.898 కోట్లు అవసరమవుతాయని, ప్రెషర్‌మెయిన్స్ ద్వారా ఆ ఖర్చు 1,016.572 కోట్లుకు పెరుగుతుందని తెలిపారు. మొత్తంగా ప్రెషర్ మెయిన్స్ ద్వారా లిఫ్ట్‌ను చేపడితే ప్రాజెక్టు వ్యయం దాదాపు రూ.60 కోట్లు అదనంగా పెరగనున్నది. ఏటా మెయింటెనెన్స్ చార్జీలు అదనపు భారం కానున్నాయి.

ముందే కూడబలుక్కున్నారా?

ఎన్‌కేఎల్ఐఎస్ ప్యాకేజీ పనులను దక్కించుకున్న రాఘవ కన్‌స్ట్రక్షన్, మేఘా కంపెనీలు ముందే కూడబలుక్కుని, లోపాయికారి ఒప్పందం చేసుకున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రూ.1,134.62 కోట్లతో చేపట్టాల్సిన ప్యాకేజీ-1 పనులకు రాఘవ కన్‌స్ట్రక్షన్ కంపెనీ అంచనా వ్యయం కంటే 3.95% అధికంగా కోట్ చేసింది. అదే పనులకు మేఘా ఇంజినీరింగ్ కంపెనీ 4.85% అధికంగా కోట్ చేసింది. దీంతో ఎల్1గా నిలిచిన రాఘవ కంపెనీకి ప్యాకేజీ-1 టెండర్ దక్కింది. రూ.1,126.85 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ప్యాకేజీ-2 పనులకు మేఘా ఇంజినీరింగ్ 3.95% అధికంగా కోట్ చేయగా, రాఘవ కంపెనీ 4.8% అధికంగా కోట్ చేసింది. దీంతో ఎల్-1గా నిలిచిన మేఘా ఇంజనీరింగ్ కంపెనీకి ప్యాకేజీ-2 టెండర్ దక్కింది. మేఘా కంపెనీ అధికంగా కోట్ చేసిన చోట రాఘవ కంపనీ తక్కువగా కొటేషన్ దాఖలు చేయడం, మేఘా కంపెనీ తక్కువ కోట్ చేసిన చోట రాఘవ కంపెనీ అధికంగా కొటేషన్ దాఖలు చేయడం లోపాయకారి ఒప్పందంలో భాగమేనని ఇరిగేషన్ శాఖలో చర్చించుకుంటున్నారు. రూ.1,134.62 కోట్ల విలువైన పనులకు 3.9% అధిక కొటేషన్ దాఖలు చేసిన రాఘవ కంపెనీ, అంతకంటే రూ.1126.85 కోట్ల విలువైన ప్యాకేజీ-2 పనులకు మాత్రం 4.8% అధికంగా కోట్ చేయడం గమనార్హం.

మంత్రి స్వయంగా పట్టుబట్టి..!

ఎన్‌కేఎల్ఐఎస్‌కు సంబంధించిన రెండు ప్యాకేజీల పనులను మేఘా కంపెనీకే అప్పగించాలని ప్రభుత్వ పెద్దలు ముందుగా నిర్ణయించినట్టు సమాచారం. ఇరిగేషన్ అధికారులు సైతం అంతా ఇదే అనుకున్నారు. కానీ ఊహించని రీతిలో రాఘవ కంపెనీ సైతం ఒక ప్యాకేజీ పనులను దక్కించుకున్నది. రాఘవ కంపెనీ రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి రక్తసంబంధీకులదే. దీంతో మంత్రి పట్టుబట్టి తమవారి కంపెనీకి పనులు దక్కేలా చివరి నిమిషంలో చక్రం తిప్పారని కాంగ్రెస్‌పార్టీ నేతలతోపాటు ఇరిగేషన్‌శాఖ ఉన్నతాధికారులు చర్చించుకుంటున్నారు.



నాగర్‌కర్నూల్ జిల్లా ఆవంచలోని మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి సతీమణి శ్వేతారెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

బ్లాక్‌లిస్ట్ చేయకుండా పనులా?

మొదటిపేజీ తరువాయి...

పనులు మేఘా ఇంజినీరింగ్ కంపెనీకి, మరో సగం మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి చెందిన రాఘవ సంస్థకు అప్పగించారని విమర్శించారు. నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండలం ఆవంచలో మాజీ మంత్రి లక్ష్మారెడ్డి సతీమణి శ్వేతారెడ్డి ఇటీవల మృతి చెందగా శనివారం మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలతో కలిసి కేటీఆర్ గ్రామానికి వెళ్లి పరామర్శించారు. శ్వేతారెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పించి లక్ష్మారెడ్డిని, కుటుంబసభ్యులకు ఓదార్చారు. అనంతరం నేరెళ్లపల్లిలో మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి నివాసంలో మీడియాతో మాట్లాడుతూ.. సుంకిశాల ప్రాజెక్టు ప్రమాదంతో దాదాపుగా రూ.80 కోట్ల ప్రజాధనం దుర్వినియోగమైందని, ఇందుకు కారణమైన మేఘా సంస్థకు రూ.4,350 కోట్ల విలువైన కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ పనులను ఎలా అప్పజెప్పారని ప్రశ్నించారు. ఈ సంస్థను బ్లాక్‌లిస్టులో పెట్టాలని కోరారు. నీ సొంత నియోజకవర్గంలో పనులను.. ఏ కంపెనీ అయితే ఈస్ట్ ఇండియా కంపెనీ అన్నావో.. అదే మేఘా కంపెనీకి అప్పగిస్తుంటే నీ నైజం, రంగు, నిజాయితీ ఏమిటో ప్రజలకు తెలుసున్నదని వ్యాఖ్యానించారు. బ్లాక్‌లిస్టులో పెట్టాల్సిన మేఘా సంస్థకు ఏం ఆశించి పనులు ఇచ్చావో చెప్పాలని డిమాండ్ చేశారు.

'పాలమూరు'ను పూర్తి చేస్తరా? లేదా?

పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు ప్రభుత్వం ఎందుకు నిధులు ఇవ్వడం లేదని కేటీఆర్ ప్రశ్నించారు. కేసీఆర్ ప్రభుత్వం పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పనులను 95% పూర్తి చేసిందని, కాంగ్రెస్ సర్కార్ ఎందుకు పట్టించుకోవడం లేదని నిలదీశారు. 'పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పనులు పూర్తి చేస్తరా? లేదా? పనులు పూర్తి చేసి ప్రారంభిస్తే కేసీఆర్‌కు మంచి పేరొస్తుందనా? ఈ ప్రాజెక్టుకు డబ్బులివ్వడానికి మనసొస్తలేదా? నీ బాధేంది? నీ భయమేంది?' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి కేటీఆర్ ప్రశ్నించారు. కల్వకుర్తి, భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ ప్రాజెక్టులను కేసీఆర్ ప్రభుత్వం పూర్తి చేసి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఎనిమిది లక్షల ఎకరాలకు సాగునీరు అందించిందని వివరించారు. కేసీఆర్ సీఎంగా ఉన్న కాలంలోనే నార్లాపూర్‌లో నీటి పంపింగ్ ప్రారంభించామని గుర్తుచేశారు. అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం మిగిలిపోయిన పనులను పూర్తి చేయడంలో నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తున్నదని ధ్వజమెత్తారు. కేవలం 5% భూసేకరణ పనులు మిగిలాయని పేర్కొన్నారు. ఈ పనులకు సైతం బీఆర్ఎస్ హయాంలోనే టెండర్లు పిలిస్తే, కాంగ్రెస్ వాటిని రద్దు చేసిందని ఆరోపించారు. కొల్లాపూర్ నుంచి షాద్‌నగర్ దాకా అన్ని పనులు పూర్తయ్యాయని, మిగిలిన పనులు పూర్తయితే సాగునీరు పారుతుందని చెప్పారు.అలాంటి ప్రాజెక్టును ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. నిజంగా పాలమూరు బిడ్డవైతే సమాధానం చెప్పాలని సీఎంకు సవాలు చేశారు. మేడిగడ్డకు వెళ్లినవిధంగానే రెండ్రోజులపాటు ఉమ్మడి పాలమూరు జిల్లాలోని బీఆర్ఎస్ నాయకత్వమంతా కలిసి కేసీఆర్ కట్టించిన రిజర్వాయర్లు, పంపుహౌజ్‌లను ప్రజలకు చూపిస్తామని వెల్లడించారు. ఈ యాత్ర ద్వారా ముఖ్యమంత్రి కొడంగల్ ప్రాజెక్టుకు పైసలు ఖర్చు చేస్తూ, పాలమూరు ఎత్తిపోతల పనులను ఎలా ఎండబెడుతున్నారో తెలియజేస్తామని చెప్పారు.

పేదల గూడును చెదరగొడ్తవా?

పాలమూరు బిడ్డనని చెప్పుకొనే సీఎం రేవంత్‌రెడ్డి అదే జిల్లా ఆదర్శనగర్‌లో 75 మంది దళితులు, పేదల ఇండ్లను బుల్డోజర్లతో నేలమట్టం చేయించారని కేటీఆర్ విమర్శించారు. 2007లో వైఎస్సార్ ఇచ్చిన ఇండ్లను కూలగొట్టడానికే నేడు సీఎం అయ్యావా? అని ప్రశ్నించారు. పేదల ఇండ్లను కూల్చిన సంఘటనపై బాధితులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ హయాంలో పాలమూరులో నాలుగువేల డబుల్ బెడ్‌రూం ఇండ్లు నిర్మించగా, ఇంకా రెండుమూడొందల ఇండ్లు ఖాళీగా ఉన్నాయని, వాటిని కూల్చివేత బాధితులకు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఏ కారణంతో పేదల ఇండ్లను కూలగొట్టారో వివరించాలని, ఈ చర్యలకు పాల్పడిన అధికారులను సస్పెండ్ చేస్తారో, ఎలాంటి చర్యలు తీసుకుంటారో చెప్పాలని డిమాండ్ చేశారు.

ఎట్టకేలకు ఎమ్మెల్యే గాంధీ కుమారుడు, కో బ్రదర్‌పై కేసు

హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 14 (నమస్తే తెలంగాణ): ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై దాడి ఘటనలో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ తనయుడు, కో బ్రదర్‌పై పోలీసులు ఎట్టకేలకు కేసు నమోదు చేశారు. దాడి జరిగిన రోజు ఎమ్మెల్యే గాంధీతోపాటు 15మందిపై వేర్వేరు సెక్షన్‌ల కింద కేసులు నమోదు చేశారు. దాడిలో ప్రత్యక్షంగా పాల్గొన్న గాంధీ తనయుడు, కో బ్రదర్‌పై కేసులు నమోదు చేయలేదు. బీఆర్‌ఎస్ శ్రేణులు పోలీసుల తీరుపై భగ్గుమనడంతో దిగివచ్చారు. ఎట్టకేలకు ఎమ్మెల్యే గాంధీ తనయుడు, కో-బ్రదర్‌పై 109 (1), 189, 191(2), 191(3), 132, 329, 333, 324(4), 324(5), 351(2) రెడ్‌విత్ 190బీఎన్‌ఎస్ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు.

అప్పుడు కనిపించలేదా?

దాడి జరిగిన రోజు నుంచీ ఇప్పటి వరకు దాడిలో ప్రత్యక్షంగా పాల్గొన్న ఎమ్మెల్యే గాంధీ కుమారుడు, కో బ్రదర్ కనిపించలేదా అని బీఆర్‌ఎస్ శ్రేణులు ప్రశ్నిస్తున్నాయి. వారిపై అదే రోజు కేసులు ఎందుకు నమోదు చేయలేదని మండిపడ్డాయి. దాడి ఘటనలో నిందితులను తప్పించడంపై పెద్దఎత్తున విమర్శలు రావడంతో ఆలస్యంగానైనా పోలీసులు వారిపై కేసులు నమోదు చేశారు.

దక్షిణాదిపై జాతీయ పార్టీల చిన్నచూపు

- రాష్ట్రం నం.1గా ఉన్నా నష్టమే
- కేంద్రం నుంచి తక్కువ నిధులు
- పార్లమెంట్ సీట్లు తగ్గే ప్రమాదం
- టీచర్ల మధ్య తేడా సీఎంకు తగదు
- సిద్దిపేటలో మాజీమంత్రి హరీశ్



సిద్దిపేటలో ట్రస్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గురుపూజోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు

సిద్దిపేట, సెప్టెంబర్ 14 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): దక్షిణాది రాష్ట్రాలు అంటే కేంద్రానికి, జాతీయ పార్టీలకు చిన్నచూపు అని మాజీమంత్రి హరీశ్‌రావు అన్నారు. తెలంగాణ, కర్ణాటక, ఏపీ, కేరళ, తమిళనాడు పోటీపడి అభివృద్ధి చెందటం కూడా ఓ విధంగా నష్టం కలిగిస్తున్నదని తెలిపారు. శనివారం సిద్దిపేటలోని పోలీస్ కన్వెన్షన్ హాల్‌లో ట్రస్మా ఆధ్వర్యంలో జరిగిన గురుపూజోత్సవంలో ఎమ్మెల్సీ యాదవరెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 'రాష్ట్రం నంబర్ వన్‌గా ఉన్నా నష్టాలు ఉన్నాయి. బాగాపనిచేయటం కూడా ఇబ్బందిగా మారుతుంది. ఆర్థికంగా పర్ క్యాపిటా ఆదాయంలో తెలంగాణ నంబర్ వన్‌గా ఉండటం వల్ల కేంద్రం నుంచి నిధులు తక్కువగా వస్తాయి. పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజన చేస్తే సీట్లు తగ్గే ప్రమాదం ఉంటుంది. ఇక్కడి ప్రాంత ఎంపీ సీట్లు తగ్గితే మళ్లీ నార్త్ ఇండియన్ వాళ్లదే కేంద్రంలో పెత్తనం ఉంటుంది. ఇది ఆలోచించాల్సిన అంశం' అని వివరించారు. వెనుకబడిన రాష్ట్రాలకు నిధులు ఇస్తామని కేంద్రం అంటుందని.. అలా బీహార్, ఉత్తరప్రదేశ్ లాంటి రాష్ట్రాలకే ఎక్కువ నిధులు వెళ్తాయని వెల్లడించారు. కష్టపడి తెలంగాణను అభివృద్ధి చేసుకుంటున్నామని, తమ నిధులకు తమకు ఇవ్వాలని 16వ ఆర్థిక సంఘం సమావేశంలో తాను చెప్పినట్టు గుర్తుచేశారు. ఎంత సేపు వెనుకబడిన ప్రాంతాల్లో నిధుల కేటాయింపు ఎక్కువగా ఉంటే, తెలంగాణ పరిస్థితి ఎలా? అని ప్రశ్నించానని తెలిపారు.

ప్రైవేట్ టీచర్లను కించపరిచేలా రేవంత్ వ్యాఖ్యలు

'ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వ, ప్రైవేట్ టీచర్ల మధ్య తేడా చూపి ప్రైవేట్ టీచర్లను తక్కువచేసి మాట్లాడారు. అది దురదృష్టకరం. ఉపాధ్యాయుల అంశంలో సీఎంకు వివక్ష ఉండకూడదు. ప్రభుత్వానికి ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు రెండు కండ్లు. ప్రైవేట్ ఉపాధ్యాయులు జీతాలు తక్కువ ఉండవచ్చు. కానీ, సామర్థ్యంలో తక్కువేమీ కాదు. ఒకరిని మెచ్చుకునే క్రమంలో ఇంకొకరిని కించపరిచే వ్యాఖ్యలు సీఎం రేవంత్‌రెడ్డి స్థాయి మనిషికి తగవు. ఎస్సీ,ఎస్టీ విద్యార్థులను ప్రభుత్వం చిన్నచూపు చూసింది. 10 నెలలైనా నిధులు రాలేదు. బెస్ట్ అవైలబుల్ స్కూల్ నిధులు వెంటనే విడుదల చేయాలి. ప్రభుత్వాలు చేయాల్సిన పనిని ప్రైవేట్ విద్యాసంస్థలు చేస్తున్నాయి. రాష్ట్రంలోని ప్రైవేట్ పాఠశాలల్లో 34.50 లక్షల మంది విద్యార్థులు చదువుతుంటే, సర్కారు పాఠశాలల్లో 25.68 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారని వివరించారు. ఇటీవల కాలంలో ప్రభుత్వ పాఠశాలల్లోనూ పోటీ పెరిగిందని తెలిపారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం చేశారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, ట్రస్మా నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, ట్రస్మా రాష్ట్ర, జిల్లా నాయకులతో పాటు సిద్దిపేట జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

త్వరలో బీఆర్‌ఎస్ కీలక సమావేశం

- వారం పదిరోజుల్లో కేసీఆర్ దిశానిర్దేశం!

హైదరాబాద్, సెప్టెంబర్ 14 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలు, పార్టీ అనుసరించాల్సిన వ్యూహంపై బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ అధ్యక్షతన త్వరలో కీలక సమావేశం జరుగనున్నది. రుణమాఫీ, రైతు భరోసా, పంట పరిహారం ప్రశ్నార్థకమైన వేళ.. రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. మరోవైపు హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీసేలా హైడ్రా పేరుతో కొనసాగుతున్న విధ్వంసం.. కాంగ్రెస్ పార్టీ కుట్ర వ్యూహాలతో ప్రజలు గందరగోళానికి గురవుతున్నారు. సర్కారు శాఖల మధ్య, మంత్రుల మధ్య సమన్వయం కొరవడి పాలన అస్తవ్యవస్థమైందనే ఆందోళన వ్యక్తం అవుతున్నది. పుట్టెడు కష్టాల్లో ఉన్న ప్రజలకు అండగా నిలబడాల్సిన అనివార్యత నెలకొన్న నేపథ్యంలో బీఆర్‌ఎస్ అనుసరించాల్సిన వ్యూహంపై పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులతో కేసీఆర్ వారం పది రోజుల్లో కీలక సమావేశాన్ని నిర్వహించి దిశానిర్దేశం చేయనున్నట్టు విశ్వసనీయ సమాచారం.

తెలంగాణలో రౌడీ రాజ్యం

- రాజ్యాంగాన్ని రక్షిస్తానని రాహుల్ అంటుంటే.. సీఎం రేవంత్‌రెడ్డి మాత్రం ఖూనీ చేస్తున్నాడు
- బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్



పెద్దపల్లిలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

పెద్దపల్లి, సెప్టెంబర్ 14 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో రౌడీ రాజ్యం నడుస్తున్నదని, రాజ్యాంగాన్ని రక్షిస్తానని రాహుల్ గాంధీ అంటుంటే రేవంత్‌రెడ్డి మాత్రం ఖూనీ చేస్తున్నాడని బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ విమర్శించారు. పెద్దపల్లి జిల్లా పార్టీ నాయకురాలు దాసరి ఉషను పోలీసులు హౌజ్ అరెస్టు చేసిన విషయాన్ని తెలుసుకొన్న ఆయన శనివారం ఆమె ఇంటికి వెళ్లి పరామర్శించారు. హౌజ్ అరెస్టును నిరసిస్తూ బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ కూడలిలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ మీడియాతో మాట్లాడుతూ.. ఏ ప్రాంతంలోనైనా మంత్రులు పర్యటించే సందర్భంలో సమస్యల పరిష్కారం కోసం నాయకులు, ప్రజలు వినతి పత్రాలు ఇచ్చే సంప్రదాయం ఉంటుందని, కానీ పెద్దపల్లి జిల్లాలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పర్యటన సందర్భంగా బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలను ముందస్తు అరెస్టు చేయడం హేయమైన చర్యగా అభివర్ణించారు. రాష్ట్రంలో ఎవరికీ స్వేచ్ఛలేకుండా పాలన సాగిస్తున్నారని మండిపడ్డారు. రేవంత్‌రెడ్డికి బీఆర్‌ఎస్ అంటే అంత భయమెందుకని ప్రశ్నించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్కకు ఆయన పలు ప్రశ్నలను సంధించారు. బడ్జెట్‌లో పెట్టిన ఎస్సీ, ఎస్టీ, బీసీ నిధులు మంజూరు చేశారా? ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 2023 డిసెంబర్ తర్వాత ఒక్క లోనైనా ఇచ్చారా? ఈ అంశాలపై చర్చకు సిద్ధమా? హైదరాబాద్‌లోని 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం వద్ద చర్చకు తాను సిద్ధమని, భట్టి, రేవంత్ సిద్ధమా? అని సవాల్ విసిరారు.



ఎంపీ రవిచంద్రకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ట్రస్ట్ ఆఫ్ పటేల్స్ నిర్వాహకులు

రాజ్యాధికారమే ధ్యేయంగా ముందుకుసాగాలి

- మంత్రివర్గంలో మున్నూరుకాపులకు చోటుదక్కకపోవడం బాధాకరం
- ట్రస్ట్ ఆఫ్ పటేల్స్ ప్రారంభోత్సవంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

హైదరాబాద్, సెప్టెంబర్14(నమస్తే తెలంగాణ): రాజ్యాధికారమే ధ్యేయంగా ముందుసాగాలని రాజ్యసభ సభ్యుడు, మున్నూరుకాపు సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు వద్దిరాజు రవిచంద్ర పిలుపునిచ్చారు. శనివారం హైదరాబాద్‌లో ట్రస్ట్ ఆఫ్ పటేల్స్ ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం నగర శివారులోని నాగారాం ల్యాండ్ మార్క్ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. ఏపీ, తెలంగాణ మంత్రివర్గంలో మున్నూరుకాపులు లేకపోవడం ఇప్పుడే చూస్తున్నామన్నారు. అసెంబ్లీలోనూ ఎమ్మెల్యేల సంఖ్య తగ్గిందని చెప్పారు. వచ్చే మంత్రివర్గ విస్తరణలో ప్రాతినిధ్యం దక్కుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ట్రస్ట్ ఆఫ్ పటేల్స్ ఏర్పాటును స్వాగతిస్తున్నానని పేర్కొన్నారు. ఎంపీ నిధుల నుంచి జగిత్యాల జిల్లాకు చెందిన మిచ్చమ్మ ట్రస్ట్, ట్రస్ట్ ఆఫ్ పటేల్స్‌కు రెండు ఆంబులెన్స్‌లు అందజేస్తానని హామీ ఇచ్చారు. సమావేశంలో విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, జలవనరుల అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ వీ ప్రకాశ్, పబ్లిక్ సర్వీస్ కమిషన్ మాజీ సభ్యుడు సీ విఠల్, రౌతు కనుకయ్య పాల్గొన్నారు.

పౌరహక్కుల నేతల అరెస్ట్

- రఘునాథపాలెం ఎన్‌కౌంటర్ ప్రాంతానికి వెళ్తుండగా అదుపులోకి..
- వెంటనే విడుదల చేయాలి : టీపీఎఫ్ డిమాండ్



మణుగూరులో పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్‌ను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

అశ్వాపురం/సారపాక, సెప్టెంబర్ 14 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కరకగూడెం మండలం రఘునాథపాలెం అటవీ ప్రాంతంలో ఇటీవల జరిగిన ఎన్‌కౌంటర్‌పై నిజనిర్ధారణకు శనివారం బస్సులో వెళ్తున్న పౌరహక్కుల సంఘం నేతలను మణుగూరు పోలీసులు అడ్డుకుని అరెస్ట్ చేశారు. రఘునాథపాలెం అటవీ ప్రాంతంలో ఈ నెల 5న గ్రేహౌండ్స్ బలగాలు, మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ఆరుగురు మావోయిస్టులు మృతిచెందిన విషయం తెలిసిందే. దీనిపై నిజనిర్ధారణ చేపట్టేందుకు పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్, కార్యదర్శి నారాయణతోపాటు మరో 14 మంది ఘటనా స్థలం వద్దకు వెళ్తున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు వారిని అక్కడికి వెళ్లనీయకుండా మణుగూరులో అడ్డుకొని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం మణుగూరు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మీడియాకు విషయం తెలియడంతో అక్కడి నుంచి వారిని అశ్వాపురం పోలీస్‌స్టేషన్‌కు తరలించి నిర్బంధించారు. అనంతరం కొత్తగూడెం వైపు తీసుకెళ్లారు. వారిని ఎక్కడికి తీసుకెళ్తున్నారని ప్రశ్నించిన మీడియాకు.. వివరాలు చెప్పేందుకు సీఐ అశోక్‌రెడ్డి నిరాకరించారు. వీరి నిర్బంధాన్ని ప్రజాఫ్రంట్ రాష్ట్ర కన్వీనర్ నాగభూషణం, కోకన్వీనర్ మంతెన సంజీవరావు ఒక ప్రకటనలో ఖండించారు. వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.





1

లక్ష్మీ పంప్‌హౌజ్ (మేడిగడ్డ)
నిర్మాణ వ్యయం: రూ.4,721 కోట్లు
ప్రస్తుత పరిస్థితి: 40 మెగావాట్ల సామర్థ్యమున్న 11 మోటర్లతో అన్నివిధాలుగా సిద్ధంగా ఉంది. ఎప్పుడంటే అప్పుడు పంపింగ్ చేసుకోవచ్చు.

లక్ష్మీ (మేడిగడ్డ) బరాజ్
నీటి నిల్వ సామర్థ్యం: 16.17 టీఎంసీలు
85 రేడియల్ గేట్లు
నిర్మాణ వ్యయం: రూ.3,348 కోట్లు
ఇది పదేండ్ల క్రితం లేదు.. దీనిని కేసీఆర్ కట్టించారు.
ప్రస్తుత పరిస్థితి: బరాజ్‌లో మొత్తంగా 85పిల్లర్లు. 7 బ్లాక్‌లు. 1.63కిమీ పొడవు. ఇందులో 7వ బ్లాక్‌లోని 20,21 పిల్లర్లు కుంగిపోయాయి. మిగతా అన్ని గేట్లు, బ్లాక్‌లు సురక్షితంగానే ఉన్నాయి.





2

సరస్వతి (అన్నారం) పంప్‌హౌజ్
నిర్మాణ వ్యయం: రూ.3,004 కోట్లు
ప్రస్తుత పరిస్థితి: 40 మెగావాట్ల సామర్థ్యం ఉన్న 8 మోటర్లు ఉన్నాయి. ఎప్పుడంటే అప్పుడు వినియోగించుకునేందుకు ఇది సిద్ధంగా ఉంది.

సరస్వతి (అన్నారం) బరాజ్
నీటి నిల్వ సామర్థ్యం: 10.87 టీఎంసీలు
66 గేట్లు, బరాజ్ పొడవు 1.27 కి.మీ.
నిర్మాణ వ్యయం: రూ.2,327 కోట్లు
ఇది పదేండ్ల క్రితం లేదు.. దీనిని కేసీఆర్ సర్కారు నిర్మించింది.
ప్రస్తుత పరిస్థితి: బరాజ్‌లో రెండు చోట్ల సీపేజీలను గుర్తించారు. వాటిని కూడా గ్రౌటింగ్ చేశారు. ప్రస్తుతం నీటిని నిల్వ చేసి మరోసారి పరీక్షించాల్సి ఉంది.





3

పార్వతి (సుందిళ్ల) పంప్‌హౌజ్
నిర్మాణ వ్యయం: రూ.2,869 కోట్లు
ప్రస్తుత పరిస్థితి: 40 మెగావాట్ల సామర్థ్యం కలిగిన 9 మోటర్లు ఉన్నాయి. ఎప్పుడంటే అప్పుడు పంపులను ప్రారంభించి ఎల్లంపల్లి బరాజ్‌లోకి నీటిని ఎత్తిపోసుకోవచ్చు.

పార్వతి (సుందిళ్ల) బరాజ్
నీటి నిల్వ సామర్థ్యం: 8.83 టీఎంసీలు
బరాజ్ పొడవు 1.45 కి.మీ, 74 రేడియల్ గేట్లు
నిర్మాణ వ్యయం: రూ.1,672 కోట్లు
ఇది పదేండ్ల క్రితం లేదు.. దీనిని కేసీఆర్ సర్కారు నిర్మించింది.
ప్రస్తుత పరిస్థితి: బరాజ్‌లో సీపేజీలు ఉండగా వాటిని కూడా గ్రౌటింగ్ చేశారు. ప్రస్తుతం నీటి నిల్వకు సిద్ధంగా ఉంది.



మల్లన్నసాగర్ టు దౌల్తాబాద్ కెనాల్ నెట్‌వర్క్
నిర్మాణ వ్యయం: రూ.520.50 కోట్లు
ప్రస్తుత పరిస్థితి: కాలువల ద్వారా నీటి తరలింపు కొనసాగుతున్నది.

మల్లన్నసాగర్
నీటినిల్వ సామర్థ్యం: 50 టీఎంసీలు
నిర్మాణ వ్యయం: రూ.7,372.92 కోట్లు
ఇదీ పదేండ్ల క్రితం లేదు. కేసీఆర్ హయాంలోనే నిర్మించారు.
ప్రస్తుత పరిస్థితి: ఈ సీజన్‌లోనూ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నీటిని పంపింగ్ చేస్తున్నది. సీడబ్ల్యూసీ మార్గదర్శకాల ప్రకారం ఇప్పటివరకు 15టీఎంసీలు నింపగా, ఈ ఏడాది 20టీఎంసీల వరకు నింపాలని నిర్ణయించారు.
ప్రస్తుతం నీటి నిల్వ: 17.85 టీఎంసీలు

11



మల్లన్నసాగర్-ముల్కపల్లి-బస్వాపూర్
కెనాల్ నెట్‌వర్క్, సొరంగాలు
నిర్మాణ వ్యయం: రూ.1,339 కోట్లు
ఇదీ కేసీఆర్ హయాంలోనే నిర్మించారు.
ప్రస్తుత పరిస్థితి: నీటి సరఫరా వ్యవస్థ పూర్తిగా సిద్ధంగా ఉంది. ఇప్పటికే ఓటీ 2 ద్వారా యాదాద్రి టెంపుల్ సమీపంలోని గండి చెరువును గతేడాది పూర్తిగా నింపారు.

బస్వాపూర్ రిజర్వాయర్
నీటి నిల్వ సామర్థ్యం: 11.39 టీఎంసీలు
నిర్మాణ వ్యయం: రూ.1,565 కోట్లు
ఇదీ కేసీఆర్ హయాంలోనే నిర్మించారు.
ప్రస్తుత పరిస్థితి: ఇప్పటికే జలాల తరలింపు వెట్ రన్ పూర్తయింది. సర్వం సిద్ధంగా ఉంది. నిర్వాసితులకు దాదాపు రూ. 400కోట్ల పరిహారం చెల్లిస్తే నీటి నిల్వను ఎప్పుడంటే అప్పుడు ప్రారంభించవచ్చు.
ప్రస్తుతం నీటి నిల్వ: 0.31 టీఎంసీలు

10





మల్లన్నసాగర్ టు కొండపోచమ్మసాగర్
మర్కూక్ పంప్‌హౌజ్, కెనాల్ నెట్‌వర్క్
నిర్మాణ వ్యయం: రూ.2,646.77 కోట్లు
ప్రస్తుత పరిస్థితి: ఇదీ కేసీఆర్ సర్కారు నిర్మించింది. ప్రస్తుతం వినియోగంలోనే ఉన్నది. ఈ సీజన్‌లో ఇప్పటికే 6టీఎంసీలను తరలించారు.

9

కొండపోచమ్మ సాగర్
నీటి నిల్వ సామర్థ్యం: 15 టీఎంసీలు
నిర్మాణ వ్యయం: రూ.1,718 కోట్లు
ప్రస్తుత పరిస్థితి: ఇదీ కేసీఆర్ నిర్మించారు. సీడబ్ల్యూసీ మార్గదర్శకాల ప్రకారం ఇప్పటివరకు 8టీఎంసీల జలాలను నింపగా, ఈ ఏడాది 11టీఎంసీల వరకు నింపాలని నిర్ణయించారు. ఈ సీజన్‌లో ఇప్పటికే నీటినిల్వను ప్రారంభించారు. ప్రస్తుతం 10.09టీఎంసీలు నిల్వ ఉన్నాయి.
ప్రస్తుతం నీటి నిల్వ: 10.09 టీఎంసీలు

కూలిందెట్ల? మింగిందెవరు?

వాడుకలోనే 80,377.36 కోట్ల నీటిపంపిణీ వ్యవస్థ
విజయవంతంగా కొనసాగుతున్న కాళేశ్వర ఎత్తిపోతలు
ఎల్లంపల్లి నుంచి కొండపోచమ్మకు గోదావరి పరుగులు

మేడిగడ్డ కుంగింది.. కాళేశ్వరం కథ ఒడిసింది.. ప్రాజెక్టు పనికిరాదు.. లక్ష కోట్లు వృథా.. రీడిజైన్ మొదలు ప్రతి పక్షంలో ఉండగా, ఇప్పుడూ కాంగ్రెస్, కొందరు కుహనా మేధావులు చేస్తున్న వాదనలివి. ప్రాజెక్టు పనితీరుపై వీసమెత్తు అవగాహన లేకుండా చేస్తున్న అడ్డగోలు మాటలివి. మరి అదే నిజమైతే ఎల్లంపల్లి నుంచి కొండపోచమ్మ వరకు జలగర్జనలెక్కడివి? గోదావరి జలాలు పరుగున కొండపోచమ్మ సిగకెట్ల చేరినయ్? మేడిగడ్డ బరాజ్‌లో మొత్తం 85 గేట్లు. కుంగింది 2 పిల్లర్లు. అన్నారం, సుందిళ్ల బరాజ్‌లో నీటి లీకేజీలున్నా వాటిని అధికారులు నిరోధించారు. అయినా కాళేశ్వరం ప్రాజెక్టు పనిరాకుండా పోలేదు. ఎల్లంపల్లి నుంచి కొండపోచమ్మ వరకు పంపులు జలగర్జన చేస్తున్నాయి. సొరంగాలు ఈది, కాలువల్లోకి జారి, కొండలను ఎగబాకుతున్న గోదావరి జలాలను కాళేశ్వరం ప్రాజెక్టు ఎదురెక్కిస్తూనే ఉన్నది. మరి లక్ష కోట్ల అవినీతి ఎక్కడ జరిగింది? ఎలా జరిగింది? ఈ ప్రచారంలో వాస్తవమేమిటి? అనే అంశాలపై తెలంగాణ సమాజం ముందు ఖుల్లంఖుల్లంగా తెలిపేందుకు 'నమస్తే తెలంగాణ' ప్రత్యేక కథనం

(మ్యాకం రవికుమార్)

హైదరాబాద్, సెప్టెంబర్ 14 (నమస్తే తెలంగాణ): నీళ్లు లేకనే తెలంగాణ బీడైంది. రైతు ఆత్మహత్యలకు నెలవైంది. బతుకు పొక్కిలైంది. ఆ నీళ్ల కోసమే దశాబ్దాల పాటు తండ్లాడి.. వాటిని ఒడిసిపట్టాలని ఆరాటపడింది. ఆ పోరాటంలోంచి పుట్టిందే కాళేశ్వరం. 2016లో రూ.81,911 కోట్లతో ప్రాజెక్టు నిర్మాణానికి బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. 2023 వరకు మొత్తంగా ఖర్చు చేసింది రూ.93,872 కోట్లు. అందులోనూ ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు కోసం 2016 వరకు ఖర్చుచేసిన నిధులు రూ.10,146.64 కోట్లు. ఈ నిధులను మినహాయిస్తే కాళేశ్వరం ప్రాజెక్టు కోసం నికరంగా ఖర్చుచేసింది రూ.83,725.36 కోట్లు. మరి ప్రాజెక్టు నిర్మాణంలో రూ.లక్ష కోట్ల అవినీతి ఎక్కడ జరిగింది? ఎలా జరిగింది? అంటే అది పచ్చి అబద్ధం అని తేలిపోతున్నది. ప్రాజెక్టుపై రాజకీయ దుష్ప్రచారం తప్ప మరేమీ లేదని తేటతెల్లమవుతున్నది. కాంగ్రెస్ నేతల మాటల్లో డొల్లతనాన్ని ఈ గణాంకాలే బయటపెడుతున్నాయి.

వినియోగంలోనే 80,377.36 కోట్ల నీటిపంపిణీ వ్యవస్థ

కాళేశ్వరం ప్రాజెక్టును 7 లింకులుగా విభజించారు. అందులో మేడిగడ్డ నుంచి ఎల్లంపల్లి వరకు నీటి తరలింపు వ్యవస్థనంతటినీ లింక్1గా నిర్ణయించారు. ఇందులో మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లతోపాటు వాటికి సంబంధించిన 3 పంప్‌హౌజ్‌లు ఉన్నాయి. లింక్1 పంప్‌హౌజ్‌లన్నీ ఎప్పుడంటే అప్పుడు వినియోగించుకునేందుకు సిద్ధంగా ఉన్నాయి. అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల్లో సాధారణంగా అన్ని బరాజ్‌ల్లో కనిపించే సీపేజీ సమస్యలు ఉన్నాయి. వాటిని కూడా ఇప్పటికే గ్రౌటింగ్ చేసి నీటి నిల్వకు సిద్ధం చేశారు. ఇక సమస్యల్లా ఒక్క మేడిగడ్డ బరాజ్‌లోనే. అది కూడా 7వ బ్లాక్‌లోని 20, 21వ పిల్లర్లు మాత్రమే. అక్కడ కూడా అండర్‌మైనింగ్ జరిగి పిల్లర్ కింది ఇసుక కొట్టుకుపోవటం వల్ల కుంగింది. అక్కడ ఆ సమస్య మినహా బరాజ్‌లో మిగతా 6 బ్లాక్‌లలో ఎలాంటి సమస్య లేదు. గేట్లన్నీ సమర్థంగానే పనిచేస్తున్నాయి. ఇటీవల భారీ వరద వచ్చినా మేడిగడ్డ బరాజ్‌లో ఎలాంటి సమస్యలు తలెత్తలేదు. ప్రస్తుతం మేడిగడ్డ మినహా కాళేశ్వరం ప్రాజెక్టులోని ఏ లింకులోనూ సమస్యలేవు. అన్నీ విజయవంతంగా పనిచేస్తున్నాయి. అందుకు ప్రస్తుతం ఎల్లంపల్లి నుంచి కొండపోచమ్మసాగర్ వరకు నీటిఎత్తిపోతలే సజీవసాక్ష్యం. ఈ లెక్కన మేడిగడ్డ బరాజ్‌కు వెచ్చించిన రూ.3,348 కోట్లు మినహా రూ.80,377.36 కోట్లు వినియోగంలోనే ఉన్నాయి.

ఏనాడూ ఎల్లంపల్లి పూర్తిగా నింపలె

ఎల్లంపల్లి ప్రాజెక్టును తామే నిర్మించామని కాంగ్రెస్ సర్కారు చెప్తున్న గొప్పలన్నీ ఒట్టిమాటలే. ప్రాజెక్టు నిర్మాణం పూర్తిచేసినా దానిని వినియోగంలోకి తీసుకురాలేదన్నది అంతే వాస్తవం. ఎల్లంపల్లి ప్రాజెక్టును జలయజ్ఞంలో భాగంగా 2004లో రూ.3,177 కోట్లతో చేపట్టారు. తెలంగాణ వచ్చేనాటికి ప్రాజెక్టుపై రూ.3,347.27 కోట్లు ఖర్చుపెట్టారు. అయితే మొత్తంగా 20.16 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతో చేపట్టిన ఈ రిజర్వాయర్‌లో తెలంగాణ ఏర్పడేనాటికి ఏనాడూ 5 టీఎంసీలకు మించి జలాలను నిల్వ చేయలేదంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. కారణం భూసేకరణ పూర్తి చేయకపోవటం, ముంపు బాధితులకు పునరావాసం కల్పించకపోవడమే. ప్రాజెక్టు కోసం మొత్తంగా 27,387ఎకరాల భూమిని సేకరించాల్సి ఉండగా, 18,778 ఎకరాలను మాత్రమే సేకరించింది. ఇక పునరావాసం కల్పన కోసం 13,296 ఇండ్లను నిర్మించాల్సి ఉండగా, 1,448 ఇండ్లను మాత్రమే పూర్తిచేసింది. అదీగాక ప్రాజెక్టులో పూర్తిస్థాయిలో నీటినిల్వ వల్ల లక్షెట్టిపేట బ్రిడ్జి మునిగిపోయి ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాలకు రాకపోకలు నిలిచిపోయే పరిస్థితి ఏర్పడింది. అక్కడ హైలెవల్ బ్రిడ్జి నిర్మించాల్సి ఉన్నా అది పూర్తి చేయలేదు. కానీ తెలంగాణ ఏర్పాటు తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం మరో రూ.2,052.73 కోట్లను వాటి కోసం వెచ్చించింది. బరాజ్‌ను 2016లో పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకొచ్చింది.

కమీషన్ల కోసం కట్టిందెవరు?

కమీషన్ల కోసమే ప్రాజెక్టును కట్టారని కాంగ్రెస్ నేతల ఆరోపణల్లో నిజమెంత? అని పరిశీలిస్తే ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు ద్వారా 12.20 లక్షల ఎకరాలకు సాగునీటిని అందించేందుకు 2007లో రూ.17,875 కోట్లతో ప్రతిపాదించారు. మరో 4.20లక్షల ఎకరాల ఆయకట్టును ప్రాజెక్టులో చేర్చి మొత్తంగా 16.40 లక్షల ఎకరాలకు సాగునీటిని అందివ్వాలని నిర్ణయించి మొత్తం ప్రాజెక్టు వ్యయాన్ని రూ.38,500 కోట్లకు పెంచారు. ప్రాజెక్టు పెరిగిన ఆయకట్టు 34 శాతం కాగా, ప్రాజెక్టు వ్యయాన్ని ఏకంగా 115 శాతానికి పెంచారు. ఆ తర్వాత 2010లో డీపీఆర్ సమర్పించేనాటికి ప్రాజెక్టు వ్యయాన్ని రూ.45,000 కోట్లకు.. అంటే దాదాపు 15 శాతం పెంచారు. ఆ లెక్కన వేసుకున్నా అదే ప్రాజెక్టును యథాతథంగా ఇప్పటి రేట్ల ప్రకారం చేపట్టినా దాదాపు రూ.లక్షల కోట్లకు చేరుతుంది.

ఇదిలాఉంటే ప్రాణహిత ప్రాజెక్టు నిర్మాణానికి మొత్తంగా 85 వేల ఎకరాల భూమి సేకరించాల్సి ఉండగా, 2012 నాటికి 2,685 ఎకరాలు మాత్రమే సేకరించారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. అంతేగాకుండా ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టుల్లోని అన్ని ప్యాకేజీల పనులకు సర్వే పర్సెంటేజీను తొలుత 0.43 నుంచి 0.50 శాతంగా నిర్ణయించారు. తరువాత 2 నుంచి 3.50 శాతానికి పెంచారు. మొత్తంగా సర్వేకు 172.12 కోట్లు మాత్రమే. కానీ ఒప్పందాలు చేసుకునే నాటికే ఆ ఖర్చును ఏకంగా రూ.1,211.23 కోట్లకు పెంచారు. ఎక్కడైనా లిఫ్ట్ ఇరిగేషన్ పనుల్లో ముందుగా హెడ్‌వర్క్స్ పూర్తిచేస్తారు. అంటే నీటి ఎత్తిపోతలకు సంబంధించిన పంప్‌హౌజ్‌లు, బరాజ్‌లు, రిజర్వాయర్లు తదితర పనులు అన్నమాట. ఆ తర్వాత నీటి పంపిణీ వ్యవస్థ కాల్వలు, ఉప కాల్వలు, పిల్ల కాల్వలను క్రమానుగతంగా చేపడతారు. కానీ నాటి కాంగ్రెస్ సర్కారు ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టులో అతి కీలకమైన హెడ్‌వర్క్స్‌ను వదిలి కేవలం కాల్వలను మాత్రమే తవ్వి వదిలిపెట్టింది. మొబిలైజేషన్ అడ్వాన్స్‌ల కింద రూ.వేల కోట్లు దండుకుని హెడ్‌వర్క్స్‌ను గాలికి వదిలిపెట్టింది. తెలంగాణ ఏర్పడేనాటికే దాదాపు పీసీసీ ప్రాజెక్టుపై మొత్తంగా రూ.11 వేల కోట్లకుపైగా పనులు చేశారంటే కమీషన్ల కోసం కేవలం కాల్వల పనులు చేసిందెవరనేది తేలిపోతున్నది.



కాళేశ్వరం ప్రాజెక్టు వ్యయం ఇలా..

కాళేశ్వరం ప్రాజెక్టు ప్రతిపాదిత వ్యయం
రూ.81,911 కోట్లు

కాళేశ్వరం మొత్తం ఖర్చు
రూ. 93,872 కోట్లు

అందులో 2016 వరకు పీసీఎస్ఎస్ కోసం ఖర్చు
రూ. 10,146.64 కోట్లు

అంటే ప్రాజెక్టుపై నికరంగా చేసిన ఖర్చు
రూ. 83,725.36 కోట్లు

(మేడిగడ్డ బరాజ్ కోసం వెచ్చించిన రూ.3,348 కోట్లు మినహాయిస్తే ఇప్పటికీ 80,377.36 కోట్ల విలువైన ఆస్తులు వినియోగంలోనే ఉన్నాయి. ప్రస్తుత కాంగ్రెస్ సర్కారు సైతం వాటిని వినియోగించుకుంటామని వెల్లడించింది)



4

ఎల్లంపల్లి బరాజ్
నీటి నిల్వ సామర్థ్యం: 20.18 టీఎంసీలు
నిర్మాణ వ్యయం: రూ.5,400 కోట్లు
ప్రస్తుతం నీటి నిల్వ: 20.18 టీఎంసీలు
ప్రస్తుత పరిస్థితి: దీనిని 2004లో కాంగ్రెస్ ప్రారంభించినా 5టీఎంసీలకు మించి నిల్వ చేయలేదు. రాష్ట్ర ఏర్పాటు తరువాత కేసీఆర్ దీనిని పూర్తిచేశారు. 2016నుంచే ఎఫ్ఆర్ఎల్ వరకు నీటి నిల్వను ప్రారంభించారు.

ప్రాణహిత-చేవేళ్ల, కాళేశ్వరం ప్రాజెక్టు మధ్య తేడాలు

వివరాలు	ప్రాణహిత చేవేళ్ల	కాళేశ్వరం	అదనం
ప్రాజెక్టు విలువ (కోట్లలో)	రూ.38,500 కోట్లు (2007 రేట్ల ప్రకారం)	రూ.81,911.1 కోట్లు (2016 రేట్లు)	రూ.43,411.1 కోట్లు
కొత్త ఆయకట్టు	16.40 లక్షల ఎకరాలు	19.23 లక్షల ఎకరాలు	2.83 లక్షల ఎకరాలు
స్థిరీకరణ ఆయకట్టు	ఏమీ లేదు	18.60 లక్షల ఎకరాలు	18.60 లక్షల ఎకరాలు
ఎత్తిపోతల జలాలు	160 టీఎంసీలు	195 టీఎంసీలు	35 టీఎంసీలు
బరాజ్‌ల సంఖ్య	1	3	2
రిజర్వాయర్ల సంఖ్య	7	17	10
మొత్తం నీటి నిల్వ	14.7 టీఎంసీలు	141.7 టీఎంసీలు	127 టీఎంసీలు
నీటిసరఫరా వ్యవస్థ నిడివి	1,055 కిలోమీటర్లు	1,832 కిలోమీటర్లు	777 కిలోమీటర్లు
లిఫ్టుల సంఖ్య	22	20	-
మోటర్ల మొత్తం సామర్థ్యం	3,466 మెగావాట్లు	4,627 మెగావాట్లు	1161 మెగావాట్లు
లబ్ధిపొందే జిల్లాలు	7	13	6





5

నంది పంప్‌హౌజ్ (ప్యాకేజీ 6)
ప్రాజెక్టులో తొలి భూగర్భ పంప్‌హౌజ్. ఇక్కడ 127.6 మెగావాట్ల సామర్థ్యమున్న 7 మోటర్లతో 128 మీటర్ల నుంచి 233 మీటర్ల ఎత్తులో ఉన్న నంది రిజర్వాయర్‌లో నీటిని ఎత్తిపోస్తారు.
నిర్మాణ వ్యయం: రూ.5,405 కోట్లు
ప్రస్తుత పరిస్థితి: సిద్ధంగా ఉంది. నిన్నమొన్నటివరకు కూడా నీటిని ఇక్కడి నుంచి పంపింగ్ చేశారు. మిడ్‌మానేరుకు ఈ సీజన్‌లో ఇప్పటికే దాదాపు 12టీఎంసీలకు పైగా జలాలను తరలించారు.

నంది రిజర్వాయర్ (ప్యాకేజీ 7)
నిర్మాణ వ్యయం: రూ.1,738 కోట్లు
ధర్మారం మండలం నందిమేడారంలో ఉన్నది. రామడుగు మండలం గాయత్రి (లక్ష్మీపూర్) పంప్ హౌజ్‌కు నీటి తరలింపు కోసం ఇక్కడి పాత చెరువునే రిజర్వాయర్‌గా కేసీఆర్ హయాంలోనే విస్తరించారు. పూర్తిగా వినియోగంలోనే ఉన్నది.
ప్రస్తుతం నీటి నిల్వ: 0.50 టీఎంసీలు





8

రంగనాయకసాగర్ టు మల్లన్నసాగర్ (తుక్కాపూర్ పంప్‌హౌజ్)
నిర్మాణ వ్యయం: రూ.3,553.92 కోట్లు
ప్రస్తుత పరిస్థితి: 43 మెగావాట్ల సామర్థ్యంతో 8 మోటర్లు ఉన్నాయి. ఇప్పుడు కూడా జలాలను ఎత్తి శ్రీకొమురవెల్లి మల్లన్నసాగర్‌లోకి పంపింగ్ చేస్తున్నారు

రంగనాయకసాగర్ (ప్యాకేజీ 12)
నీటి నిల్వ సామర్థ్యం: 3 టీఎంసీలు
నిర్మాణ వ్యయం: రూ.497 కోట్లు
ప్రస్తుతం నీటి నిల్వ: 2.62టీఎంసీలు
ప్రస్తుత పరిస్థితి: ఇదీ పదేండ్ల క్రితం లేదు. కేసీఆర్ హయాంలోనే నిర్మించారు. ఈ సీజన్‌లోనూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం నీటిని నిల్వ చేస్తున్నది.





7

అన్నపూర్ణ-రంగనాయకసాగర్ (చంద్లాపూర్ పంప్‌హౌజ్) (ప్యాకేజీ 11)
నీటి నిల్వ సామర్థ్యం: 3.5 టీఎంసీలు
నిర్మాణ వ్యయం: రూ.3,373 కోట్లు
ప్రస్తుత పరిస్థితి: ఇదీ కేసీఆర్ నిర్మించారు. చంద్లాపూర్ వద్ద నిర్మించిన పంపుహౌజ్‌లో 134 మెగావాట్ల సామర్థ్యం ఉన్న 4 మోటర్లు ఉన్నాయి. ప్రస్తుతం రంగనాయకసాగర్ రిజర్వాయర్‌లోకి ఇక్కడి నుంచి నుంచి జలాల ఎత్తిపోతలు అంతరాయం లేకుండా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కొనసాగిస్తున్నది.

అనంతసాగర్, తిప్పాపూర్ సర్జ్‌పూల్, పంప్‌హౌజ్ (ప్యాకేజీ 10)
నీటి నిల్వ సామర్థ్యం: 3.5 టీఎంసీలు
నిర్మాణ వ్యయం: రూ.3,135 కోట్లు
ప్రస్తుతం నీటి నిల్వ: 2.93 టీఎంసీలు
ప్రస్తుత పరిస్థితి: ఇదీ కేసీఆర్ హయాంలోనే నిర్మించారు. ప్రస్తుతం మిడ్‌మానేరు నుంచి రిజర్వాయర్‌లోకి పంపింగ్ విజయవంతంగా కొనసాగుతున్నది.

1) లింక్ 1 (3 బరాజ్‌లు, లిఫ్టులు)
రూ.17,941 కోట్లు
2) లింక్ 2 (ఎల్లంపల్లి-మిడ్‌మానేరు)
రూ.16,325.01 కోట్లు
3) లింక్ 3 (ఎంఎంఆర్- అప్పర్‌మానేరు)
రూ.1,258.00 కోట్లు
4) లింక్ 4 (ఎంఎంఆర్-కొండపోచమ్మ)
రూ.27,654.47 కోట్లు
5) లింక్ 5 (అనికట్-చిట్యాల వరకు)
రూ.2,202.45 కోట్లు
6) లింక్ 6(మల్లన్నసాగర్-సింగూరు)
రూ.1,216.42 కోట్లు
7) లింక్ 7 (ఎస్సారెస్పీ- భూంపల్లి)
రూ.4,068.38 కోట్లు



గాయత్రి పంప్‌హౌజ్ (ప్యాకేజీ 8)
ఇది కరీంనగర్ జిల్లా రామడుగు మండలం లక్ష్మీపూర్‌లో భూగర్భంలో కేసీఆర్ హయాంలోనే నిర్మించారు.
నిర్మాణ వ్యయం: రూ.5,397 కోట్లు
ప్రస్తుత పరిస్థితి: ఇక్కడ 139 మెగావాట్ల సామర్థ్యమున్న పంపులు సిద్ధంగా ఉన్నాయి. శ్రీరాజరాజేశ్వర జలాశయానికి ఎప్పుడంటే అప్పుడు జలాలను తరలించేందుకు సిద్ధంగా ఉన్నాయి. ఈ సీజన్‌లో ఇప్పటికే 12టీఎంసీలకు పైగా జలాలను ఇటీవల వర్షాలు కురిసే సమయం వరకు తరలించారు.

మలక్‌పేట రిజర్వాయర్, పంప్‌హౌజ్‌లు (ప్యాకేజీ 9)
నీటి నిల్వ సామర్థ్యం: 3 టీఎంసీలు
నిర్మాణ వ్యయం: రూ.513 కోట్లు
ప్రస్తుత పరిస్థితి: ఇదీ కేసీఆర్ హయాంలోనే పూర్తయింది. మిడ్‌మానేరు నుంచి ఎప్పుడంటే అప్పుడు జలాలను రిజర్వాయర్‌కు తరలించవచ్చు. ఇటీవలనే వెటరన్ విజయవంతంగా పూర్తయింది.
ప్రస్తుతం నీటి నిల్వ: 1 టీఎంసీ



6

మిడ్‌మానేరునూ పూర్తిచేయలె

వరద రావడం తగ్గిపోతున్నా ఎస్సారెస్పీపై 1990లో వరద కాల్వకు శ్రీకారం చుట్టారు. మొత్తంగా 22 టీఎంసీలతో 2,20,000 ఎకరాలకు సాగునీరివ్వాలని ప్రణాళిక సిద్ధం చేశారు. అందులో మొదటగా ఎస్సారెస్పీ వద్ద ముప్కాల్ నుంచి హెడ్‌రెగ్యులేటర్ ద్వారా వరదను 43.30 కిలోమీటర్ల గ్రావిటీ ద్వారా కోనరావుపేట పెద్దవాగుకు తరగలించాలి. పెద్దవాగుపై కోరుట్ల వద్ద రిజర్వాయర్ నిర్మించాలి. అక్కడి నుంచి 66.45 కిలోమీటర్ల దూరంలో మనువాడ సమీపంలోని మిడ్‌మానేరుకు తరలించాలి. అక్కడ రిజర్వాయర్ నిర్మించాలి. ఆ తర్వాత మిడ్ మానేరు నుంచి ఎత్తిపోతల ద్వారా 63.34 కిలోమీటర్ల దూరంలో గౌరవెల్లి గ్రామసమీపాన సర్వీస్ రిజర్వాయర్‌కు తరలించాలి. అక్కడి నుంచి గ్రావిటీ ద్వారా 125 కిలోమీటర్ల దూరంలో ఆలేరుకు తరలించాలి. నాటి పాలకులు వరదకాల్వ తవ్వారు. అన్నీ మరిచారు. ఎగువ నుంచి వరద వస్తే తప్ప ప్రాజెక్టు మనుగడ లేదు. తెలంగాణ ఏర్పడేనాటికి మధ్యమానేరు, తోటపల్లి, గౌరవెల్లి రిజర్వాయర్లకు శంకుస్థాపన చేసినా పనులు పూర్తికాలేదు.

తెలంగాణ ఏర్పడేనాటికి 44 ఏండ్లలో 28.48 శాతం మేరకు నీటి నిల్వాసామర్థ్యం తగ్గిపోయింది. మరోవైపు మహారాష్ట్ర బాబ్లీ, ఇతర ప్రాజెక్టులు నిర్మించి గోదావరిని దిగ్బంధించటంతో వరద మార్గం మూసుకుపోయింది. దీంతో వరదకాల్వ ప్రాజెక్టే ప్రశ్నార్థకంగా మారిన దుస్థితి. కానీ కాళేశ్వరం ప్రాజెక్టుతో వరద కాల్వను అనుసంధానించటంతో అదిప్పుడు జీవధారగా మారింది. ఎస్సారెస్పీకి నీటిని తరలించేందుకు కూడా ఇదే ప్రధానంగా నిలుస్తున్నది. ఎస్సారెస్పీ నుంచి మధ్యమానేరు వరకు వరదకాల్వ మొత్తం 122 కిలోమీటర్ల పొడవునా జీవనదిలా మారింది. వరద ఆధారంగా రూపొందించిన మిడ్‌మానేరుకు కూడా నేడు కాళేశ్వరం ప్రాజెక్టే జీవధారగా నిలిచింది.



ప్రస్తుతం నీటి నిల్వ: 25.73 టీఎంసీలు

రూ.కోట్ల విలువైన అదనపు పనులు

కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగానే నిర్మించిన రిజర్వాయర్లు, పంప్‌హౌజ్‌లు, కాల్వలే కాదు ఇంకా రూ.వేల కోట్లు వెచ్చించి నిర్మించిన అదనపు నిర్మాణాలు ఉన్నాయి. అవన్నీ వినియోగించుకునే అవకాశం ఉన్నది. మల్లన్నసాగర్ ప్రాజెక్టు నుంచి నిజాంసాగర్, సింగూరు ప్రాజెక్టులను నింపే అవకాశం కలిగింది. అందుకోసం ప్రభుత్వం రూ.కోట్లు వెచ్చించి నిర్మాణాలను చేపట్టింది. వరదకాల్వపై దాదాపు 34 తూములను (ఓటీ) నిర్మించింది. వరదకాల్వ, కాకతీయ కెనాల్‌ను అనుసంధానం చేసింది. ఎల్ఎండీ నుంచి కాకుండా నేరుగా కాళేశ్వరం ఎత్తిపోతల జలాలను అందించే వెసులుబాటును ఏర్పాటు చేసింది. ఎస్సారెస్పీకి నీటిని ఎత్తిపోసే ఏర్పాట్లు చేసింది. అందుకు పంప్‌హౌజ్‌లను నిర్మించింది. ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగానే అనేక అదనపు నిర్మాణాలు, ఓటీలు, చెరువుల విస్తీర్ణం పెంచడం వంటి పనులను కూడా రూ.కోట్లు ఖర్చుపెట్టి పూర్తిచేసింది. నేడు అ వనరులన్నీ వినియోగంలోనే ఉన్నాయి. ప్రస్తుత కాంగ్రెస్ సర్కార్ సైతం ఆ వనరులను వినియోగిస్తామని బాహాటంగానే ప్రకటించింది. మరి అలాంటప్పుడు రూ.లక్ష కోట్ల అవినీతి ఎక్కడ జరిగింది? ఎలా జరిగింది? అనేది కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ సమాజానికి చెప్పాలి.



వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

మంచానపడ్డ మన తెలంగాణ

విస్తారమైన వర్షాలు కురవడంతో రాష్ట్రంలో మొన్నటిదాకా వరదలు పోటెత్తాయి. దాంతో పారిశుద్ధ్యం పేరుకుపోయింది. తత్ఫలితంగా విష జ్వరాలు విజృంభిస్తుండటంతో ఇప్పుడు రాష్ట్ర ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీ వ్యవస్థలు విఫలమవ్వడమే అందుకు ప్రధాన కారణం. యావత్ తెలంగాణ ఇప్పుడు మంచానపడ్డది. రాష్ట్ర ప్రభుత్వం మొద్దు నిద్ర వీడకపోతుండటంతో ప్రజలు కార్పొరేట్ దవాఖానలకు క్యూ కడుతున్నారు. లక్షల్లో ఖర్చుపెడుతున్నారు. అయినప్పటికీ కొందరు ప్రాణాలు కోల్పోతుండటం బాధాకరం.



డాక్టర్ నలమాస శ్రీకాంత్‌గౌడ్
88866 66006

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలేసింది. కాగా, పాలకులు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని అబాసుపాలు చేయడంపైనే దృష్టిసారిస్తున్నారు. వారు పట్టించుకోకపోవడంతో అధికారులు ఉదాసీనతతో వ్యవహరిస్తున్నారు. దీంతో రాష్ట్రంలోని అన్ని వ్యవస్థలు కుంటుపడ్డాయి. ఫలితంగా రాష్ట్రంలో పాలన పడకేసింది.

కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పరిస్థితి భిన్నంగా ఉండేది. కుటుంబం బాగుంటేనే సమాజం బాగుంటుందని నమ్మే కేసీఆర్ తన పాలనలో ప్రజారోగ్యం, మాతాశిశు, మహిళల సంక్షేమానికి పెట్టపీట వేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను పటిష్ఠపరిచారు. జిల్లాకో వైద్య కళాశాలను ఏర్పాటుచేశారు. ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించి సీజనల్ వ్యాధుల పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండేలా చేశారు. అంతకంటే ముందే గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీ సిబ్బందికి, స్థానిక ప్రజాప్రతినిధులకు పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించారు. తడి, పొడి చెత్త సేకరణ, మురుగుకాల్వల నిర్వహణ ద్వారా ప్రజారోగ్యాన్ని కాపాడారు. కానీ, గత 9 నెలలుగా పరిస్థితి తారుమారైంది. స్థానిక ప్రజాప్రతినిధుల పదవీకాలం ముగియడంతో అధికారులే రాజ్యమేలుతున్నారు. రేవంత్ సర్కార్ ఒక్కో అధికారికి రెండు, మూడు గ్రామాల బాధ్యత అప్పగించడంతో పర్యవేక్షణ కొరవడింది. దీంతో ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోయి ప్రజలు రోగాల బారినపడుతున్నారు.

కౌన్సిలర్లను ప్రలోభపెట్టి, దొడ్డిదారిన మున్సిపాలిటీలను చేజిక్కించుకుంటున్న కాంగ్రెస్ సర్కార్ ప్రజా సంక్షేమంపై దృష్టిపెట్టడం లేదు. అడ్డదారిలో అందలమెక్కుతూ అధికారాన్ని కైవసం చేసుకుంటున్న కాంగ్రెస్ నేతలు అక్రమ సంపాదన కోసం అర్రులు చాస్తున్నారే తప్ప ప్రజల బాగోగులను పట్టించుకోవడం లేదు.



రాష్ట్రంలో నమోదవుతున్న డెంగ్యూ కేసులు దడ పుట్టిస్తున్నాయి. జనవరి నుంచి ఆగస్టు వరకు 6,848 మందికి డెంగ్యూ సోకినట్టు అధికారిక లెక్కలు చెప్తున్నాయి. వీటిలో హైదరాబాద్‌లో నమోదైనవే 2,697 కావడం గమనార్హం. మేడ్చల్, సూర్యాపేట, ఖమ్మం, నల్గొండ, రంగారెడ్డి జిల్లాల్లో మిగతా కేసులు నమోదైనట్టు ప్రభుత్వం వెల్లడించింది. కానీ, అనధికారికంగా రాష్ట్రవ్యాప్తంగా 32 వేలకు పైగా డెంగ్యూ కేసులు నమోదైనట్టు తెలుస్తున్నది. ఈ నేపథ్యంలో కేసుల నమోదు, మరణాల రేటును ప్రభుత్వం దాచిపెడుతున్నదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జూలై నుంచి ఇప్పటివరకు 1.42 కోట్ల మందికి పైగా జ్వర సర్వే చేసి అతి తక్కువ డెంగ్యూ కేసులు నమోదైనట్టు వైద్యారోగ్య శాఖ ప్రకటించడంపై అనుమానాలు తలెత్తుతున్నాయి.

విషజ్వరాల బాధితులతో హైదరాబాద్‌లోని నీలోఫర్, గాంధీ, ఉస్మానియా, ఫీవర్ ఆసుపత్రులతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు దవాఖానలు కిటకిటలాడుతున్నాయి. సరైన వైద్యం అందక రెండు, మూడు రోజుల్లోనే ఆరోగ్యం విషమించి మరణాలు సంభవిస్తున్నాయి. అయినా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటం గర్హనీయం. ప్రభుత్వ దవాఖానల్లో సరైన వసతులు, మందులు అందుబాటులో లేకపోవడంతో చాలామంది రోగులు ప్రైవేట్ ఆస్పత్రుల దోపిడికి గురవుతున్నారు.

మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. ముక్కు పచ్చలారని చిన్నారులు కుక్కకాటుకు బలవుతున్నారు. వేలాది మంది పిల్లలు గాయాల పాలవుతున్నారు. అయినా కాంగ్రెస్ ప్రభుత్వం కనికరించడం లేదు. ఈ విషయమై హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని మందలించిందంటేనే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

ఇదిలా ఉంటే.. గురుకులాల్లో పరిస్థితులు మరింత దయనీయమయ్యాయి. అటు ఆహార కలుషితం.. ఇటు విష స్పర్పాల కాట్లతో విద్యార్థులు ప్రాణాలు కోల్పోతుండటం తల్లిదండ్రులను కలవరపెడుతున్నది. కేసీఆర్ హయాంలో పూర్ణ, ఆనంద్ లాంటి విద్యార్థులు హిమాలయాలను అధిరోహించారు. కానీ, రేవంత్ హయాంలో ఫుడ్ పాయిజన్, సౌకర్యాల లేమి, పాముకాట్లతో విద్యార్థులు బిక్కుబిక్కుమంటు కాలం వెళ్లదీస్తున్నారు.

అక్రమార్కులతో కుమ్మక్కవుతున్న ప్రిన్సిపల్స్ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. వారి భవిష్యత్తును ప్రమాదంలోకి నెడుతున్నా రేవంత్ సర్కార్ చోద్యం చూస్తున్నది. మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. ముక్కు పచ్చలారని చిన్నారులు కుక్కకాటుకు బలవుతున్నారు. వేలాది మంది పిల్లలు గాయాల పాలవుతున్నారు. అయినా కాంగ్రెస్ ప్రభుత్వం కనికరించడం లేదు. ఈ విషయమై హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని మందలించిందంటేనే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

ఇక రాష్ట్రంలోని పెద్ద పెద్ద హోటళ్లలో కలుషిత ఆహారం పట్టుబడటం సర్వసాధారణమైంది. పాడైపోయిన, గడువు ముగిసిన పదార్థాలను వినియోగదారులకు విక్రయిస్తుండటం బాధాకరం. ఇవి హైదరాబాద్‌లో వెలుగుచూసిన దారుణాలు మాత్రమే. కరీంనగర్, వరంగల్ లాంటి ద్వితీయశ్రేణి నగరాల్లో తదితర ఫుడ్ సేఫ్టీ అధికారుల కొరత తీవ్రంగా ఉన్నది. దాంతో అక్కడ జరిగే దారుణాలు అంతగా వెలుగులోకి రావడం లేదు.

రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వ పాలకులు గత బీఆర్‌ఎస్ సర్కారుపై అభాండాలు వేస్తూ కాలం వెళ్లదీస్తున్నారు. వాళ్ల నిర్లక్ష్యపూరిత ధోరణితోనే రాష్ట్రంలో ఇన్ని ఘోరాలు జరుగుతున్నాయి. ప్రజలు సమిధలవుతున్నారు. కాబట్టి ఇకనైనా రేవంత్ సర్కార్ మొద్దునిద్రను వీడాలి. ప్రభుత్వం తన తీరును మార్చుకొని సంక్షేమంపై దృష్టిసారించకపోతే ప్రజల తిరుగుబాటు ను ఎదుర్కోవాల్సిన పరిస్థితి తప్పకుండా వస్తుం ది. ఇందులో ఏ మాత్రం సంశయం అక్కరలేదు.

(వ్యాసకర్త: బీఆర్‌ఎస్ నాయకులు)



కాంగ్రెస్ ఆనవాళ్లే కనుమరుగు!



చిటుకుల మైసారెడ్డి
94905 24724

రాష్ట్రంలో కాంగ్రెస్ పాలకుల వికృత చేష్టలు పెచ్చుమీరుతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రశ్నిస్తే దాడులు చేస్తున్నది. నిలదీస్తే నిర్బంధిస్తున్నది. ప్రజాపాలన అంటే ఇదేనా? ఇందిరమ్మ రాజ్యం అంటే ఇదేనా? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

ప్రజాపాలన, ఇందిరమ్మ రాజ్యం అంటూ గప్పాలు కొడుతున్న కాంగ్రెస్ సర్కార్ పౌర సమాజంపై ఉక్కుపాదం మోపుతున్నది. తెలంగాణ ప్రజల స్వేచ్ఛ, వాక్ స్వాతంత్ర్యం, హక్కులను కాలరాస్తున్నది. గత బీఆర్‌ఎస్ సర్కార్‌పై విషప్రచారం చేసి, మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ గద్దెనెక్కిన నాటినుంచీ ప్రజా గొంతుకలను అణచివేయాలని తీవ్రంగా ప్రయత్నిస్తున్నది. బహుజన, దళిత, గిరిజన నాయకులపై అక్రమ కేసులు బనాయిస్తూ వారిని భయభ్రాంతులకు గురిచేస్తున్నది. ప్రజాపాలన, ఇందిరమ్మ రాజ్యంలో అఘాయిత్యాలు, దోపిడీలు, హత్యలు షరామామూలైపోయాయి. ప్రశ్నిస్తే చాలు పాలకులు ఉలిక్కిపడుతున్నారు. గొంతెత్తితే చాలు భయపడిపోతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ దమనకాండను చూసి ప్రజలు అసహ్యించుకుంటున్నారు.

కాంగ్రెస్ సర్కార్ కొలువై తొమ్మిది నెలలు గడుస్తున్నా ఏ ఒక్క హామీ నెరవేరలేదు. హామీల అమలు కోసం నినదిస్తున్నవారిపై హస్తం ప్రభుత్వం కక్ష గడుతున్నది. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, నాయకులు శాంతియుతంగా నిరసన తెలిపినా ప్రభుత్వం దాడులకు తెగబడుతున్నది. నిజానిజాలను ప్రజలకు తెలియజేస్తున్న మీడియాపై చిందులు వేస్తున్నది. మాజీ మంత్రి హరీశ్‌రావు క్యాంపు కార్యాలయంపై దాడి, ఖమ్మంలో బీఆర్‌ఎస్ నాయకులపై రాళ్ల దాడి, ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై హత్యాయత్నం.. ఇవన్నీ అందులో భాగమే.

కేసీఆర్ నేతృత్వంలోని గత బీఆర్‌ఎస్ సర్కార్ పాలనలో పదేండ్ల పాటు రాష్ట్రంలో ఎలాంటి అలజడి, ఆందోళనలు కనిపించలేదు. స్వరాష్ట్ర సాధన కోసం అహర్నిశలు శ్రమించిన కేసీఆర్.. ఆ తర్వాత తెలంగాణ పునర్నిర్మాణం కోసమూ అంతే కృషిచేశారు. అందుకే అభివృద్ధి, సంక్షేమంలో దూసుకుపోయిన తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది. అన్నింటికీ మించి తెలంగాణలో స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం, సోదరభావం వెల్లివిరిశాయి.

దేశానికే ఆదర్శంగా నిలిచిన మన తెలంగాణ ఇప్పుడు అతితక్కువ కాలంలోనే సమస్యల నిలయంగా మారిపోయింది. గురుకులాల విద్యార్థులు, రైతాంగం, ఉద్యోగులు, ఆటో కార్మికులు.. ఇలా అన్ని రంగాల ప్రజలు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నారు. కోతలు, కొర్రీలతో అరకొరగా రుణమాఫీ చేయడంతో రైతులు రోడ్డెక్కాల్సిన దుస్థితి దాపురించింది. వానకాలం సీజన్ ముగుస్తున్నా రైతు భరోసా ఇంకా అందలేదు. పింఛన్ల పెంపు సంగతి పక్కనపెడితే అసలు పింఛన్లే సమయానికి అందడం లేదు. కేసీఆర్ కిట్‌కు కటకట ఏర్పడింది. ఇలా నమ్మి ఓట్లేసిన అన్నివర్గాల ప్రజలను కాంగ్రెస్ నట్టేట ముంచుతున్నది.

ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరుతున్న ప్రతిపక్ష నాయకులపై కాంగ్రెస్ ప్రభుత్వం దాడులు తెగపడుతూ డైవర్షన్ రాజకీయాలకు పాల్పడుతున్నది. అరికెపూడి గాంధీ, ఆయన అనుచరులు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఇంటిపై తెగబడిన తీరు విస్మయం కలిగిస్తున్నది. హైదారాబాద్ నడిబొడ్డున పట్టపగలే ఒక ఎమ్మెల్యేపై దాడికి పాల్పడ్డారంటే వారి వెనుక ఎవరి ప్రోద్బలం ఉన్నదో అర్థమవుతున్నది. ఇటువంటి ఘటనలను ఖండించాల్సిన సీఎం రేవంత్ రెడ్డి దాడిని సమర్థించే ప్రయత్నం చేయడం గర్హనీయం. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ చెప్పేదొకటైతే.. ఆ పార్టీ సీఎం రేవంత్‌రెడ్డి చేసేదొకటి. రాజ్యాంగాన్ని చేతిలో పట్టుకొని నీతులు చెప్పే రాహుల్‌గాంధీ తెలంగాణలో జరుగుతున్న దమనకాండపై స్పందించకపోవడం శోచనీయం.

ఇలాంటి ప్రతీకార చర్యలకు పాల్పడితే పోయేది కాంగ్రెస్ పరువే. ప్రశ్నించే గొంతుకలను నొక్కాలని చూస్తే ప్రజలే కాంగ్రెస్ గొంతు నొక్కుతారు. ప్రజా పోరాటాన్ని అణచివేయాలని చూస్తే ప్రజలే మిమ్మల్ని అణగదొక్కుతారు. తెలంగాణతో గోక్కున్నోడికి పుట్టగతులుండవు. 'పునాదులను పెకిలిస్తా, చరిత్రను మలినం చేస్తా, ఆనవాళ్లు లేకుండా చేస్తా' అంటే తెలంగాణ సమాజం చూస్తూ ఊరుకోదు. కాంగ్రెస్ ఆనవాళ్లే లేకుండా చేస్తది. తెలంగాణ పౌరుషం ఆ పార్టీ నషాళానికి అంటుకుంటుంది. భయపడే తెలంగాణ కాదిది. ఈ నేపథ్యంలో తెలంగాణను ధ్వంసం చేస్తూ, తెలంగాణ అస్తిత్వం దెబ్బతినేలా వ్యవహరిస్తున్న రేవంత్‌రెడ్డి తీరును అందరూ ముక్తకంఠంతో ఖండించాలి.

నవాబ్ అలీ నవాజ్ జంగ్ బహదూర్.. తెలంగాణ సాగునీటి ప్రాజెక్టులకు ఆద్యుడు, ఇంజినీరింగ్ లోకానికి పూజ్యుడు. యావత్ భారతదేశం గర్వించదగిన ఇంజినీర్ దిగ్గజాల్లో ఆయన కూడా ఒకరు. సర్ ఆర్థర్ కాటన్, కేఎల్ రావు, మోక్షగుండం విశ్వేశ్వరయ్య వంటి దిగ్గజాల సరసన నిలిచిన గొప్ప ఇంజినీర్ మన తెలంగాణలో పుట్టడం మనకు గర్వకారణం.

ప్రాజెక్టులకు ఆద్యుడు అలీ జంగ్



తాళ్లపల్లి యాదగిరిగౌడ్
99497 89939



నేడు ఇంజినీర్స్ డే

సాగునీటి రంగ పితామహుడిగా పేరుగాంచిన నవాబ్ అలీ నవాజ్ జంగ్ బహదూర్ మధ్యతరగతి కుటుంబానికి చెందిన మీర్ వాయిజ్ అలీ దంపతులకు 1877, జూలై 11న హైదరాబాద్‌లో జన్మించారు. ఆయన అసలు పేరు మీర్ మహ్మద్ అలీ. అయితే, వివిధ ప్రాజెక్టుల రూపకల్పనలో ఆయన చూపిన అసాధారణ ప్రతిభను మెచ్చుకున్న నిజాం నవాబ్ మీర్ ఉస్మాన్ అలీఖాన్ అతనికి అలీ నవాజ్‌జంగ్ బిరుదుతో సత్కరించారు. అప్పటినుంచి ఆయన పేరు అలీ నవాజ్ జంగ్‌గా స్థిరపడిపోయింది.

అబిడ్స్‌లోని సెయింట్ జార్జ్ గ్రామర్ స్కూల్‌లో అలీ నవాజ్ జంగ్ ప్రాథమిక విద్యాభ్యాసం పూర్తిచేశారు. అనంతరం నిజాం కాలేజీలో ఉన్నత విద్యనభ్యసించారు. 1896లో ప్రభుత్వ స్కాలర్‌షిప్‌తో ఇంగ్లండ్‌లోని ప్రఖ్యాత కూపర్ హిల్ ఇంజినీరింగ్ కళాశాలలో సివిల్ ఇంజినీరింగ్ పట్టా పొందారు. 1899లో చదువు పూర్తిచేసుకున్న ఆయన హైదరాబాద్‌కు తిరిగొచ్చారు. అదే ఏడాది పీడబ్ల్యూడీ విభాగంలో అసిస్టెంట్ ఇంజినీర్‌గా తన ప్రస్థానాన్ని మొదలుపెట్టిన ఆయన అనతికాలంలోనే దేశం గర్వించదగిన ఇంజినీర్లలో ఒకరిగా ఎదిగారు. 30 ఏండ్ల తన ఉద్యోగ ప్రస్థానంలో హైదరాబాద్, గుల్బర్గా, మహబూబ్‌నగర్, మెదక్, వరంగల్ తదితర ప్రాంతాల్లో పనిచేశారు. తెలంగాణ ప్రజల సాగు, తాగునీటి అవసరాలను తీర్చేందుకు ఆయన ఎంతగానో కృషిచేశారు.

ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్, పోచారం, నిజాంసాగర్, వైరా, పాలేరు, కడెం లాంటి అనేక ప్రాజెక్టులకు రూపకల్పన చేశారు. అంతేకాదు, మూసీ, చంద్రసాగర్, రాజోలిబండ, పోచంపాడ్, నందికొండ, సరళా సాగర్, భీమా, దేవనూర్, పెన్‌గంగా, ఇచ్చంపల్లి, లోయర్ మానేర్, పూర్ణా (మహారాష్ట్ర) లాంటి అనేక ప్రాజెక్టులను ప్రతిపాదించారు.

నవాజ్ అలీ జంగ్ బహదూర్ హైదరాబాద్ నగర రూపశిల్పిగా పేరొందారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య సలహా మేరకు నగరంలో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణానికి పాటుపడ్డారు. తద్వారా ఆ కాలంలోనే అత్యాధునిక డ్రైనేజీ వ్యవస్థ కలిగిన నగరంగా హైదరాబాద్‌కు ప్రపంచఖ్యాతి తీసుకొచ్చారు. తన అమోఘమైన ప్రతిభకు సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించిన అలీ నవాజ్ జంగ్ అనేక సాగునీటి ప్రాజెక్టులు, రోడ్లు, వంతెనలు, భవనాలను నిర్మించారు. హైదరాబాద్ నగరానికి దుఃఖదాయినిగా మారిన మూసీ వరదలను నియంత్రించి, ఎంతోమంది ప్రాణాలను, కోట్ల రూపాయల ఆస్తులను కాపాడిన మహనీయుడు అలీ నవాజ్ జంగ్.

1908లో వచ్చిన మూసీ వరదలు హైదరాబాద్ నగరాన్ని ముంచెత్తాయి. ఆ వరదల్లో చాలామంది మరణించారు. దీంతో అప్పటి నిజాం నవాబ్ మీర్ ఉస్మాన్ అలీఖాన్ భవిష్యత్తులో వరదలు రాకుండా నియంత్రించే బాధ్యతను ప్రఖ్యాత ఇంజినీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్యకు అప్పగించారు. ఆయన తన సహాయకుడిగా అలీ నవాజ్ జంగ్‌ను నియమించుకున్నారు. వారిద్దరూ తమ ప్రతిభతో హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్‌లను నిర్మించారు. నాడు వరద నియంత్రణ కోసం నిర్మించిన జంట జలాశయాలే ఇప్పటికీ హైదరాబాద్ మహా నగరానికి తాగునీటిని అందిస్తున్నాయి.

దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత ప్రణాళికా సంఘం సభ్యుడిగా కూడా సేవలందించిన అలీని ఉమ్మడి పాలకులు తీవ్ర నిర్లక్ష్యం చేశారు. అయితే ప్రత్యేక రాష్ట్రం సిద్ధించాక తెలంగాణలో ఇంజినీర్స్ డే రోజున మోక్షగుండం విశ్వేశ్వరయ్యతో పాటు అలీని స్మరించుకుంటున్నాం. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రాంతం కోసం అహర్నిశలు శ్రమించిన ఆయన సేవలను భవిష్యత్తు తరాలకు తెలియజేయాల్సిన బాధ్యత మనపైనే ఉన్నది.



విలీనం ఎవరి కోసం?

ప్రజాపాలన అంటే ప్రజల కోసం, ప్రజల చేత నిర్వహించబడే పరిపాలనా వ్యవస్థ. ప్రజా సమస్యలపై చర్చించడం, అన్ని రాజకీయ పార్టీలు, మేధావులు, సబ్బండవర్గాల అభిప్రాయాలు తీసుకోవడం ప్రజా పాలనలో చాలా అవసరం. కానీ, ఒకే ఒక్క ఆర్డినెన్స్‌తో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం హైదరాబాద్ ఓఆర్ఆర్‌కు ఆనుకొని ఉన్న హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లోని 51 గ్రామ పంచాయతీలను సమీప మున్సిపాలిటీల్లో విలీనం చేసింది.




లట్టుపల్లి విక్రమ్
97015 87979

ఒకే ఒక్క కలంపోటుతో పెద్ద అంబర్‌పేట, కుత్బుల్లాపూర్, నాగారం, తూంకుంట, తుక్కుగూడ, నార్సింగి, శంషాబాద్, మేడ్చల్, దమ్మాయిగూడ, పోచారం, ఘట్‌కేసర్, గుండ్లపోచంపల్లి, అమీన్‌పూర్, తెల్లాపూర్ తదితర మున్సిపాలిటీలు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ)లో విలీనం కానున్నాయి. తద్వారా గ్రేటర్ పరిధి 2,053.44 చదరపు కిలోమీటర్లకు విస్తరించనున్నది. ఫలితంగా పరిపాలన మరింత జటిలం కానున్నది. పరిపాలనా వికేంద్రీకరణతో ప్రజలకు సేవలు దగ్గరవుతాయి. అందుకే తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఉమ్మడి పది జిల్లాలను విభజించి 33 జిల్లాలుగా ఏర్పాటుచేశారు. అనేక మండలాలను సృష్టించి పాలనను ప్రజలకు చేరువ చేశారు. అందుకు అనుగుణంగా కలెక్టరేట్లు, దవాఖానలు వంటి భవనాలు నిర్మించి ప్రభుత్వ యంత్రాంగాన్ని దగ్గర చేశారు. ఇప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తెచ్చిన ఆర్డినెన్స్‌తో గ్రేటర్ పరిధి పెరగడం వల్ల ప్రతి చిన్న పనికి ప్రజలు బల్దియా గడప తొక్కాల్సి ఉంటుంది. దీనివల్ల రోజులు, నెలల తరబడి సమస్య తీరకపోయే ప్రమాదమూ ఉన్నది.

దేశంలో ఏ మహానగరాల పరిధి కూడా ఇంతగా విస్తరించలేదు. దేశ రాజధాని ఢిల్లీ పరిధి 1,483 చదరపు కిలోమీటర్లు. ఆర్థిక రాజధాని నగరమైన ముంబై పరిధి 526 చదరపు కిలోమీటర్లు. చెన్నైది 426 చదరపు కిలోమీటర్లు. ప్రఖ్యాత టోక్యో నగరంలో 22 మున్సిపాలిటీలు ఉన్నాయి. కానీ, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో ఎలాంటి చర్చ పెట్టకుండా అతిపెద్ద నిర్ణయం తీసుకున్నారు. 'హడావుడిగా ఆర్డినెన్స్ ఎందుకు తీసుకొచ్చారు? ఎవరితో చర్చించారు? అంతా తన నియంత్రణలో ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి భావిస్తున్నారా? అందుకే కేంద్రీకృత వ్యవస్థను ప్రవేశపెడుతున్నారా? ఢిల్లీ, ముంబై, చెన్నై, బెంగళూరు వంటి ప్రధాన నగరాలు అనేకం వికేంద్రీకరణ ద్వారా అభివృద్ధి సాధిస్తే.. ఏకఛత్రం కింద పరిపాలన విజయవంతమవుతుందా? అనాలోచిత, అసమర్థ నిర్ణయాలతో హైదరాబాద్ ప్రతిష్ఠ ఏమైపోతుంది?' అని ప్రధాన ప్రతిపక్షం బీఆర్‌ఎస్ వేస్తున్న ప్రశ్నలు కొట్టివేయదగినవేమీ కావు.

ఆర్డినెన్స్‌తో మున్సిపాలిటీల్లో విలీనమైన గ్రామాలు ఇకపై హైదరాబాదీలతో సమానంగా పన్ను చెల్లించాల్సి ఉంటుంది. కానీ, అక్కడ మౌలిక వసతులు నగర స్థాయిలో అభివృద్ధి కాలేదు. ఇప్పటివరకు గ్రామాలకు అందుతున్న నిధుల ద్వారా సర్పంచ్‌లు పనులు చేపట్టారు. ఇకపై ఎలాంటి పనులు జరగాలన్నా జీహెచ్ఎంసీని సంప్రదించాల్సి ఉంటుంది. ఇందుకోసం అనేక మందిని కలవాల్సి ఉంటుంది. ఏ ఒక్క చిన్న పని కావాలన్నా ఎన్నో వ్యయప్రయాసలు ఎదుర్కోవాల్సి, ఎంతో సమయం వెచ్చించాల్సి రావచ్చు. గ్రామాల అభివృద్ధి కుంటుపడుతుంది. వాటి ఉనికి దెబ్బతింటుంది. వచ్చే జనవరి నాటికి మున్సిపల్ చైర్మన్ల పదవీకాలం ముగియనున్నది. ఆ తర్వాత వచ్చే ఏడాది గ్రేటర్‌లోని కార్పొరేటర్ల పదవీ కాలం తీరనున్నది. సకాలంలో ఎన్నికలు నిర్వహించిన చరిత్ర కాంగ్రెస్‌కు లేదు. కాబట్టి మున్సిపాలిటీలు, గ్రేటర్‌ను సీఎం తన ఆధీనంలోకి తీసుకొని పాలన సాగించవచ్చు. ప్రజాపాలనలో అన్ని అధికారాలు ఒక వ్యక్తి లేదా పార్టీ చేతుల్లో ఉండటం ప్రజాస్వామ్యాన్ని కాలరాయడమే. ఇది ప్రజల హక్కులను తుంగలో తొక్కినట్టవుతుంది.

ప్రజాప్రతినిధుల సూచన లేకుండా, ప్రజలతో చర్చించకుండా నిర్ణయాలు తీసుకొని ఆర్డినెన్స్ ద్వారా పాలన చేయడం ప్రజా స్వాతంత్ర్యాన్ని కించపరచడమే. ప్రజలను దృష్టిలోకి తీసుకోకుండా, వారిపై నిర్ణయాలను రుద్దడం ప్రజాపాలన కానేకాదు. అనాలోచితంగా నిర్ణయాలు తీసుకోవడం, ప్రణాళిక లేకుండా వాటిని అమలు చేయడం ప్రజాపాలనలో సరిదిద్దుకోలేని తప్పిదాలుగా మారుతాయి.



పెద్దాయనకు పరిహారం
పేదల బతుకు ఫలహారం

- సొంత పార్టీ నేత విల్లాను కూల్చేసిన కాంగ్రెస్ సర్కార్
- ఢిల్లీలో పెద్దాయన పంచాయితీ
- రాష్ట్రంలోని ముఖ్యనేతకు తలంటిన అధిష్ఠానం
- పరిహారంగా రూ. 30 కోట్లు
- మరో ఇంటికి వెళ్లబోమని హామీ
- కాంగ్రెస్ పార్టీలో ఇప్పుడిదే హాట్ టాపిక్

హైదరాబాద్, సెప్టెంబర్ 14(నమస్తే తెలంగాణ): హైడ్రా బుల్డోజర్లు పేద బతుకులను చిదిమేస్తున్నాయి. వీటి బారినపడినప్పటికీ పెద్దోళ్లు ఏదోలా బయటపడుతున్నా, పేదల జీవితాలే అతలాకుతలమైపోతున్నాయి. అధికారిక లెక్కల ప్రకారం జీహెచ్ఎంసీ పరిధిలో ఇప్పటి వరకు 23 ప్రాంతాల్లో 262 అక్రమ నిర్మాణాలను కూల్చివేసి 111.72 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకున్నట్టు హైడ్రా ప్రకటించింది. ఇందులో 90 శాతం ఇండ్లు దిగువ మధ్య తరగతి, నిరుపేదలవే. పొద్దంతా కాయకష్టం చేసి రూపాయి, రూపాయి కూడ బెట్టుకొని కట్టుకున్న ఇండ్లు అవి. నోటీసులు లేకుండా పిడుగు వచ్చి మీద పడ్డట్టు కండ్ల ముందే కూలగొడుతుంటే కాళ్లావేళ్లా పడి ప్రాధేయపడినా కనికరించక పోగా, పైపెచ్చు అధికారుల పనులకు ఆటంకం కలిగించారంటూ క్రిమినల్ కేసులు నమోదు చేస్తున్నారు. అదే సమయంలో ఎదురు తిరిగిన పెద్దలకు మాత్రం ప్రైవేటుగా నష్టపరిహారాలతో హైడ్రా మోకరిల్లుతున్నది. హైడ్రా చేతిలో ఇటీవలే ఇంటిని కోల్పోయిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత సమస్యను ఢిల్లీలోని అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్తే నష్టపరిహారం కింద రూ. 30 కోట్లు ముట్టజెప్పినట్టు తెలిసింది. అంతే కాదు, గండిపేట చెరువు కిందనే ఉన్న మరో ఇంటిని కూలగొట్టబోమనే హామీ ఇచ్చి బయటపడినట్టు కాంగ్రెస్ పార్టీలో జోరుగా చర్చ జరుగుతున్నది.

ముఖ్యనేత మెడకు హైడ్రా

విపత్తు నిర్వహణ, ప్రభుత్వ ఆస్తుల రక్షణ కోసం ఏర్పాటైన హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) పనితీరు ముఖ్యనేత మెడకు చుట్టుకున్నది. గండిపేట చెరువు కింద పొరుగు రాష్ట్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత ఒకరు 9 ఏండ్ల క్రితం ఏడెకరాల స్థలాన్ని లీజుకు తీసుకున్నారు. ఆ తర్వాత ఇంటి నిర్మాణ అనుమతులు తీసుకుని విలాసవంతమైన విల్లా కట్టుకున్నారు. హైడ్రా తొలిదశ కూల్చివేతల్లో సదరు నాయకుడి ఇల్లు నేలమట్టం చేశారు. విల్లాను కూల్చివేయడానికి వచ్చినప్పుడే ఆ నేత ఓ ప్రముఖ మంత్రిని సంప్రదించే ప్రయత్నం చేశారు. ఆయనకు పదేపదే ఫోన్లు చేసినప్పటికీ లిఫ్ట్ చేయలేదు. దీంతో మరో కీలక మంత్రికి ఫోన్ చేస్తే.. ఆయన తానేమీ చేయలేనని చేతులు ఎత్తేసినట్టు తెలిసింది. హైడ్రా మీద విమర్శలు వెల్లువెత్తడంతో 'ఇది కురుక్షేత్ర యుద్ధంతో సమానం. మా పార్టీ నేతల నుంచి కూడా నాకు ఫోన్లు వస్తున్నాయి. ఒత్తిళ్లు వస్తున్నాయి. వెనక్కి తగ్గేది లేదు. తప్పును సరి చేసుకునే సమయం ఇది.. సరిచేసుకోండి' అని సర్కారు ఒకింత గట్టిగానే హెచ్చరించినట్టు సమాచారం. ఈ హెచ్చరికలతో కంగుతిన్న సీనియర్ నాయకుడు నేరుగా ఢిల్లీ వెళ్లి కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున్‌ఖర్గేను కలిసి మొరపెట్టుకున్నారు. అన్ని అనుమతులు ఉన్న తన ఇంటిని అక్రమంగా కూల్చడమే కాకుండా తానో కబ్జాకోరును అన్నట్టుగా ప్రచారం చేస్తున్నారని ఫిర్యాదు చేసినట్టు ఆ పార్టీ నేతలు చెప్తున్నారు. ఇప్పటి వరకు తనది మచ్చలేని రాజకీయ జీవితమని, జీవితం అంతా కాంగ్రెస్ పార్టీ కోసమే పనిచేశానని, సొంత ప్రభుత్వమే ఈ వయసులో తనపై కబ్జా ముద్ర వేసి సమాజం ముందు నిలబెట్టిందని ఆవేదన వ్యక్తం చేసినట్టు తెలిసింది.

హైకమాండ్ సీరియస్

ఫిర్యాదు నేపథ్యంలో వాస్తవ పరిస్థితులపై ఆరా తీసి, పంచాయితీ పరిష్కరించాలని పార్టీలో ఇటువంటి వ్యవహారాలు చూసే నాయకుడిని హైకమాండ్ పురమాయించినట్టు సమాచారం. రంగంలోకి దిగిన ఢిల్లీ నేత పార్టీ నాయకుల మీద ప్రతాపం సరికాదని, హైకమాండ్ సీరియస్‌గా ఉందని, మరోసారి పార్టీ నేతల నుంచి ఫిర్యాదులు వస్తే, పరిణామాలు తన చేతిలో ఉండవని గట్టిగానే హెచ్చరించినట్టు కాంగ్రెస్ వర్గాల్లో ప్రచారం జరుగుతున్నది. ఆంధ్రా కాంగ్రెస్ నాయకుడిని బుజ్జగించడానికి, తెలంగాణకు చెందిన ఒక సీనియర్ నాయకుడిని రాయబారానికి పంపగా ప్రభుత్వ చర్యల మీద ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్టు తెలిసింది. సదరు నేత వినకపోవడంతో రూ. 30 కోట్ల నష్టపరిహారంతోపాటు ఇప్పుడు కూలగొట్టిన ఫాంహౌస్‌ను ఆనుకొని ఉన్న ఆయన బంధువు విల్లా జోలికి ప్రభుత్వం పోదని హామీనివ్వడంతో సదరు నేత శాంతించినట్టు కాంగ్రెస్ నేతలు బహిరంగంగానే చెప్పుకుంటున్నారు.

600 ఎకరాల తెలంగాణ భూమి కబ్జా!

మన రాష్ట్ర భూమిని లాక్కెళ్లిపోతున్న కర్ణాటక రైతులు

- ఏటా తెలంగాణ భూభాగం నుంచి ఇసుక తరలింపు
- తమ భూభాగమేనంటూ కర్ణాటక అధికారుల దబాయింపు
- కొన్నేండ్లుగా పెండింగ్‌లోనే 2 రాష్ట్రాల సరిహద్దు సమస్య
- పరిష్కారానికి సరిహద్దులో అటవీశాఖ అధికారుల సర్వే

వికారాబాద్, సెప్టెంబర్ 14 (నమస్తే తెలంగాణ): తెలంగాణ-కర్ణాటక సరిహద్దు ప్రాంతంలో తెలంగాణ భూభాగం ఆక్రమణకు గురైంది. మైల్వార్ రిజర్వ్ ఫారెస్ట్‌లోని ఇస్మాయిల్‌పూర్ తదితర గ్రామాల పరిధిలో 600 ఎకరాల్లో అటవీ భూములు కబ్జాకు గురయ్యాయి. ఎలాంటి ఆధారం లేకపోయినా తమ భూములేనంటూ గత కొన్నేండ్లుగా ఇక్కడి భూములను సాగు చేసేందుకు కన్నడ రైతులు ప్రయత్నాలు చేయడం, వికారాబాద్ జిల్లా అటవీ శాఖ అధికారులు అడ్డుకోవడం జరుగుతూ వస్తున్నది. ఆ రాష్ట్ర రైతులకు స్థానిక ప్రజాప్రతినిధుల అండ ఉంటంతో ఆక్రమణలు ఆగటం లేదు. ఎలాంటి పట్టాలు లేకపోయినా తమ భూములేనంటూ వారు తెలంగాణ అధికారులతో గొడవకు దిగుతున్నారు. మ్యాపుల్లో స్పష్టంగా తెలంగాణ భూభాగమేనని కర్ణాటక అధికారులకు తెలిసినా వారు ముందుకు వచ్చి వివాదాన్ని పరిష్కరించేలా ఆలోచించటం లేదు. దీంతో ఎట్టిపరిస్థితుల్లోనూ ఆక్రమణకు గురైన తెలంగాణ భూభాగాన్ని స్వాధీనం చేసుకునేందుకు జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్.. రెండు రాష్ట్రాల సరిహద్దును గుర్తించి సమస్యను ఫుల్‌స్టాప్ పెట్టాలని అటవీ, రెవెన్యూశాఖ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాలతో అటవీ శాఖ అధికారులు త్వరితగతిన సర్వే పూర్తిచేసేలా చర్యలు చేపట్టారు. వారంలో పని పూర్తి చేసే దిశగా సాగుతున్నారు. అయితే, రెవెన్యూ శాఖ అధికారులు మాత్రం సరిహద్దు సమస్య తేల్చడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.



మైల్వార్ రిజర్వ్ ఫారెస్ట్‌లోని ఆక్రమణలకు గురైన ప్రాంతం (సర్కిల్)

సరిహద్దును నిర్ణయించకపోవటంతో వివాదం

ఒకప్పుడు కర్ణాటకలోని గుల్బార్గా జిల్లాలో వికారాబాద్ జిల్లా అంతర్భాగంగా ఉండేది. అనంతరం తెలంగాణలో భాగమైంది. అయితే, తెలంగాణ-కర్ణాటక మధ్య పకడ్బందీగా సరిహద్దులను నిర్ణయించకపోవటంతో సరిహద్దు వివాదం ఏర్పడింది. ఏటా వికారాబాద్ జిల్లా యంత్రాంగం సరిహద్దు సమస్య తేల్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నా కర్ణాటక అధికారులు మాత్రం స్పందించటం లేదు. 2017లో ఇరు రాష్ట్రాల మంత్రుల సమక్షంలో సమావేశం నిర్వహించి సరిహద్దుపై ఓ నిర్ణయానికి వచ్చినా.. మళ్లీ మొదటికొచ్చింది.

అక్రమంగా కర్ణాటక ఇసుక తరలింపు

కర్ణాటక ప్రభుత్వం ఏటా కాగ్నా నదిలోని రాష్ట్ర సరిహద్దు భూభాగం నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నది. ఏటా కొత్త సరిహద్దులను సృష్టిస్తూ హద్దు దాటుతూ ఇసుక దోపిడీకి పాల్పడుతున్నది. బషీరాబాద్ మండలం క్యాద్గిర శివారులోని కాగ్నా నదిలో ఆ ప్రభుత్వం హద్దులు మీరి అక్రమంగా ఇసుక తవ్వకాలు జరుపుతున్నది. అయితే ఏడేండ్ల క్రితం బషీరాబాద్ మండలం క్యాద్గిర గ్రామం-సేడం తాలుకాలోని పోతంగల్ గ్రామాల మధ్యలోని కాగ్నా నదిలో భూభాగాన్ని సర్వే నిర్వహించి హద్దులను నిర్ణయించటంతో కర్ణాటక భూభాగం వరకు ఆ రాష్ట్ర రెవెన్యూ అధికారులు.. హద్దులుగా కర్రలు పాతారు. ఆ తర్వాత ఆ ఆనవాళ్లు లేకుండా చేసిన సేడం రెవెన్యూ యంత్రాంగం.. మూడేండ్ల క్రితం జీపీఎస్ సర్వే అంటూ కాగ్నా నదిలో 70 శాతం భూభాగాన్ని ఆక్రమించుకునేందుకు కొత్త హద్దులను సృష్టించింది. బషీరాబాద్ మండలంలోని క్యాద్గిర, గంగ్వార్ గ్రామస్థుల ఫిర్యాదుతో రంగంలోకి దిగిన వికారాబాద్ జిల్లా రెవెన్యూ, పోలీసు యంత్రాంగం.. ఉమ్మడి సర్వే నిర్వహించి హద్దు రాళ్లను ఏర్పాటు చేశారు. ఆ హద్దులను కూడా తుంగలో తొక్కిన కర్ణాటక.. తెలంగాణ భూభాగంలోని ఇసుకను తరలిస్తూ తెలంగాణ సంపదను కొల్లగొడుతున్నది.



తెలంగాణ-కర్ణాటక సరిహద్దు వద్ద హద్దులను గుర్తిస్తున్న అటవీశాఖ అధికారులు (ఫైల్)

అమరుడి భార్యకు అష్టకష్టాలు

- కానిస్టేబుల్ కిష్టయ్య భార్యపై కఠిన వైఖరి
- లైబ్రేరియన్‌గా పదోన్నతి కల్పించని సర్కారు
- ఆఫీసుల చుట్టూ 100 సార్లు తిరిగినా దక్కనిన్యాయం
- కేసీఆర్ తొలి సర్కారులోనే కుటుంబానికి ఆసరా
- ఇంటి స్థలం కేటాయింపు
- కూతురి ఉన్నత చదువులకు ఖర్చులు భరిస్తున్న బీఆర్ఎస్



హైదరాబాద్‌లో విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ బుర్ర వెంకటేశంను కలిసి వినతిపత్రం ఇస్తున్న అమరుడు కానిస్టేబుల్ కిష్టయ్య భార్య పద్మావతి

హైదరాబాద్/కరీంనగర్, సెప్టెంబర్ 14 (నమస్తే తెలంగాణ): తెలంగాణ మలిదశ ఉద్యమం ఉవ్వెత్తున సాగుతున్న రోజులు.. ఒక వైపు ఆమరణదీక్షలో ఉన్న ఉద్యమ సారథి కేసీఆర్ అరెస్టు.. పాలకుల అణచివేతలు.. ప్రత్యేక తెలంగాణ రాదేమోనన్న సంశయంతో కలత చెంది 'తన మరణంతోనైనా ప్రత్యేక తెలంగాణ సిద్ధిస్తుంది' అని తలచిన ఆనాటి తెలంగాణ ముద్దుబిడ్డ, కామారెడ్డికి చెందిన కానిస్టేబుల్ కిష్టయ్య 2009 డిసెంబర్ 1న తన సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకొని ప్రత్యేక రాష్ట్రం కోసం బలిదానం చేసుకున్నాడు. ఆయన అమరత్వం చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోయింది. ఆ త్యాగధనుడి కుటుంబానికి గత పదేండ్లపాటు బీఆర్ఎస్ ప్రభుత్వం అండగా నిలిచి, ఆసరా కల్పించింది. కానీ, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఆ కుటుంబంపై కాఠిన్యం ప్రదర్శిస్తున్నది. ఆయన భార్య ఉద్యోగ ప్రమోషన్ విషయంలో అవమానాల పాల్జేస్తున్నది. తెలంగాణ అమరుడు కానిస్టేబుల్ కిష్టయ్య భార్య యామ (పుట్టకొక్కుల) పద్మావతికి ఉద్యమ సమయంలోనే కారుణ్య నియామకం కింద ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ విభాగంలో ఆఫీస్ సబార్డినేట్‌గా ఉద్యోగం ఇచ్చారు. ప్రత్యేక తెలంగాణ ఏర్పడ్డాక అమరుడు కిష్టయ్య కుటుంబానికి ఇంటి స్థలం ఇచ్చి ఆనాటి బీఆర్ఎస్ ప్రభుత్వం అండగా నిలిచింది. కిష్టయ్య కూతురు ప్రియాంక ఎంబీబీఎస్ చదువు కోసం ఏడాదికి రూ.5 లక్షల చొప్పున బీఆర్ఎస్ పార్టీ చెల్లించింది. ప్రియాం క మెడికల్ పీజీ చదివేందుకు రూ.24 లక్షలను స్వయంగా కేసీఆర్ చెల్లించారు. ఉద్యోగం చేస్తూ, ఇద్దరు పిల్లలను చదివించుకుంటూనే పద్మావతి ఉన్నత విద్యను అభ్యసించారు. ఆమె విద్యార్హతలను బట్టి టైపిస్టుగా పదోన్నతి కల్పించారు. లైబ్రేరియన్ కావాలని, ఆ మేరకు అర్హతలు కూడా సాధించారు. కానీ సీనియారిటీ సరిపోక ఒక్క అడుగు దూరంలో ఆగిపోయారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఆ అమరుడి భార్య తన ఉద్యోగ ప్రమోషన్ కోసం అష్టకష్టాలు పడాల్సి వస్తున్నది.

తీరని అధికారుల హామీ

2023 సెప్టెంబర్‌లో ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ శాఖ మల్టిజోన్-1 పరిధిలో పదోన్నతులకు అర్హులైన సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు, లైబ్రేరియన్లను గుర్తించి ప్యానల్‌లో చేర్చింది. అప్పటికి లైబ్రేరియన్ ఖాళీ పోస్టులు 60 ఉండగా 10 శాతం అదనంగా అంటే 65 మందిని ఈ ప్యానల్‌లో చేర్చింది. పద్మావతి కంటే ముందు సీనియారిటీ ఉన్న 60 మందికి లైబ్రేరియన్లుగా పోస్టింగ్ ఇచ్చారు. సీనియారిటీ జాబితా ప్రకారం పద్మావతిది 61వ సంఖ్య. తన పదోన్నతి తృటిలో తప్పిపోవడంతో పద్మావతి ఉన్నతాధికారులను సంప్రదించారు. 60 మందిలో ఎవరైనా చేరకుంటే అవకాశం కల్పిస్తామని ఆ అధికారులు పద్మావతికి హామీ ఇచ్చారు. అనుకున్నట్టుగానే ఆ 60 మందిలో ముగ్గురు వ్యక్తిగత కారణాలతో లైబ్రేరియన్లుగా చేరడం లేదని సంబంధిత అధికారులకు రాతపూర్వంగా రాసిచ్చారు. ఈ నేపథ్యంలో తనకు ఎలాగైనా లైబ్రేరియన్‌గా పదోన్నతి వస్తుందని సంతోషపడిన పద్మావతికి ఆనాటి నుంచి ఇప్పటివరకు ఆ అవకాశం దక్కలేదు.

ఓ ఆంధ్రా అధికారి పక్షపాతం

ఇంటర్ విద్య కమిషనర్ శృతి ఓజా సహా ఇతర అధికారులను కలిసి తనకు న్యాయం చేయాలని పద్మావతి పలుసార్లు మొరపెట్టుకున్నది. ఇంటర్ విద్య కమిషనరేట్‌లోని ఓ ఆంధ్రా ప్రాంత అధికారిణి ఆమెకు పదోన్నతి కల్పించకుండా అడ్డుపడుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. పద్మావతిని 100 సార్లు కార్యాలయం చుట్టూ తిప్పించుకొని తాజాగా 'ప్యానల్ ఇయర్ పూర్తయింది. నీకు పదోన్నతి ఇచ్చేదే లేదు. నీకు దిక్కున్న చోట చెప్పుకోపో' అని చెప్పినట్టుగా విశ్వసనీయ సమాచారం. కనీసం తన భర్త త్యాగాన్ని గుర్తించైనా తనకు పదోన్నతి కల్పించాలని వేడుకున్నా అధికారులు కనికరించలేదు. ఈ దయనీయ పరిస్థితుల్లో పద్మావతి ఇటీవలే విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశంను కలిసి గోడు వెళ్లబోసుకున్నారు. తాను ఎదుర్కొన్న అవమానాలను విన్నవించుకుంటూ ఆయన ఎదుటే కన్నీటిపర్యంతమయ్యారు. కనీసం ఇపుడైనా ఆమెకు న్యాయం జరుగుతుందో లేదో వేచి చూడాలి.

పద్మావతికి న్యాయం చేస్తాం: బుర్రా వెంకటేశం

కానిస్టేబుల్ కిష్టయ్య భార్య పద్మావతికి న్యాయం చేస్తామని విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం భరోసా ఇచ్చారు. పద్మావతి పదోన్నతి విషయంపై 'నమస్తే తెలంగాణ' ఆయన్ను ఆరా తీయగా, ఇటీవలే తనను పద్మావతి కలిసి వినతిపత్రం ఇచ్చారని, పదోన్నతి కల్పించే అంశాన్ని పరిశీలిస్తున్నామని, ఆమెకు తప్పకుండా న్యాయం చేస్తా చెప్పారు.

కరెంట్ కాటుకు ఇద్దరు రైతులు బలి

- గడ్డి కోస్తుండగా ఒకరు..
- స్టార్టర్ వైర్ తగిలి మరొకరు
- కామారెడ్డి జిల్లాలో విషాదం



కృష్ణ (ఫైల్)



ఎల్లయ్య (ఫైల్)

నాగిరెడ్డిపేట/రాజంపేట్, సెప్టెంబర్14: కరెంట్ షాక్‌తో ఇద్దరు రైతులు మృతి చెందారు. ఈ ఘటనలు కామారెడ్డి జిల్లాలోని నాగిరెడ్డిపేట, రాజంపేట్ మండలాల్లో చోటుచేసుకున్నాయి. రాజంపేట్ మండలం ఎల్లారెడ్డిపల్లికి చెందిన ముక్కిరి ఎల్లయ్య (41) శనివారం పొలానికి వెళ్లాడు. బోరు చుట్టూ గడ్డి ఏపుగా పెరగడంతో దాన్ని కోస్తున్నాడు. ప్రమాదవశాత్తు విద్యుత్తు తీగలు కొడవలికి తగలడంతో కరెంట్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా నాగిరెడ్డిపేట మండలం ధర్మారెడ్డి గ్రామానికి చెందిన జోడు కృష్ణ (40) శుక్రవారం రాత్రి భోజనం చేసిన తరువాత ఇంట్లో చెప్పి పొలానికి వెళ్లాడు. శనివారం ఉదయం వరకు ఇంటికి చేరుకోలేదు. దీంతో భార్య చుట్టుపక్కల వెతికినా ఆచూకీ దొరకలేదు. బంధువులు పొలానికి వెళ్లి చూడగా, కృష్ణ మోటర్ స్టార్టర్ డబ్బా వద్ద కరెంట్ తీగలకు వేలాడుతూ విగతజీవిగా కనిపించాడు. పొలానికి వెళ్తుండగా, కాలు జారి తీగలపై పడటంతో కరెంట్ షాక్‌కు గురై మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. కృష్ణ భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

డెంగ్యూతో చిన్నారి మృతి

విషజ్వరంతో మరో చిన్నారి..



సహస్ర (ఫైల్)



తనుశ్రీ (ఫైల్)

నర్సాపూర్/జఫర్‌గడ్, సెప్టెంబర్ 14 : డెంగ్యూతో ఏడేండ్ల చిన్నారి మృతి చెందింది. మెదక్ జిల్లా నర్సాపూర్ పట్టణానికి చెందిన జింకల నర్సింగ్, లహరి దంపతులకు ఏడేండ్ల బాలిక సహస్ర ఒకటో తరగతి చదువుతున్నది. మూడు రోజులుగా జ్వరంతో బాధపడుతుండటంతో నర్సాపూర్ దవాఖానలో వైద్యం అందించారు. శనివారం ఉదయం పాఠశాలకు వెళ్లిన చిన్నారి సహస్ర అక్కడ సొమ్మసిల్లి పడిపోయింది. హుటాహుటిన హైదరాబాద్‌లోని ప్రైవేట్ దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మరణించింది. ప్లేట్‌లెట్స్ పడిపోయి డెంగ్యూతో మరణించిందని కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపారు.

విషజ్వరంతో చిన్నారి..

విషజ్వరంతో చిన్నారి మృతిచెందిన ఘటన జనగామ జిల్లా జఫర్‌గఢ్ మండలం ఒబులాపూర్‌లో శనివారం చోటుచేసుకున్నది. ఒబులాపూర్ గ్రామానికి చెందిన వంగాల దయాకర్, శారద దంపతులకు ఇద్దరు కూతుర్లు, కుమారుడు ఉన్నారు. చిన్నకుమార్తె వంగాల తనూశ్రీ(4)కి నాలుగు రోజులుగా జ్వరంతో బాధపడుతుండటంతో చికిత్స నిమిత్తం హన్మకొండలోని ప్రైవేట్ దవాఖానలో చేర్పించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. చిన్నారి డెంగ్యూతో మృతిచెందినట్టు స్థానికులు చెబుతున్నారు.

నా కొడుక్కి డెంగ్యూ.. కార్యదర్శే బాధ్యుడు

- గతంలో డెంగ్యూతో కూతురిని కోల్పోయా..
- పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలి
- కలెక్టర్‌కు ఓ తండ్రి వినతి

తాంసి, సెప్టెంబర్ 14: 'నా కుమారుడికి డెంగ్యూ సోకింది. పంచాయతీ కార్యదర్శి మురుగు కాలువలు శుభ్రం చేయించకపోవడంతో దోమలు విజృంభించి రోగాలు సోకుతున్నాయి. మరొకరు డెంగ్యూ బారిన పడకుండా పారిశుద్ధ్య పనులు చేపట్టి సదరు కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలి' అని ఆదిలాబాద్ జిల్లాలో ఓ బాధితుడు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. వివరాలు ఇలా.. తాంసి మండలం బండల్‌నాగాపూర్‌లోని తన ఇంటి పరిసరాల్లో 9 నెలలుగా పారిశుద్ధ్య పనులు చేపట్టడం లేదని పోతెమ్ నవీన్ తెలిపాడు. ఇదే విషయాన్ని జూలై 7న కార్యదర్శి హమీద్ దృష్టికి తీసుకెళ్తే.. మురుగు కాల్వలు ఆన్‌లైన్ కాలేదని సమాధానం ఇచ్చాడని, ఫలితంగా ఈ నెల 9న తన కొడుకు వృషీన్ డెంగ్యూ బారిన పడినట్టు పేర్కొన్నాడు. చికిత్సకు రూ.57 వేలు ఖర్చు అయిందని తెలిపాడు. గతంలో తన కూతురు వైశాలి (7) కూడా డెంగ్యూతోనే మృతి చెందిందని వాపోయాడు. తన కొడుకు డెంగ్యూ బారిన పడటానికి కారణమైన పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేశాడు.





పిచ్చికుక్కల దాడిలో తీవ్రంగా గాయపడిన పెద్దపల్లి జిల్లా మంథని మండలం స్వర్ణపల్లికి చెందిన మానసశ్రీ, కోరవేన వేదాన్ష్

కుక్కల దాడిలో చిన్నారులకు తీవ్రగాయాలు

మంథని రూరల్, సెప్టెంబర్ 14 : పెద్దపల్లి జిల్లా మంథని మండలం స్వర్ణపల్లిలో పిచ్చి కుక్కలు దాడి చేసి ఐదుగురిని గాయపరిచాయి. ఇందులో ఇద్దరు చిన్నారులు తీవ్రంగా గాయపడ్డారు. స్వర్ణపల్లి గ్రామానికి చెందిన నలుబోతుల మానసశ్రీ (5), కోరవేన వేదాన్ష్ (3) ఇండ్ల ముందు ఆడుకుంటుండగా అటుగా వచ్చిన రెండు పిచ్చి కుక్కలు వీరిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. స్థానికులు కుక్కలను వెళ్లగొట్టే ప్రయత్నం చేస్తుండగా కర్రతో ఉన్న జిముడ రాజేశ్‌ను సైతం కరిచాయి. గాయపడిన ఇద్దరు పిల్లలను మంథని ప్రభుత్వ దవాఖానకు తరలించి చికిత్స అందించారు. అక్కడి నుంచి వెళ్లిన కుక్క వెంకటాపూర్‌లోని గడ్డం మల్లేశ్ కూతురిని కరవగా అడ్డుకోబోయిన మల్లేశ్ మెడపై కరిచింది. పిచ్చి కుక్కలు ఇలా రోడ్లపై తిరుగుతూ కనబడిన వాళ్లందరినీ కరుచుకుంటూ వెళ్లడంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు.

రియల్ ఢమాల్

మొదటిపేజీ తరువాయి...

కోరినట్టు లేఖ ఇవ్వడానికి అభ్యంతరం లేదని తెలిపారు. హైడ్రా నేరుగా నోటీసులు ఇవ్వదని, స్థానిక సంస్థల నోటీసులను బట్టి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఇక, గ్రేహౌండ్స్, టాస్క్‌ఫోర్స్ తరహాలో హైడ్రా ప్రత్యేక అధికారాలతో చట్టబద్ధతను కలిగి ఉంటుందని.. అక్టోబర్‌లో ఆర్డినెన్స్ తీసుకొచ్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన చెప్పారు. 'ఎగ్జిక్యూటివ్ తీర్మానం ద్వారా తెలంగాణ ప్రభుత్వం 2024 జూలై 19న జీవో నంబరు 99 ద్వారా హైడ్రాను ఏర్పాటుచేసింది. నీరు, భూమి, చెట్లు (వాల్టా) చట్టం, గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ చట్టం, నీటి పారుదల చట్టం వంటి వాటి నుంచి వివిధ చట్టాల కింద అధికారాలు హైడ్రాకు అప్పగిస్తారు. ప్రస్తుతం దీనికి సంబంధించిన ప్రక్రియ జరుగుతున్నది. విధానపరమైన పత్రం సిద్ధమయ్యాక క్యాబినెట్ ఆమోదం కోసం పంపుతారు. క్యాబినెట్ తీర్మానం ఆమోదించిన 6 వారాల్లో శాసనసభలో ఆర్డినెన్స్ ఆమోదం పొందుతుంది' అని పేర్కొన్నారు.

నోటీసులిచ్చి దర్యాప్తు చేయండి

ప్రభుత్వ ఉద్యోగులపై హైడ్రా కేసులో పోలీసులకు హైకోర్టు ఉత్తర్వులు

హైదరాబాద్, సెప్టెంబర్ 14 (నమస్తే తెలంగాణ): చెరువుల ఆక్రమణలకు సహకరించినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రభుత్వ ఉద్యోగులకు నోటీసులు ఇచ్చి, వివరణ తీసుకున్న తర్వాతే చట్టానికి అనుగుణంగా దర్యాప్తు చేపట్టాలని సైబరాబాద్ పోలీసులను హైకోర్టు ఆదేశించింది. ఆక్రమణలను ప్రోత్సహించారని ఆరోపిస్తూ హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఫిర్యాదు మేరకు ప్రభుత్వ ఉద్యోగులపై గత నెల 30న సైబరాబాద్ ఆర్థిక నేరాల విభాగం పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని మేడ్చల్ మల్కాజిగిరి సర్వే డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసులు, మరో ఉద్యోగి పూల్‌సింగ్ దాఖలు చేసిన వ్యాజ్యాలపై జస్టిస్ సుజన విచారణ జరిపారు. పిటిషనర్లపై నమోదైన అభియోగాలన్నీ ఏడేండ్లలోపు శిక్ష పడేవైనందున వారికి బీఎన్ఎస్ఎస్‌లోని 35(3) సెక్షన్ కింద నోటీసులు జారీచేసి, వివరణ తీసుకోవాలని అధికారులకు ఉత్తర్వులు జారీ చేసింది. నిందితుల ఆధారాలను పరిగణనలోకి తీసుకుని, మెజిస్ట్రేట్‌కు సమర్పించే తుది నివేదికకు జత చేయాలని ఆదేశిస్తూ.. పిటిషన్లపై విచారణ ముగిసినట్టు ప్రకటించింది.

20న క్యాబినెట్ సమావేశం

కొత్త రేషన్‌కార్డుల జారీ, రైతు భరోసా, హైడ్రాపై చర్చించే అవకాశం

హైదరాబాద్, సెప్టెంబర్ 14 (నమస్తే తెలంగాణ): ఈ నెల 20న క్యాబినెట్ సమావేశం జరుగనున్నది. సాయంత్రం 4 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో ఈ సమావేశాన్ని నిర్వహించనున్నారు. కొత్త రేషన్‌కార్డుల జారీ, రైతు భరోసా, హైడ్రాకు మరిన్ని అధికారాలు, రూ.2 లక్షలపైన రుణమాఫీకి సంబంధించి విధి విధానాలు తదితర అంశాలపై చర్చించే అవకాశమున్నది.

ఏచూరి మృతి తీరని లోటు


దళిత్ రైట్స్ కోఆర్డినేషన్ కమిటీ నివాళి

హైదరాబాద్, సెప్టెంబర్14 (నమస్తే తెలంగాణ): సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ రాజ్యసభ సభ్యుడు సీతారాం ఏచూరి మృతి దేశంలోని దళిత, ఆదివాసీలకు తీరని లోటని దళిత్ రైట్స్ కోఆర్డినేషన్ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఏచూరి మృతికి సంతాపం తెలియజేస్తూ కమిటీ సభ్యులు మల్లేపల్లి లక్ష్మయ్య, బీ వెంకట్, రామచంద్ర డోమ్, వీఎస్ నిర్మల్, ధీరేంద్రఝా, గుల్జర్‌సింగ్ గోరియా, కర్నాల్‌సింగ్, బీనా పల్లికర్, సాయిబాలాజీ, విక్రమ్ సింగ్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. దళిత, ఆదివాసీల హక్కుల కోసం ఏచూరి చేసిన కృషిని స్మరించుకున్నారు.

28న గురుకులాల్లో చాక్ డౌన్

- సమస్యల పరిష్కారానికి దశలవారీగా పోరాటం
- స్పందించాలని సర్కారుకు గురుకుల జేఏసీ అల్టిమేటం

హైదరాబాద్, సెప్టెంబర్14 (నమస్తే తెలంగాణ): ఎస్సీ, బీసీ, ఎస్టీ, మైనార్టీ, జనరల్ మొత్తంగా ఐదు సొసైటీ పరిధిలోని గురుకులాల్లో నెలకొన్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ 28న చాక్ డౌన్‌కు గురుకుల విద్యా జేఏసీ పిలుపునిచ్చింది. ప్రభుత్వం వెంటనే స్పందించాలని అల్టిమేటం జారీ చేసింది. గురుకుల జేఏసీలో భాగస్వామ్యమైన టీఎస్‌డబ్ల్యూఆర్టీఈఏ అధ్యక్షుడు సీహెచ్ బాలరాజు, స్టాఫ్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రభుదాస్, టీఎస్‌డబ్ల్యూఆర్టీయూ బాలస్వామి, ఏటీజీఆర్ఐఈడబ్ల్యూఏ యాదయ్య, ప్రిన్సిపాల్స్ అసోసియేషన్ చలపతి, టీటీఆర్ఈఐటీఏ రుషికేష్‌కుమార్, టీఆర్ఈఐటీఏ గోవర్ధన్‌రెడ్డి, టీఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఝాన్సీ రాణి, టీఆర్‌డీసీఈఏ సాంబలక్ష్మి, టీజీఎస్‌డబ్ల్యూఆర్ఈటీఎల్ఏ ఆవుల సైదులు, పీడీ అసోసియేషన్ వీ చందర్ శనివారం సంయుక్త ప్రకటన విడుదల చేశారు. గురుకుల విద్యార్థులతోపాటు ఉపాధ్యాయ, ఉద్యోగవర్గం అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నదని, ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా ప్రభుత్వం స్పందించడం లేదని విద్యాజేఏసీ వాపోయింది. తప్పనిసరి పరిస్థితుల్లో ఆందోళన బాట పట్టాల్సి వస్తున్నదని వివరించింది. సమస్యల పరిష్కారానికి దశలవారీగా శాంతియుతంగా ఆందోళనలను చేపట్టాలని నిర్ణయించినట్టు వెల్లడించింది. 17న నల్లాబ్యాడ్జిలతో, 19న ఉపాధ్యాయులంతా సంతకాలు చేసి ఆ వినతులను ప్రిన్సిపాల్స్ ద్వారా సొసైటీ కార్యదర్శులకు సమర్పించాలని నిర్ణయించింది. అప్పటికీ ప్రభుత్వం స్పందించకుంటే పెన్‌డౌన్, చాక్‌డౌన్‌లో భాగంగా 28న విధులను బహిష్కరించాలని గురుకుల ఉపాధ్యాయులకు జేఏసీ పిలుపునిచ్చింది.



గురుకుల జేఏసీ ప్రధాన డిమాండ్లు..

- ప్రభుత్వం ఇటీవల అమలులోకి తీసుకువచ్చిన నూతన పనివేళలను తక్షణమే మార్చాలి. గతంలో తరహాలోనే పనివేళలను కొనసాగించాలి.
- జీవో 317 అలకేషన్‌లో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ జరిపి, బాధితులకు సత్వరమే న్యాయం చేయాలి.
- అన్ని గురుకులాల్లో శాశ్వత కనీస మౌలిక వసతులను కల్పించాలి.
- గురుకుల విద్యార్థుల మెస్ చార్జీలను పెంచాలి.
- 010 పద్దు ద్వారా ఉపాధ్యాయుల, ఉద్యోగుల వేతనాలను ఒకటో తారీఖునే చెల్లించాలి.
- ఉపాధ్యాయులకు బోధనేతర బాధ్యతలను, నైట్ స్టే విధులను తొలగించాలి.
- అన్ని గురుకుల సొసైటీలను ఒకే గొడుగు కిందకు తీసుకురావాలి. ఏకరూప నిబంధనలను రూపొందించాలి.

ప్రాణాలమీదికి తెచ్చిన సెల్ఫీ

- ఫొటో కోసం రైలు బోగీ ఎక్కిన యువకుడు
- హై టెన్షన్ విద్యుత్తు వైర్లు తగిలి షాక్.. పరిస్థితి విషమం
- హనుమకొండ జిల్లా కాజీపేటలో ప్రమాదం

కాజీపేట, సెప్టెంబర్ 14: సెల్ఫీ సరదా ఓ యువకుడి ప్రాణాల మీదికి తెచ్చింది. రైలు బోగీ ఎక్కి సెల్ఫీ దిగుతుండగా విద్యుత్తు హై టెన్షన్ వైర్లు తగిలి షాక్‌కు గురై తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన శనివారం హనుమకొండ జిల్లా కాజీపేట రైల్వే సెంటింగ్ యార్డులో జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లోని గాంధీనగర్‌కు చెందిన పస్తం రాజు (18) తల్లి, కుటుంబ సభ్యులతో కలిసి కడిపికొండ చర్చిలో జరుగుతున్న క్రైస్తవ ఉత్సవాలకు వచ్చారు. ప్రార్థనలు జరుగుతుండగా కొందరు పిల్లలతో కలిసి రాజు రైలు బోగీ ఎక్కి సెల్ఫీ దిగేందుకు రాంనగర్ సమీపంలోని సెంటింగ్ యార్డుకు వెళ్లాడు. ఆగి ఉన్న గూడ్స్ రైలు బోగీ ఎక్కి సెల్ఫీ ఫొటో దిగుతుండగా హై టెన్షన్ విద్యుత్తు వైర్లు తగిలి షాక్‌కు గురికావడంతో శరీరం కాలిపోయి కింద పడ్డాడు. స్థానికులు 108 వాహనంలో ఎంజీఎం దవాఖానకు తరలించారు. రాజు పరిస్థితి విషమంగా ఉన్నట్టు వైద్యులు తెలిపారు.



'కొలనుపాక'లో చండికాంబ గుడి మెట్టు శాసనం

హైదరాబాద్, సెప్టెంబర్ 14(నమస్తే తెలంగాణ): యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం కొలనుపాకలో ఇటీవల కొత్త తెలంగాణ చరిత్ర బృందం కన్వీనర్ రామోజు హరగోపాల్ పర్యటించింది. ఈ సందర్భంగా సోమేశ్వరాలయ ఆవరణలోని చండికాంబగుడి లోపలి మెట్టు వద్ద కాకతీయుల కాలంనాటి శాసనాన్ని గుర్తించారు. ఈ శాసనం 13వ శతాబ్దపు తెలుగులిపిలో ఉన్నదని పేర్కొన్నారు. ఇందులో వరంగల్ కాకతీయ మహారాజు గణపతిదేవుడు అనుమకొండ పురవేశ్వరుడిగా పేర్కొన్నారు. గుడిమెట్టును తొలగించి ఈ శాసనాన్ని కొలనుపాక మ్యూజియంలో భద్రపరచాలని పురావస్తు అధికారులకు విజ్ఞప్తి చేశారు.



'మహా' నుంచి రాష్ట్రానికి తొలి వందేభారత్ రైలు

రేపు వర్చువల్ విధానంలో ప్రారంభించనున్న ప్రధాని

హైదరాబాద్, సెప్టెంబర్ 14 (నమస్తే తెలంగాణ): నాగ్‌పూర్ రైల్వే స్టేషన్ నుంచి సికింద్రాబాద్‌కు వందే భారత్ రైలును ప్రధాని మోదీ రేపు (16న) వర్చువల్‌గా నాగ్‌పూర్‌లో ప్రారంభించనున్నట్టు అధికారులు శనివారం ప్రకటనలో పేర్కొన్నారు. ఈ రైలు సోమవారం సాయంత్రం 4.15కు నాగ్‌పూర్ నుంచి బయలుదేరి రాత్రి 11.25 గంటలకు సికింద్రాబాద్‌కు చేరుకుంటుందన్నారు.

'వ్యవసాయం'లో రాష్ట్రానికి అత్యుత్తమ పురస్కారం

హైదరాబాద్, సెప్టెంబర్ 14 (నమస్తే తెలంగాణ): కేంద్ర ప్రభుత్వానికి చెందిన వ్యవసాయ మౌలిక సదుపాయాల నిధి సక్రమ వినియోగంలో రాష్ట్రానికి దేశంలోనే అత్యుత్తమ అవార్డు లభించింది. ఢిల్లీలో శనివారం కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమశాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ రాష్ట్ర అధికారులకు అవార్డును ప్రదానం చేశారు. రాష్ట్రానికి రూ. 2,836 కోట్ల ప్రయోజనం కలిగిందని, 2,199 ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ యూనిట్లను నెలకొల్పినట్టు రాష్ట్ర వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి రఘునందన్‌రావు వెల్లడించారు. యూనిట్లలో 1322 వ్యవసాయ ప్రాథమిక ప్రాసెసింగ్, 785 గిడ్డంగులు, 163 కస్టమ్ హైరింగ్ సెంటర్లు,101 పోస్ట్-హార్వెస్ట్ తదితర సదుపాయాలు ఉన్నాయని తెలిపారు. నిజామాబాద్, ఖమ్మం, సిద్దిపేట జిల్లాలోని బ్యాంకులు అత్యుత్తమ పనితీరు కనబర్చినట్టు గుర్తించారు.



ట్రిపుల్ ఆర్ నిర్వాసితుల రాస్తారోకో

రీజినల్ రింగ్ రోడ్డులో భూములు, ఇండ్లు కోల్పోతున్న నిర్వాసితులు ఆందోళనకు దిగారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్‌లో 65వ జాతీయ రహదారిపై శనివారం రాస్తారోకో చేశారు. అంతకుముందు స్థానిక శుభం గార్డెన్‌లో ట్రిపుల్ ఆర్ నిర్వాసితుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ ప్రభుత్వం రీజినల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్చాలని లేదా భూమికి బదులు భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

– చౌటుప్పల్

ఒంటరి వ్యక్తులకు రుణమాఫీ అయ్యేదెట్లా?

రేషన్‌కార్డు, కుటుంబ యూనిట్ లేకపోవడంతో సమస్య

- **ఒంటరి వ్యక్తులకు సంబంధించి కనిపించని ఆప్షన్**
- **తమకు ఆప్షన్ ఇవ్వాలని ప్రభుత్వానికి డిమాండ్**

హైదరాబాద్, సెప్టెంబర్ 14(నమస్తే తెలంగాణ): చక్రధర్ అనే రైతు ఒంటరిగా జీవిస్తున్నాడు. ఆయనకు ఓ అన్న ఉండగా పెళ్లి కావడంతో వేరుగా ఉంటున్నాడు. చక్రధర్ పెళ్లి చేసుకోకుండా ఒంటరిగా జీవిస్తున్నారు. ఆయనకు రూ.1.57లక్షల పంట రుణం ఉంది. ప్రభుత్వం చేసిన రుణమాఫీలో ఆయనకున్న రుణం మాఫీ కాలేదు. ఇప్పుడు వెళితే కుటుంబసభ్యులెవరైనా ఉంటేనే కుటుంబ నిర్ధారణ చేస్తామని, ఒంటరి వాళ్లకు చేసేందుకు ఆప్షన్ లేదని ఏఈవో చెబుతున్నారు.



దీంతో ఏం చేయాలో అర్థంకాక తనకు ఇక రుణమాఫీ కాదనే ఆందోళనను రైతు చక్రధర్ వ్యక్తం చేస్తున్నాడు. ఈ విధంగా రాష్ట్రంలో చాలామంది ఒంటరి మహిళలు, పురుషులు రుణమాఫీ కాకపోవడంతో ఇబ్బందిపడుతున్నారు. ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి ఒంటరి వ్యక్తులను, ఇతర దేశాల్లో బతుకుదెరువు కోసం వెళ్లిన వారిని రుణమాఫీకి దూరం చేస్తున్నది. రుణమాఫీకి సంబంధించి కుటుంబ నిర్ధారణలో భాగంగా వీరిని గుర్తించే ఆప్షన్ ఇవ్వలేదు. భార్యనో, భర్తనో, తల్లిదండ్రులో, అన్నదమ్ముల్లో ఎవరో ఒకరు ఉంటేనే కుటుంబ నిర్ధారణ చేస్తున్నారు. ఎవరూ లేని వారిని పరిగణలోకి తీసుకోవడం లేదు. ఒకవేళ వీళ్ల పేర్లు నమోదు చేయాలంటే కుటుంబ సభ్యులను చూపించాలని కొర్రీలు పెడుతున్నారు. దీంతో భర్త చనిపోయిన వాళ్లు, విడాకులు తీసుకున్నవాళ్లు, పెళ్లి చేసుకోనివాళ్లు, తల్లిదండ్రులు లేని వాళ్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో పాటు బతుకుదెరువు కోసం విదేశాలకు, ఇతర రాష్ట్రాలకు వెళ్లిన వారికి కూడా ఇబ్బందులు తలెత్తుతున్నాయి. కుటుంబ నిర్ధారణ సమయంలో వాళ్లు ఇక్కడ అందుబాటులో లేకపోవడంతో వాళ్లను విస్మరిస్తున్నట్టుగా తెలిసింది. ప్రస్తుతం వాళ్లు ఇక్కడ లేరు కాబట్టి వాళ్ల పేర్లు నమోదు చేయడం లేదని తెలిసింది. రుణమాఫీ ప్రక్రియలో ప్రభుత్వం ఒంటరిగా జీవిస్తున్న వారిని అర్హులుగా గుర్తించేందుకు అవసరమైన విధానమే లేకపోవడం గమనార్హం. ఏఈవోలు రైతుల ఇళ్లకు వెళ్లి కుటుంబ పెద్ద నుంచి డిక్లరేషన్ తీసుకుంటున్నారు. ఎవరూ లేని వాళ్లకు సంబంధించి పేర్లు నమోదు చేసేందుకు, వాళ్లు రుణమాఫీకి అర్హులు కాదా అనేది తేల్చేందుకు ప్రభుత్వం ఏ విధానాన్ని ప్రకటించలేదు. ఈ నేపథ్యంలో ఒంటరి వాళ్లు ప్రభుత్వ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమకు అన్ని అర్హతలు ఉన్నా రుణమాఫీ ఎందుకు చేయడం లేదని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమ సమస్యను గుర్తించి రుణమాఫీలో తమ పేర్ల నమోదుకు ఆప్షన్ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

కులగణనపై మోసగిస్తే కాంగ్రెస్‌కు శిక్ష తప్పదు

- **రేవంత్‌రెడ్డి సర్కార్‌పై బీసీ నేత ఆర్ కృష్ణయ్య ధ్వజం**
- **కులగణన తర్వాతే ఎన్నికలు జరపాలని డిమాండ్**

రవీంద్రభారతి: తక్షణమే కులగణన షెడ్యూల్ విధివిధానాలను ప్రకటించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్ కృష్ణయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కులగణన తర్వాతే పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని, లేకుంటే కాంగ్రెస్‌కు ప్రజాకోర్టులో శిక్ష తప్పదని హెచ్చరించారు.



బషీర్‌బాగ్‌లో అఖిలపక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ కృష్ణయ్య

హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో శనివారం జరిగిన అఖిలపక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. కులగణనపై హైకోర్టు మూడు నెలల గడువు విధించినప్పటికీ ఇప్పటివరకు ప్రభుత్వం స్పందించడం లేదని ధ్వజమెత్తారు. అబద్ధాలతో అధికారంలోకి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి కులగణనను విస్మరించడం సహించరానిదని హెచ్చరించారు. బీసీ రిజర్వేషన్ల పెంపు అంశంపై 16 నుంచి 19 వరకు అన్ని జిల్లాల్లో అఖిలపక్ష సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ, ఎంపీ ఈటల రాజేందర్, మాజీ ఎంపీ హనుమంతరావు, గుజ్జ కృష్ణ, నీల వెంకటేశ్, గొరిగె మల్లేశ్, అంజీ, భూపేశ్ సాగర్, లక్షణ్‌యాదవ్ పాల్గొన్నారు.

త్వరలో కులగణనకు కార్యాచరణ

హైదరాబాద్, సెప్టెంబర్14 (నమస్తే తెలంగాణ): త్వరలోనే కులగణన కార్యాచరణ చేపట్టేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. శనివారం బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్‌తో పంచాయతీరాజ్ సెక్రటరీ లోకేశ్‌కుమార్, డీఎస్ కమిషనర్ అనితా రామచంద్రన్, డిప్యూటీ కమిషనర్ సుధాకర్ ఖైరతాబాద్‌లోని బీసీ కమిషన్ కార్యాలయంలో సమావేశమయ్యారు. విధివిధానాలపై చర్చించారు. సమావేశంలో బీసీ కమిషన్ సభ్యులు జయప్రకాశ్, సురేందర్, బాలలక్ష్మి, కార్యదర్శి మాయాదేవి పాల్గొన్నారు.

హమ్మయ్యా.. బదిలీ అయ్యాం

- **11 ఏండ్ల తర్వాత మాడల్ టీచర్లకు మోక్షం**
- **2,757 మందిని బదిలీ చేసిన విద్యాశాఖ**
- **హర్షం వ్యక్తంచేసిన ఉపాధ్యాయ సంఘాలు**

హైదరాబాద్, సెప్టెంబర్ 14 (నమస్తే తెలంగాణ): స్వస్థలం జోగులాంబ గద్వాల జిల్లా.. పనిచేసేదేమో సూర్యాపేట. ఇదే సూర్యాపేట జిల్లాకు చెందిన మరో టీచర్‌కు సిద్దిపేట జిల్లాలో పోస్టింగ్. సిద్దిపేట జిల్లాకు చెందిన మరో టీచర్‌కు ఛత్తీస్‌గఢ్ బార్డర్‌లో పోస్టింగ్. ఇలా తమ స్వస్థలాలకు 150-200 కిలోమీటర్ల దూరంలో పనిచేస్తున్న మాడల్ స్కూల్ టీచర్లకు మోక్షం కలిగింది. పాఠశాల విద్యాశాఖ శనివారం 2,757 మంది మాడల్ స్కూల్ టీచర్లకు స్థానచలనం కల్పించింది. పదకొండేండ్ల నరకయాతన నుంచి విముక్తి కల్పించింది. ఉపాధ్యాయ సంఘాలు, టీఎంఎస్‌టీఏ రాష్ట్ర అధ్యక్షుడు భూతం యాకమల్లు, పీఎంటీఏటీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు తరాల జగదీశ్ ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

గత కాంగ్రెస్ సర్కారు నిర్వాకం..

194 మాడల్ స్కూళ్లల్లో 5,500 మంది రెగ్యులర్ టీచర్లు పనిచేస్తున్నారు. 2011లో నోటిఫికేషన్ ఇచ్చినా.. 2013-14వరకు దశలవారీగా టీచర్లను రిక్రూట్‌చేశారు. దీంతో కాంగ్రెస్ సర్కారు హయాంలో రోస్టర్ కమ్ మెరిట్ పాటించలేదు. తెలుగు, ఇంగ్లిష్, గణితం సబ్జెక్టులకు ఒక్కో స్కూల్‌కు 2 పోస్టులను భర్తీ చేయాల్సి ఉండగా, ఒక పోస్టునే నింపారు. ఒకే స్కూల్‌లో రెండు పోస్టులకు ఎంపికైన వారిని పోస్టుల్లేవని దూర ప్రాంతాల్లో పోస్టింగ్ ఇచ్చారు. దీంతో చెట్టుకొకరు.. పుట్టకొకరు అన్నట్టుగా పరిస్థితి మారింది.

కష్టాలను దూరం చేసిన కేసీఆర్

మాడల్ స్కూల్ టీచర్ల కష్టాలను గత కేసీఆర్ సర్కారు దూరం చేసింది. వీరికి రాష్ట్ర విభజనకు ముందే ఉద్యోగాలిచ్చినా గత కాంగ్రెస్ సర్కారు సర్వీస్ రూల్స్‌ను రూపొందించలేదు.

బదిలీ అయినవారు

పోస్టు	బదిలీ అయినవారి సంఖ్య
ప్రిన్సిపాళ్లు	89
పీజీటీలు	1,923
టీజీటీలు	745
మొత్తం	2,757

2019లో కేసీఆర్ సర్కారు సర్వీస్ రూల్స్‌ను రూపొందించి, ప్రభుత్వ ఉద్యోగుల్లా సెలవులు వాడుకునేందుకు లీవురూల్స్‌ను అమలు చేసింది. డీఏ, పీఆర్సీని అమలుచేసింది. జీవో -317 అమలుచేసేందుకు సంకల్పించింది. దీనిపై కోర్టుకెళ్లడంతో పాత జోన్ల ప్రకారం బదిలీలు చేపట్టాలని నిర్ణయించింది. గతేడాది జూలైలో బదిలీల షెడ్యూల్‌ను విడుదల చేసింది. పలువురు టీచర్లు సీనియార్టీ, సర్వీస్ పాయింట్ల మీద కోర్టుకెళ్లడంతో ఆ ప్రక్రియ నిలిచిపోయింది. 12న బదిలీలకు హైకోర్టు పచ్చజెండా ఊపింది. దీంతో శనివారం తెల్లవారు జామున టీచర్లను ప్రభుత్వం బదిలీచేసింది.

వ్యవసాయ శాఖ సలహాదారుగా పోచారం బాధ్యతలు

ఉత్తర్వులు వచ్చిన 25 రోజులకు

హైదరాబాద్, సెప్టెంబర్ 14(నమస్తే తెలంగాణ) : వ్యవసాయ శాఖ సలహాదారుగా ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు పబ్లిక్ గార్డెన్స్‌లోని ఉద్యానశాఖ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. కార్యక్రమానికి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు హాజరయ్యారు. పోచారం నియామకానికి సంబంధించి ఉత్తర్వులు వెలువడిన 25 రోజులకు బాధ్యతలు స్వీకరించడం గమనార్హం. ఆయనను వ్యవసాయ శాఖ సలహాదారుగా నియమిస్తూ ఆగస్టు 20న ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే.

బేసిక్ పేలో 'వరద కోత' వద్దు

- **బాధితులకు తోచినంత సాయం చేస్తామన్న కార్మికులు**
- **సింగరేణి నిర్ణయంపై కార్మిక వర్గాల్లో తీవ్ర వ్యతిరేకత**

పెద్దపల్లి, సెప్టెంబర్ 14 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఇటీవల కురిసిన వర్షాలు, వరదలతో నష్టపోయిన బాధితులను ఆదుకునేందుకు సింగరేణి సంస్థ ఉద్యోగులు, కార్మికులు, సిబ్బంది ఒక రోజు బేసిక్ పే ఇవ్వాలన్న యాజమాన్యం నిర్ణయాన్ని కార్మికులు వ్యతిరేకిస్తున్నారు. ప్రభుత్వ మెప్పు పొందడం కోసం తమను ముంచడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. రాష్ట్రంలో ఇటీవల వర్షాలు బీభత్సం సృష్టించడంతో ఎంతో మంది నిరాశ్రయులు కాగా.. వారికి అండగా నిలవాలని సింగరేణి సంస్థ భావించింది. సంస్థ ఉద్యోగులు, కార్మికులు, సిబ్బంది ఒక రోజు వేతనాన్ని ముఖ్యమంత్రి సహాయ నిధికి ఇవ్వాలని యాజమాన్యం నిర్ణయించింది. ఈ మేరకు ఒక రోజు బేసిక్ శాలరీ రికవరీకి సమ్మతించాలని ఈ నెల 11న గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీకి, ప్రాతినిధ్య సంఘం ఐఎన్‌టీయూసీకి, సీఎంవోఏఐకి యాజమాన్యం లేఖ రాయగా కార్మికులు వ్యతిరేకిస్తున్నారు. 'వరద బాధితులపై మాకు సానుభూతి ఉన్నా.. ఇలా ఒక రోజు బేసిక్ పే కట్ చేసేందుకు మాత్రం ఒప్పుకోం. సింగరేణి ఉద్యోగులు, కార్మికుల్లో అందరూ ధనవంతులు కాదు. మా కష్టాలు మాకు ఉన్నాయి. మేం తోచినంత సాయం చేస్తాం' అని స్పష్టంచేస్తున్నారు. ఒక రోజు వేతనం కట్ చేయొద్దని, డొనేషన్ బాక్స్‌లను ఏర్పాటు చేస్తే తమకు తోచినంత సాయం చేస్తామని పేర్కొంటూ ఈ నెల 13న పెద్దపల్లి జిల్లా రామగుండం ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని ఓసీపీ-2 కార్మికులు 60 మంది సంతకాలు చేసిన వినతి పత్రాన్ని ఓసీపీ-2 కాలరీ మేనేజర్‌కు సమర్పించడం చర్చనీయాంశంగా మారింది. ఈ లేఖ సింగరేణి విస్తరించి ఉన్న 10 జిల్లాల్లోని కార్మికుల గ్రూపుల్లో హల్‌చల్ చేస్తుండగా.. వారి నిర్ణయానికి పెద్ద సంఖ్యలో కార్మికులు మద్దతు తెలుపుతూ కామెంట్స్ పెడుతున్నారు.

వీకే ఓసీకి పర్యావరణ అనుమతులు

- **రెండు నెలల్లో బొగ్గు ఉత్పత్తికి చర్యలు తీసుకోవాలి**
- **ఏరియా జీఎంల సమీక్షలో సింగరేణి సీఎండీ బలరాం**

హైదరాబాద్, సెప్టెంబర్ 14(నమస్తే తెలంగాణ): కొత్తగూడెంలోని వీకే ఓపెన్ కాస్ట్ గనికి తొలి దశ పర్యావరణ అనుమతులొచ్చాయని సింగరేణి సంస్థ సీఎండీ ఎన్ బలరాం వెల్లడించారు. రానున్న రెండునెలల్లో బొగ్గు ఉత్పత్తికి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లోని సింగరేణి భవన్ నుంచి అన్ని ఏరియాల జీఎంలతో శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ విద్యుదుత్పత్తి కేంద్రాలకు నిరంతరాయంగా బొగ్గును సరఫరా చేయాలన్నారు. రోజుకు రెండు లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి, అదే పరిమాణంలో బొగ్గును రవాణా చేయాలని ఆదేశించారు. మూడు నెలల్లో కోల్పోయిన ఉత్పత్తి నష్టాలను భర్తీచేసేందుకు కృషిచేయాలని సూచించారు. వీసీలో డైరెక్టర్లు జీ వెంకటేశ్వర్‌రెడ్డి, డీ సత్యనారాయణరావు, జీఎం కో ఆర్డినేషన్ ఎస్‌డీఎం సుభాని, జీఎం జక్కం రమేశ్ పాల్గొన్నారు.

సింగరేణిలో బదిలీలకు ప్రత్యేక పాలసీ

- **ఉద్యోగుల విజ్ఞప్తుల స్వీకరణకు యాప్**
- **పర్సనల్ విభాగం సమీక్షలో సీఎండీ బలరాం వెల్లడి**

హైదరాబాద్, సెప్టెంబర్14 (నమస్తే తెలంగాణ): సింగరేణి ఉద్యోగులకు ప్రత్యేక ట్రాన్స్‌ఫర్ పాలసీని రూపొందిస్తామని, కాలరీస్‌లో కాగిత రహిత కార్యకలాపాలు నిర్వహించేలా రెండు నెలల్లో ఈ-ఆఫీస్ సేవలను అందుబాటులోకి తీసుకొస్తామని సంస్థ సీఎండీ బలరాం తెలిపారు. పర్సనల్ విభాగం పనితీరుపై హైదరాబాద్ సింగరేణిభవన్ నుంచి శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. బలరాం మాట్లాడుతూ సింగరేణిలో అధికారుల బదిలీ విషయంలో ప్రత్యేక పాలసీ ఉన్నదని, కానీ 40 వేల మంది కార్మికులకు ఎలాంటి బదిలీ విధానం లేదన్నారు. పారదర్శకంగా ఉండేలా ప్రత్యేక అప్లికేషన్(యాప్)ను రూపొందించాలని ఐటీ విభాగానికి ఆదేశాలు జారీచేశారు. సమావేశంలో డైరెక్టర్లు సత్యనారాయణరావు, వెంకటేశ్వర రెడ్డి, జీఎంలు ఎస్‌డీఎం సుభానీ, రవిప్రసాద్ పాల్గొన్నారు.

గల్ఫ్ మృతుల కుటుంబాలకు 5లక్షలు

గల్ఫ్ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తాం : మంత్రి పొన్నం ప్రకటన



హైదరాబాద్, సెప్టెంబర్14(నమస్తే తెలంగాణ): గతేడాది డిసెంబర్ 7 తర్వాత గల్ఫ్‌లో మరణించిన కార్మికుల కుటుంబాలకు రూ.5లక్షలు, జూన్ 2, 2014 తర్వాత మరణించిన వారికి రూ.లక్ష చొప్పున పరిహారం అందిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం గల్ఫ్ సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని నిర్ణయించిందని వెల్లడించారు. గల్ఫ్ కార్మికులు అధికంగా ఉండే నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలతో హైదరాబాద్‌లో శనివారం సమావేశమయ్యారు. గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి చేపట్టాల్సిన చర్యలపై ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, టీపీసీసీ ఎన్నారై సెల్ అధ్యక్షుడు వినోద్ నేతృత్వంలోని కమిటీ నివేదించిన ఐదు అంశాలపై చర్చించారు.

మధ్యప్రదేశ్‌లో 'అద్దెకు భార్య'

భోపాల్: మధ్యప్రదేశ్‌లోని శివపురిలో మహిళల సంత జరుగుతుండటం అందరినీ కలచివేస్తున్నది. ధడీచా పేరుతో కొనసాగుతున్న ఈ తిరోగమన ఆచారం దిగ్భ్రాంతికి గురిచేస్తున్నది. ఈ సంతలో యువతులు, మహిళలను అద్దెకు ఇస్తారు. నచ్చిన యువతి/మహిళను నెలలు, సంవత్సరాల కోసం అద్దెకు తీసుకుంటారు. ఆమె కుటుంబ సభ్యులు, అద్దెకు తీసుకునేవారు స్టాంపు పేపర్లపై ఒప్పందం రాసుకుంటారు. పెండ్లి చేసుకోవడానికి తగిన యువతి దొరకనివారు, తమ ఇండ్లలోని వయోవృద్ధుల సంరక్షణ కోసం మహిళలు అవసరమైనవారు ఈ విధంగా ఒప్పందాలు చేసుకుంటారు. అద్దె రూ.15,000 నుంచి ప్రారంభమై, కొన్ని లక్షల వరకు ఉండవచ్చు. కన్యలకు ఎక్కువ ధర ఉంటుందని, అయితే ఈ ఒప్పందాన్ని తిరస్కరించే హక్కు మహిళలకు ఉంటుందని స్థానికులు చెప్తున్నారు.

వాణిజ్య



యమహా స్పోర్ట్స్ బైక్

చెన్నై, సెప్టెంబర్ 14: స్పోర్ట్స్ బైకుల విభాగంలో పోటీని మరింత పెంచే ఉద్దేశంలో భాగంగా యమహా మోటర్ సరికొత్త బైకును అందుబాటులోకి తీసుకొచ్చింది. కార్బన్ ఫైబర్ ప్యాటర్న్ గ్రాఫిక్‌తో రూపొందించిన ఆర్15ఎం బైకును మార్కెట్లోకి ప్రవేశపెట్టింది. 155 సీసీ ఇంజిన్‌తో తయారైన ఈ బైకు ధర రూ.2,08,300గా నిర్ణయించింది. ఈ ధరలు ఢిల్లీ షోరూంనకు సంబంధించినవి. అలాగే దీంతోపాటు ఆర్15 ఎం మెటాలిక్ గ్రే కలర్ మాడల్ ధర రూ.1,98,300.

గోల్డ్ @75వేలు

హైదరాబాద్, సెప్టెంబర్ 14: బంగారం ధరలు మరింత ప్రియమయ్యాయి. హైదరాబాద్ బులియన్ మార్కెట్లో 24 క్యారెట్ తులం ధర రూ.440 అధికమై రూ.74,890కి చేరుకున్నది. అంతకుముందు ఇది రూ.74,450గా ఉన్నది. అలాగే 22 క్యారెట్ ధర రూ.400 ఎగబాకి రూ.68,250 నుంచి రూ.68,650కి చేరుకున్నది. వెండి లక్ష రూపాయల దిశగా పయనిస్తున్నది. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి కొనుగోళ్లు ఊపందుకోవడంతో కిలో వెండి రూ.2,000 అధికమై రూ.97 వేలకు చేరుకున్నది. గడిచిన నాలుగు రోజుల్లో బంగారం రూ.2,500 వరకు, వెండి రూ.8 వేల వరకు పెరిగింది.

రోజుకు రూ.3తో రిస్క్ కవరేజీ

సైబర్ మోసాలకు రక్షణగా సాషే ప్రొడక్ట్స్ తెస్తున్న బీమా సంస్థలు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 14: సైబర్ మోసాలు రోజురోజుకూ ఎక్కువైపోతున్నాయి. పెరుగుతున్న టెక్నాలజీనే ఆసరాగా తీసుకొని సైబర్ నేరగాళ్లు దాడులకు తెగబడుతున్నారు. దీంతో బాధితులకు రక్షణే లేకుండాపోతున్నది. అందుకే ఇన్సూరెన్స్ కంపెనీలు ఇప్పుడు ఈ కోణంలో దృష్టి పెడుతున్నాయి. ఈ క్రమంలోనే ఆయా బీమా సంస్థలు.. సైబర్ మోసాలకు రక్షణగా సాషే ప్రొడక్ట్స్‌ను పరిచయం చేస్తున్నాయి. ఈ రిస్క్ కవరేజీలు కేవలం రోజుకు రూ.3కే లభిస్తుండటం విశేషం. వ్యక్తులు, వ్యాపార సంస్థల అవసరాలకు తగ్గట్టుగా ఈ చిన్న ప్లాన్లను ఇన్సూరర్లు రూపొందిస్తున్నారు.

ఏఐ వినియోగంతో..

మోసగాళ్ల చేతికి సాంకేతిక పరిజ్ఞానం చిక్కితే జరిగే నష్టం అపారం. ఇప్పుడు సైబర్ ప్రపంచంలో కృత్రిమ మేథస్సు (ఏఐ)తో మోసగాళ్లు చేస్తున్నదిదే. జెన్‌ఏఐ సాయంతో నకిలీ వీడియోలు, వాయిస్ క్లోనింగ్‌లు, టెక్స్ట్ సందేశాలు, ఎస్ఎంఎస్ ఫిషింగ్, ఫ్రాడ్ కాల్స్, ఫేస్ మార్ఫింగ్, ఓటీపీ చోరీలకు దిగుతున్నారు. వీటితో వ్యక్తులు, సంస్థలను బెదిరిస్తూ అక్రమాలకు తెగబడుతున్నారని హెచ్‌డీఎఫ్‌సీ ఎర్గో జనరల్ ఇన్సూరెన్స్ డైరెక్టర్ పార్థనీల్ ఘోష్ అన్నారు. ఈ సంస్థ ఇప్పటికే మాల్‌వేర్, రాన్సమ్‌వేర్ సైబర్ దాడులను ఎదుర్కొనేలా వ్యక్తులు, వ్యాపార సంస్థల కోసం ఓ సైబర్ సాషే ఇన్సూరెన్స్ పాలసీని తీసుకొచ్చింది.



పెరుగుతున్న మార్కెట్ విలువ

భారతీయ సైబర్ ఇన్సూరెన్స్ మార్కెట్ విలువ 2023లో 50-60 మిలియన్ డాలర్లుగా ఉన్నది. అయితే ఇది రాబోయే ఐదేండ్లలో 27-30 శాతం వృద్ధి చెందవచ్చని డెలాయిట్ ఇటీవల నిర్వహించిన ఓ అధ్యయనంలో అంచనా వేసింది. ఇందుకు తగ్గట్టుగానే ఎస్బీఐ జనరల్, హెచ్‌డీఎఫ్‌సీ ఎర్గో, ఐసీఐసీఐ లాంబార్డ్‌లు సైబర్ రిస్క్ కవరేజీ ప్లాన్లను తీసుకొస్తున్నాయి. కాగా, జెన్‌ఏఐ దన్నుతో జరుగుతున్న మోసాల వల్ల ఆర్థికపరమైన నష్టమేగాక సంస్థల పరపతి, వ్యక్తుల పరువు-ప్రతిష్ఠలూ దెబ్బతింటున్నాయని ఇన్సూరెన్స్ బ్రోకింగ్ కంపెనీ లాక్టోన్ ఇండియా సీఈవో సందీప్ దాడియా అన్నారు. బలమైన లీగల్ ప్రొటెక్షన్ కోసం ఓ డిజిటల్ పర్సనల్ డాటా ప్రొటెక్షన్ చట్టాన్నీ తేవాలన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. వ్యక్తిగత సమాచార చోరీకి కంపెనీలదే బాధ్యతన్నారు.

జాగ్రత్తలు అవసరం

పెరుగుతున్న సైబర్ దాడుల నేపథ్యంలో అంతా జాగ్రత్తగా ఉండాలని నిపుణులు సలహా ఇస్తున్నారు. ఏఐ ఆధారిత టెక్నాలజీతో నకిలీ మాయాజాలం నడుస్తున్నదని, అన్నిరకాలుగా నష్టపరుస్తున్నారంటున్నారు. అందుకే ఆన్‌లైన్‌లో ఉన్నప్పుడు చాలాచాలా అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. అనవసరపు లింక్స్‌పై క్లిక్ చేయవద్దని, అపరిచితుల కాల్స్, మెసేజ్‌లకు స్పందించకపోవడమే ఉత్తమమంటున్నారు. వ్యక్తిగత ఫోటోలను సైతం తరచూ ఆన్‌లైన్, సామాజిక మాధ్యమాల్లో అప్‌లోడ్ చేయవద్దని, కొత్తకొత్త యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోవద్దని కూడా హెచ్చరిస్తున్నారు. విలువైన సమాచారాన్ని (బ్యాంక్ ఖాతా నెంబర్లు, ఓటీపీలు, పాస్‌వర్డ్‌లు) స్మార్ట్ ఫోన్లలో సేవ్ చేసుకోవడం, ఈ-మెయిల్స్‌లో పంపించుకోవడం మానేయడం మంచిదనీ సైబర్ ఎక్స్‌పర్ట్స్ చెప్తున్నారు.

ఏమిటీ సాషే ఇన్సూరెన్స్

సాషే ఇన్సూరెన్స్ ప్రొడక్ట్స్ అంటే చిన్న పరిమాణంలో ఉండే బీమా పాలసీలు. సాధారణంగా ఇవి ప్రయాణం, దొంగతనం, గృహోపకరణాలు, ఫిట్నెస్ వంటి కొన్ని అంశాలకు సంబంధించి రూపొందుతాయి. ఇంకా చెప్పాలంటే పరిమిత శ్రేణిలో, తాత్కాలిక రక్షణే లక్ష్యంగా ఈ బీమా పాలసీలుంటాయి. సంప్రదాయ ఇన్సూరెన్స్ పాలసీలైతే జీవిత, ఆరోగ్య, ఆస్తుల వంటి అంశాలపై సమగ్ర రీతిలో లభిస్తాయి.

ఏయే కవరేజీలు?

ఐడెంటిటీ చోరీ, సైబర్ స్టాకింగ్, ఫిషింగ్, ఈ-మెయిల్ స్పూఫింగ్, సైబర్ దోపిడి, నిధుల దొంగతనం, డాటా అపహరణ వంటి వాటికి ఈ బీమా రక్షణ కల్పిస్తుంది. న్యాయపరమైన వ్యవహారాల్లో ఖర్చులను బీమా సంస్థలే ఇస్తాయి.

బజాజ్ హౌజింగ్ ఐపీవో అదుర్స్

- **63 రెట్ల అధిక బిడ్డింగ్ దాఖలు**

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 14: ప్రముఖ నాన్ బ్యాంకింగ్ ఆర్థిక సేవల సంస్థ బజాజ్ హౌజింగ్ ఫైనాన్స్ అదరగొట్టింది. స్టాక్ మార్కెట్లో లిస్ట్ కావడానికి సిద్ధమైన సంస్థకు పెట్టుబడిదారుల నుంచి విశేష స్పందన లభించింది. సంస్థ జారీ చేసిన షేర్ల కంటే 63 రెట్ల అధిక బిడ్లు దాఖలయ్యాయి. అంటే ఐపీవోల చరిత్రలో ఇంతటి స్థాయిలో బిడ్లు రావడం ఇదే తొలిసారి కావడం విశేషం. వాటాల విక్రయం ద్వారా రూ.6,560 కోట్ల నిధులను సేకరించాలనుకున్న సంస్థకు రూ.3.2 లక్షల కోట్ల బిడ్లు దాఖలయ్యాయి. అంటే జారీ చేసినదానికంటే 63.6 రెట్లు అధికంగా బిడ్లు దాఖలు కావడం విశేషం. మార్కెట్లో సెంటిమెంట్ బలంగా ఉండటం, ముఖ్యంగా రిటైల్ పెట్టుబడిదారులు అధికంగా బిడ్లు దాఖలు చేశారు. దేశ జీడీపీలో ఈ ఐపీవో వాటా ఒక్క శాతానికి పైగా ఉన్నది. 2023-24 ఆర్థిక



సంవత్సరానికిగాను దేశ జీడీపీ రూ.295.36 లక్షల కోట్లుగా ఉన్నది.

- బజాజ్ హౌజింగ్ ఫైనాన్స్ ఈ నెల 16న ఉదయం 10 గంటలకు బీఎస్ఈ, ఎన్ఎస్ఈలో లిస్ట్‌కాబోతున్నది.
- 2008లో కోల్ ఇండియా జారీ చేసిన షేర్లకు రూ.2.36 లక్షల కోట్ల బిడ్లు దాఖలయ్యాయి.
- అలాగే ప్రీమియర్ ఎనర్జీ షేర్లకు రూ.1.48 లక్షల కోట్లు బిడ్లు రాగా, టాటా టెక్నాలజీ ఐపీవోకి రూ.1.56 లక్షల కోట్ల బిడ్లు వచ్చాయి. ఇప్పటి వరకు ఇవే గరిష్ఠ స్థాయి బిడ్డింగులు.

2 లక్షల కోట్ల జీఎస్టీ ఎగవేతలు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 14: జీఎస్టీ ఎగవేతలను తగ్గించడానికి కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలను ఇవ్వడం లేదు. గడిచిన ఆర్థిక సంవత్సరంలో ఏకంగా రూ.2.01 లక్షల కోట్ల జీఎస్టీ ఎగవేతలకు పాల్పడినట్లు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ జీఎస్టీ ఇంటిలిజెన్స్(డీజీజీఐ) గుర్తించింది. 2024-25లో 6,084 కేసులు జీఎస్టీ ఎగవేతలకు పాల్పడినట్లు, వీటి విలువ రూ.2.01 లక్షల కోట్లని శనివారం విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. సేవల విభాగంలో ఆన్‌లైన్ గేమింగ్, బీఎఫ్ఎస్ఐ, ఇనుము, రాగి, తుక్కు వంటి విభాగాల్లో జీఎస్టీ ఎగవేతలు అధికంగా ఉంటాయని పేర్కొంది. 2022-23లో నమోదైన 4,872 కేసుల జీఎస్టీ ఎగవేత రూ.1.01 లక్షల కోట్ల కంటే ఇది రెండింతలు పెరిగింది. జీఎస్టీ ఎగవేతల్లో పన్నుకు సంబంధించినవి 46 శాతంగా ఉండగా, 20 శాతం ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్, 19 శాతం ఐటీసీకి సంబంధించినవని పేర్కొంది. ఆన్‌లైన్ గేమింగ్ రంగంలో రూ.81 వేల కోట్ల ఎగవేతలు జరిగాయని తెలిపింది.

రష్యన్ ఆర్మీ చెర నుంచి విముక్తి

- గల్ఫ్ ఏజెంట్ చేతిలో మోసపోయి బానిస బతుకు
- కేంద్రప్రభుత్వ చొరవతో తిరిగి స్వస్థలానికిచేరిన తెలంగాణ బిడ్డ సూఫియాన్



హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 14 (నమస్తే తెలంగాణ): గల్ఫ్ ఏజెంట్ చేతిలో మోసపోయి రష్యన్ ప్రైవేట్ ఆర్మీలో చెరలో 8 నెలలపాటు బానిస బతుకు బతికిన నారాయణపేట జిల్లా వాసి సూఫియాన్ (22)కు విముక్తి లభించింది. కేంద్ర ప్రభుత్వ చొరవతో ఆయన ఎట్టకేలకు స్వస్థలానికి చేరుకున్నాడు. సూఫియాన్‌లా భారత్ నుంచి వెళ్లి దాదాపు 60 మంది మోసపోయినట్టు తెలుస్తున్నది. వివరాల్లోకి వెళ్తే.. విదేశీ కొలువుల పేరుతో నిరుడు డిసెంబర్‌లో వారిని భారత్ నుంచి తీసుకెళ్లి అక్కడి భద్రతా సిబ్బందికి వ్యక్తిగత సహాయకులుగా నియమించారు. తర్వాత అక్కడ పరిస్థితులు దారుణంగా మారడంతో వారిని రష్యా-ఉక్రెయిన్ సరిహద్దు ప్రాంతాల్లో బంకర్లు, కందకాలు, ప్రమాదకరమైన ఆయుధాల నిర్వహణకు, ఇతర కఠినమైన పనులకు ఉపయోగించారు. దీంతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బతికిన సూఫియాన్ తమ దైన్యస్థితిని వివరిస్తూ 8 నెలల క్రితం పంపిన ఓ వీడియో ఇటీవల సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. చివరికి ఈ వీడియో కేంద్ర ప్రభుత్వం దృష్టికి వెళ్లడంతో తామంతా మళ్లీ భారత్‌కు తిరిగి రాగలిగామని, బాధితుల్లో తెలంగాణతోపాటు కర్ణాటకకు చెందినవారు కూడా ఉన్నారని శంషాబాద్ ఎయిర్‌పోర్టులో సూఫియా న్ వివరించాడు. ఇన్నాళ్లూ రష్యా-ఉక్రెయిన్ సరిహద్దులో సమయానికి తిండి, నిద్ర లేకుండా రోజుకు 15 గంటలకుపైగా విధులు నిర్వర్తించాల్సి వచ్చిందని తెలిపాడు.

కొడంగల్‌లో ఫార్మా కంపెనీని అడ్డుకుంటాం

- బీఆర్‌ఎస్ నుంచి గెలిచి పార్టీ మారిన ఎమ్మెల్యేలకు దమ్ముంటే రాజీనామా చేయాలి
- మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి


కోస్గిలో మీడియాతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

మద్దూరు(కోస్గి), సెప్టెంబర్ 14 : కొడంగల్ నియోజకవర్గంలో ఏర్పాటు చేయనున్న ఫార్మా విలేజ్‌ను అడ్డుకొని తీరుతామని మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి హెచ్చరించారు. శనివారం ఆయన నారాయణపేట జిల్లా కోస్గిలో మీడియాతో మాట్లాడారు. ఏడు గ్రామాల పరిధిలో వేల ఎకరాల్లో ఫార్మాసిటీని నిర్మిస్తున్నారని తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఫార్మాసిటీ కోసం ఇబ్రహీంపట్నం, మహేశ్వరం నియోజకవర్గంలో 13 వేల ఎకరాలను కేటాయించిందని గుర్తుచేశారు. సిద్ధంగా ఉన్న స్థలంలో ఫార్మా సిటీ ఏర్పాటు చేయకుండా కొడంగల్‌కు ఎందుకు తరలిస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. ఇప్పటికే స్థానిక రైతులు ఈ కంపెనీ రాకను వ్యతిరేకిస్తున్నారని, ఇప్పటికైనా ఫార్మా కంపెనీ ఏర్పాటును విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కోస్గి పట్టణ సమీపంలో కాలుష్యకారక పరిశ్రమలను ఎందుకు ఏర్పాటు చేస్తున్నారని ప్రశ్నించారు. దీనిపై ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఇంటిపై రౌడీలు దాడి చేయడాన్ని అందరూ ఖండించాలని అన్నారు. బీఆర్‌ఎస్ నుంచి గెలిచి పార్టీ మారిన ఎమ్మెల్యేలకు దమ్ముంటే రాజీనామా చేసి తిరిగి కాంగ్రెస్ బీఫాంపై గెలవాలని సవాల్ విసిరారు. కొడంగల్‌లో 30 శాతం మాత్రమే రుణమాఫీ జరిగిందని, పూర్తిస్థాయిలో అర్హులైన రైతులకు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు.

నంబర్ ప్లేటు లేకపోతే మోసగించినట్టు కాదు

పోలీసుల కేసును కొట్టేసిన హైకోర్టు

హైదరాబాద్, సెప్టెంబర్ 14 (నమస్తే తెలంగాణ): నంబర్ ప్లేటు లేకుండా వాహనాన్ని నడపడం మోసం (చీటింగ్) పరిధిలోకి రాదని హైకోర్టు స్పష్టం చేసింది. దాన్ని నేరంగా పరిగణించడం సరికాదని తప్పుపట్టింది. నంబర్ ప్లేటు లేకుండా వాహనాన్ని నడుపుతున్న వ్యక్తిపై ఐపీసీలోని 420 సెక్షన్‌తోపాటు మోటర్ వాహనాల చట్టంలోని సెక్షన్ 80(ఏ) కింద చార్మినార్ పోలీసులు నమోదు చేసిన కేసును కొట్టివేసింది. ఈ మేరకు జస్టిస్ కే సుజన ఇటీవల తీర్పును వెలువరించారు. నంబర్ ప్లేటు లేని వాహనదారులకు పోలీసులు జరిమానా విధించవచ్చని లేకుంటే సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేయవచ్చని, అలా కాకుండా మోసం చేశారన్న అభియోగంతో కేసు నమోదు చేయడం చెల్లదని ఆ తీర్పులో పేర్కొన్నారు.

దూసుకొస్తున్న భారీ గ్రహ శకలం

17న భూమికి చేరువగా '2024 ఆన్'

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 14: మానవాళిని ఓ భారీ గ్రహ శకలం (ఆస్టరాయిడ్) భయపెడుతున్నది. ఆకాశ హర్మ్యం అంత పరిమాణంలో ఉన్న ఈ గ్రహశకలం ఈ నెల 17న భూగోళాన్ని దాటుకుని వెళ్తుందని అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ 'నాసా' ప్రకటించింది. 721 నుంచి 1,575 అడుగుల (220-480 మీటర్ల) చుట్టుకొలతతో ఉన్న ఈ గ్రహశకలానికి '2024 ఆన్' అని నామకరణం చేశారు. ప్రస్తుతం ఈ ఆస్టరాయిడ్ గంటకు 19,842 మైళ్ల (31,933 కి.మీ.) వేగంతో ప్రయాణిస్తున్నదని, ఇది ధ్వని వేగం కంటే 26 రెట్లు అధికమని 'లైవ్ సైన్స్' వెల్లడించింది. ఈ గ్రహ శకలం భూగోళానికి దాదాపు 62 వేల మైళ్ల (లక్ష కిలోమీటర్ల) చేరువగా రానున్నది. ఇది భూమికి, చంద్రునికి మధ్య ఉన్న సగటు దూరం కంటే 2.6 రెట్లు ఎక్కువ. ఈ ఆస్టరాయిడ్ భూమిని ఢీ కొనబోదని, మానవాళి భద్రతకు ఎలాంటి ముప్పు కలిగించబోదని శాస్త్రవేత్తలు తెలిపారు. నాసా నిర్దేశించిన ప్రమాణాల ప్రకారం భూగోళానికి 12 కోట్ల మైళ్ల (19.3 కోట్ల కిలోమీటర్ల) చేరువగా వచ్చిన ఖగోళ వస్తువులను భూమికి సమీపంగా వచ్చిన వస్తువులుగా, 46.5 లక్షల మైళ్ల (75 లక్షల కిలోమీటర్ల) చేరువగా వచ్చే పెద్ద వస్తువులను ప్రమాదకరమైనవిగా పరిగణిస్తారు.

10 లక్షల లగ్జరీ కాక్ టెయిల్!

న్యూఢిల్లీ: అమెరికాలోని చికాగోలో ఉన్న ఇటాలియన్ రెస్టారెంట్ అడలినా అత్యంత ఖరీదైన లగ్జరీ కాక్‌టెయిల్‌ను అందుబాటులోకి తెచ్చింది. హై ఎండ్ జ్యూయలరీ బ్రాండ్ మారో ఫైన్‌తో కలిసి మారో మర్టిని పేరుతో దీనిని ఈ నెల 9 నుంచి విక్రయిస్తున్నది. దీని ధర 13,000 డాలర్లు (రూ.10 లక్షలకు పైగా). అడలినా రెస్టారెంట్ జనరల్ మేనేజర్ కోలిన్ హోఫర్ దీనిని తయారు చేశారు. దీనితోపాటు మారో ఫైన్ తయారు చేసిన 9 క్యారెట్ల డైమండ్ టెన్నిస్ నెక్లెస్‌ను ఇస్తారు. 14 క్యారెట్ల బంగారం మీద 150 వజ్రాలతో కూడిన నెక్లెస్ ఇది. ఫైన్ జ్యూయలరీ, లగ్జరీ డైనింగ్‌ను ఆస్వాదించేలా చేయడమే మారో మర్టిని ప్రత్యేకత.

జాతీయ పోలీస్ అకాడమీలో డైరెక్టర్స్ పరేడ్

మెడల్స్ అందజేసిన ఎన్‌పీఏ డైరెక్టర్ అమిత్‌గార్గ్

హైదరాబాద్, సెప్టెంబర్ 14 (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్‌లోని జాతీయ పోలీస్ అకాడమీలో 76వ ఐపీఎస్ ట్రైనీల డైరెక్టర్స్ పరేడ్ శనివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఎన్‌పీఏ డైరెక్టర్ అమిత్‌గార్గ్ అకాడమీలో అంకితభావంతో పనిచేసిన 35 మంది అధికారులు, ఎన్‌పీఏ సిబ్బందిని సన్మానించి, ప్రశంసాపత్రాలు అందజేశారు. పరేడ్ కమాండర్ అచ్యుత్ అశోక్ (కేరళ క్యాడర్) నేతృత్వంలో 207 మంది ట్రైనీ ఐపీఎస్‌లు కవాతు చేశారు. వీరిలో 19 మంది ఫారిన్ ఆఫీసర్స్ ఉన్నారు. కేరళ కేడర్‌కు చెందిన అపర్ణ ఫిజికల్ ట్రైనింగ్‌లో బెస్ట్ లేడీ ప్రొబెషనర్‌గా, నేపాల్ నుంచి సనమ్‌మల్లా బెస్ట్ జెంటిల్‌మన్ ప్రొబెషనర్‌గా, ఉత్తరప్రదేశ్‌కు చెందిన శివమ్‌అశుతోష్ మస్కట్రీ విభాగంలో, విశ్వజిత్ శౌర్యన్ బెస్ట్ డ్రిల్ ప్రొబెషనర్‌గా మెడల్స్ అందుకున్నారు.

కర్ణాటకలో పాల ధరల పెంపు?

- పరోక్షంగా ప్రకటించిన సిద్ధరామయ్య
- లీటర్‌పై రూ.5 పెంచేందుకు కసరత్తు
- ఇప్పటికే పెరిగిన పెట్రో, మద్యం ధరలు



బెంగళూరు, సెప్టెంబర్ 14: కర్ణాటకలో పాల ధరను పెంచేందుకు కాంగ్రెస్ సర్కారు సిద్ధమవుతున్నది. లీటర్ పాలపై రూ.5 ధర పెంచేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తున్నది. శుక్రవారం ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఈ విషయాన్ని పరోక్షంగా ప్రకటించారు. రామనగర జిల్లా మగడిలో అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. లీటరు పాలపై రూ.5 ధర పెంచేందుకు త్వరలో రైతులకు అనుకూలంగా నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు. సహకార సంఘాలు సైతం తమకు లీటరుపై 20 పైసలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాయని, దీనిపైనా త్వరలో నిర్ణయం తీసుకుంటామని ఆయన తెలిపారు. పాడి రైతుల డిమాండ్ మేరకు ధరలు పెంచుతున్నామని ప్రభుత్వం చెప్తున్నప్పటికీ దీని వల్ల ప్రత్యక్షంగా ప్రజలపై భారం పడనుంది.

ఏడాదిన్నరలో మూడోసారి


గత ఏడాది మే నెలలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పాల ధరలు పెంచడం ఇది మూడోసారి. అధికారంలోకి రాగానే గత జూలైలో లీటరుపై రూ.3 పెంచింది. తర్వాత ఈ ఏడాది జూన్‌లో మరోసారి లీటర్‌పై రూ.2 పెంచింది. ఇప్పుడు మూడోసారి లీటర్‌పై రూ.5 పెంచేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సమాయత్తమవుతున్నది. అయితే, పాడి రైతుల కోసం ప్రభుత్వం ధరలు పెంచుతున్నామని చెప్తూ వస్తున్నది. కానీ, పాల వినియోగదారులైన ప్రజలపై భారం పడకుండా మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. కర్ణాటక ప్రభుత్వ సంస్థ అయిన కర్ణాటక మిల్క్ ఫెడరేషన్(కేఎంఎఫ్) రైతుల నుంచి పాలను సేకరిస్తుంది. నందిని బ్రాండ్‌తో ఈ పాలను ప్రజలకు విక్రయిస్తుంది. కర్ణాటకలో నందిని పాలకు భారీగా డిమాండ్ ఉంది.

మూడోసారి మద్యం ధర పెంపు!

గ్యారెంటీల పేరుతో హామీలు ఇచ్చి ఎన్నికల్లో గట్టెక్కిన కాంగ్రెస్ సర్కారు ఇప్పుడు వాటిని నెరవేర్చలేక నానా పాట్లు పడుతున్నది. ధరల పెంపుతో ప్రజలపైనే గ్యారెంటీల భారం మోపుతున్నది. గత జూన్‌లో పెట్రోల్, డీజిల్‌పై సేల్స్ ట్యాక్స్‌ను లీటరుకు రూ.3 పెంచింది. మరోవైపు మద్యంపై ఇప్పటికే రెండుసార్లు ధరలు పెంచి, ఇప్పుడు మూడోసారి పెంపు కోసం ప్రతిపాదన సిద్ధం చేసింది. గత ఏడాది జూలైలో అదనపు ఎక్సైజ్ డ్యూటీని 10 శాతం పెంచడంతో ఒక్కో బీర్‌పై రూ.10-15 వరకు ధర పెరిగింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో మరోసారి పెంచడంతో ఒక్కో బీర్‌పై రూ.15 పెరిగింది. ఇప్పుడు మూడోసారి పెంచేందుకు సిద్ధమవుతున్నది.

'పోక్సో' కేసు పెట్టారని సామాజిక బహిష్కరణ

- దళితులపై అగ్రవర్ణాల దుశ్చర్య
- కర్ణాటక యాద్గిర్ జిల్లాలో ఘటన



బెంగళూరు, సెప్టెంబర్ 14: పోక్సో కింద కేసు పెట్టారన్న కక్షతో ఓ గ్రామంలోని అగ్ర వర్ణాల వారు..అక్కడి దళితులందరిపైనా సామాజిక బహిష్కరణ విధించారు. కర్ణాటకలోని యాద్గిర్ జిల్లా హునాసాగి తాలూకాలోని ఓ గ్రామంలో ఈ దారుణం చోటుచేసుకుంది. తమను సామాజికంగాబహిష్కరించారని గ్రామంలోని దళితులు పోలీసు ఉన్నతాధికారుల ముందు తమ గోడు వెళ్లబోసుకున్నారు. దీంతో గ్రామంలో ఇరు వర్గాలకు చెందినవాళ్లతో పోలీసులు సమావేశమయ్యారు. ఓ బీద దళిత కుటుంబానికి చెందిన 15 ఏండ్ల బాలిక గర్భం దాల్చటంతో, బాధితురాలి తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు. యువతిని మోసం చేసిన వ్యక్తి గ్రామంలో అగ్ర వర్ణానికి చెందినవాడని తేలింది. నారాయణ్‌పూర్ పోలీస్ స్టేషన్‌లో నిందితుడిపై పోక్సో కింద కేసు నమోదైంది. దీనికి ప్రతీకారంగా.. గురువారం రాత్రి నుంచి దళితుల్ని సామాజికంగా బహిష్కరించినట్టు పోలీసుల విచారణలో తేలింది.

ఆధార్ ఉచిత అప్‌డేట్ గడువు డిసెంబర్ 14కు పొడిగింపు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 14: ఆన్‌లైన్లో ఆధార్ ఉచిత అప్‌డేట్ గడువును మరోసారి పొడిగించారు. ఆధార్‌లో మార్పులు, చేర్పులు ఉచితంగా చేసుకోవడానికి గడువు ఈ నెల 14న ముగియడంతో పౌరులకు ఈ సౌకర్యాన్ని మరికొంత కాలం కొనసాగించడం కోసం ఈ ఏడాది డిసెంబర్ 14 వరకు దీనిని పొడిగిస్తున్నట్టు భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (యూఐడీఏఐ) శనివారం వెల్లడించింది. ఆధార్ కార్డులు తీసుకుని గత పదేండ్లు దాటి అప్పటి నుంచి చిరునామా, ఇతర వివరాలు అప్‌డేట్ చేసుకోని పౌరులు వాటిని ఉచితంగా అప్‌డేట్ 'మై ఆధార్ పోర్టల్'లో చేసుకోవాలని యూఐడీఏఐ ఒక ప్రకటనలో స్పష్టం చేసింది.

నకిలీ టికెట్ల పని పట్టే యాప్

అభివృద్ధి చేసిన రైల్వే

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 14: రైల్వేలో నకిలీ, ట్యాంపర్డ్ అన్‌రిజర్వ్‌డ్ టిక్కెట్లను కనిపెట్టడానికి ఒక సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేశారు. ట్రావెలింగ్ టికెట్ ఎగ్జామినర్ (టీటీఈ)లు వీటి సహాయంతో నకిలీ టిక్కెట్లను ఇట్టే పట్టేస్తారు. ఈ టీటీఈ ఆండ్రాయిడ్ యాప్ సహాయంతో అన్ రిజర్వ్‌డ్ టిక్కెట్ విధానంలో జారీ చేసినవి సక్రమమైనవా, అక్రమమైనవా అని పరిశీలించవచ్చు. దీని కోసం టీటీఈలందరికీ హెచ్‌ఎంటీ మిషన్లను అందజేశారు. టిక్కెట్‌పై ఉన్న యూటీఎస్ నెంబర్ నమోదు చేయడం ద్వారా అది అసలుదా, నకిలీదా అన్నది వీరు కనిపెట్టేస్తారు. అలాగే ఈ యాప్ ద్వారా టికెట్‌పై ముద్రించి ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా పూర్తి వివరాలు తెలుసుకోవచ్చునని అధికారులు తెలిపారు.

వంతెన కూలడాన్ని ముందే చెప్తుంది

పరికరాన్ని అభివృద్ధి చేసిన ఐఐటీ మండీ ప్రొఫెసర్

న్యూఢిల్లీ: బలహీనంగా, కూలిపోయే స్థితిలో ఉన్న వంతెనల గురించి ముందుగానే హెచ్చరించే డిజిటల్ పరికరాన్ని ఐఐటీ మండీ ప్రొఫెసర్ డాక్టర్ శుభమయ్ సేన్ అభివృద్ధి చేశారు. పరిశోధకుడు ఈశ్వర్ కుంచమ్‌తో కలిసి దీనిని రూపొందించారు. వంతెనలో అత్యంత బలహీనంగా ఉన్న చోట దీనిని అమర్చితే, దీనిలోని అల్గోరిథం ఎప్పటికప్పుడు వంతెన భద్రత, పటిష్టత ఏ స్థితిలో ఉందో గుర్తించి సమాచారాన్ని అందజేస్తుంది.ఈ డిజిటల్ మోడల్ ద్వారా వంతెన పరిస్థితిని కచ్చితంగా తెలుసుకోవచ్చు. వరదలు, భూకంపాలు వంటి విపత్తుల సమయంలో కూలిపోయే అవకాశం ఉన్న వంతెనల సమాచారాన్ని ఈ పరికరం అప్పటికప్పుడు వివిధ శాఖలకు పంపిస్తుంది.

ఇజ్రాయెల్‌పై లెబనాన్ రాకెట్ల వర్షం

సమర్థంగా తిప్పి కొట్టామన్న సైన్యం

గాజా: ఇజ్రాయెల్‌పై లెబనాన్ రాకెట్ల వర్షం కురిపించింది. సఫేద్, దాని పరిసర ప్రాంతాల్లో శనివారం 55 రాకెట్లతో విరుచుకుపడింది. అయితే ఈ దాడిలో ఎవరూ గాయపడలేదని ఇజ్రాయెల్ మిలటరీ తెలిపింది. మొదటి విడతగా 20 రాకెట్లు, మరు క్షణంలోనే మరో 35 రాకెట్లతో దాడి జరిగిందని, అయితే వాటిలో చాలా వాటిని సమర్థంగా అడ్డుకొన్నారని, మిగిలినవి మైదాన ప్రాంతాల్లో పడ్డాయని ఆర్మీ అధికారులు చెప్పినట్టు టైమ్స్ ఆఫ్ ఇజ్రాయెల్ తెలిపింది. దాడికి ముందు జాగ్రత్తగా ఉండాలంటూ ఇజ్రాయెల్ తన పౌరులకు అప్రమత్తం చేసింది. ఈ దాడి జరిగిన కొద్ది సమయం తర్వాత ఇజ్రాయెల్ మిలటరీ జెట్లు దక్షిణ లెబనాన్‌పై రాకెట్ లాంఛర్లను ప్రయోగించాయి. కాగా, గురువారం లెబనాన్‌పై ఇజ్రాయెల్ జరిపిన వాయుసేన దాడిలో ముగ్గురు మరణించారు.

మరోసారి రష్యా డ్రోన్ల దాడి

మాస్కో: రష్యా మరోసారి భారీస్థాయిలో డ్రోన్లతో ఉక్రెయిన్‌పై విరుచుకుపడింది. శుక్రవారం అర్ధరాత్రి జరిగిన ఈ దాడికి ప్రతిగా ఉక్రెయిన్ కూడా దీటుగా బదులిచ్చింది. తన ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థతో దాదాపు 72-76 డ్రోన్లను కూల్చివేసింది. ఘటనపై ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ తీవ్రంగా స్పందించారు. తమ దేశ పౌరులను లక్ష్యంగా చేసుకొని రష్యా దాడులకు పాల్పడుతున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. గత మంగళవారం కూడా రష్యా దాదాపు 140 డ్రోన్లతో దాడి చేసింది.

తాజ్‌మహల్ ప్రధాన గుమ్మటం లీక్

భారీ వర్షానికి నీట మునిగిన తోట

ఆగ్రా, సెప్టెంబర్ 14: ప్రసిద్ధ పర్యాటక ప్రదేశమైన ఆగ్రాలోని తాజ్‌మహల్ ప్రధాన గుమ్మటం వద్ద నీరు లీకవుతున్నది. గత మూడు రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వానలకు ఇది సంభవించి ఉంటుందని అంచనా వేస్తున్నారు. వర్షాలకు తాజ్‌మహల్ ప్రాంగణంలోని తోట కూడా నీట మునిగింది. దీనికి సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమంలో వైరలైంది. దీనిపై పురావస్తు శాఖ(ఏఎస్ఐ) సూపరింటెండెంట్ చీఫ్ రాజ్‌కుమార్ పటేల్ మాట్లాడుతూ వర్షాల కారణంగా సీపేజ్ వ్యవస్థలో లోపం ఏర్పడి ప్రధాన డోమ్‌లో లీకేజీ సంభవించిందని చెప్పారు. డ్రోన్ కెమెరాతో ప్రధాన గుమ్మటాన్ని క్షుణ్ణంగా పరిశీలించామని, అయితే దానికి ఎలాంటి నష్టం జరగలేదని స్పష్టం చేశారు. సరైన నీటి పారుదల సౌకర్యం లేకే తోట మునిగిందని స్థానికులు తెలిపారు. కాగా, ఎడతెరపి లేని వర్షం కారణంగా ఆగ్రా నగరంలోని పలు ప్రాంతాల్లో నీరు నిలిచిపోయింది. ఆగ్రా హైవేపై సైతం వర్షం నీరు పెద్దయెత్తున నిలిచిపోవడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారిందని స్థానికులు తెలిపారు.



బారాముల్లా ఎన్‌కౌంటర్‌లో తుపాకుల తూటాలతో ధ్వంసమైన భవనం

ప్రధాని పర్యటన వేళ ఎన్‌కౌంటర్లు

జమ్ము కశ్మీర్‌లో ఐదుగురు తీవ్రవాదులు మృతి

శ్రీనగర్, సెప్టెంబర్ 14: ప్రధాని మోదీ పర్యటన వేళ జమ్ము కశ్మీర్‌లో వరుస ఎన్‌కౌంటర్లు చోటుచేసుకున్నాయి. బారాముల్లా, కిష్త్వర్ జిల్లాల్లో మూడు చోట్ల జరిగిన ఎదురు కాల్పుల్లో ఐదుగురు ఉగ్రవాదుల్ని భద్రతా బలగాలు మట్టుబెట్టాయి. ఇద్దరు జవాన్లు వీర మరణం పొందారు. నాలుగు రోజుల్లో ఇక్కడ అసెంబ్లీ ఎన్నికలు జరగబోతున్న తరుణంలో రాష్ట్రంలో వరుస ఎన్‌కౌంటర్లు తీవ్ర కలకలం రేపాయి. శుక్రవారం బారాముల్లాలో భద్రతా బలగాలు, రాష్ట్ర పోలీస్ సంయుక్త సెర్చ్ ఆపరేషన్ చేపట్టాయి. శనివారం ఉదయం పట్టాన్ ప్రాంతం చాక్ టాపెర్ ప్రాంతంలో ఎదురు కాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనలో ముగ్గురు ఉగ్రవాదుల్ని భద్రతా బలగాలు మట్టుబెట్టాయి. శుక్రవారం కథువాలో భారత సైన్యం జరిపిన కాల్పుల్లో ఇద్దరు ఉగ్రవాదులు చనిపోయారు. ఘటనా స్థలంలో పెద్ద మొత్తంలో ఆయుధాలు, మందుగుండును స్వాధీనం చేసుకున్నట్టు అధికారులు 'ఎక్స్'లో తెలిపారు. ఎన్నికల ప్రచార నిమిత్తం దోడా జిల్లాలో మెగా ర్యాలీలో ప్రధాని మోదీ పాల్గొనబోతున్నారు. భారత ప్రధాని దోడా జిల్లాలో పర్యటించటం 42 ఏండ్లలో ఇదే తొలిసారి.

చోరీ చేశాడని నగ్నంగా నృత్యం చేయించారు

రాజస్థాన్‌లో దళిత బాలుడిపై దాష్టీకం

జైపూర్, సెప్టెంబర్ 14: రాజస్థాన్‌లో కొంతమంది 12 ఏండ్ల ఓ దళిత బాలుడిపై విచక్షణారహితంగా దాడికి తెగబడ్డారు. దొంగతనం చేశాడన్న నెపం మోపుతూ..ఆ బాలుడి బట్టలు ఊడదీసి, నగ్నంగా నడిరోడ్డుపై నృత్యం చేయించారు. శుక్రవారం రాత్రి కోటా నగరంలో చోటుచేసుకున్న అమానవీయ ఘటనకు సంబంధించి వీడియో ఒకటి వెలుగులోకి వచ్చింది. జీపీడీ సర్కిల్ వద్ద జరిగిన ఓ హాస్య కార్యక్రమానికి తన కుమారుడు హాజరయ్యాడని, మ్యూజిక్ వైర్లు దొంగలించాడన్న నెపంతో రాత్రి 1 గంట సమయంలో తన కుమారుడిపై కొంతమంది దాడి చేశారని బాలుడి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనలో ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేశామని పోలీసులు తెలిపారు.



దళితుడి జాగాలో సిద్ధరామయ్య ఇల్లు

డిప్యూటీ సీఎంగా ఉన్నప్పుడు ఆక్రమించారు

ఆధారాలున్నాయన్న కుమారస్వామి

బెంగళూరు, సెప్టెంబర్ 14: కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యపై కేంద్ర మంత్రి, జేడీఎస్ నేత కుమారస్వామి సంచలన ఆరోపణలు చేశారు. దివ్యాంగుడైన దళితుడి స్థలాన్ని ఆక్రమించి సిద్ధరామయ్య ఇంటిని నిర్మించుకున్నారని ఆరోపించారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... సిద్ధరామయ్య డిప్యూటీ సీఎంగా ఉన్నప్పుడు దివ్యాంగుడైన దళితుడికి కేటాయించిన స్థలాన్ని ఆక్రమించి ఇల్లు నిర్మించారని పేర్కొన్నారు. సకమ్మ అనే పేరుతో నకిలీ పత్రాలు సృష్టించి, తాను ఆ స్థలాన్ని కొనుగోలు చేసినట్టు చూపించి సిద్ధరామయ్య ఇంటిని నిర్మించుకున్నారని ఆరోపించారు. దీనిపై తగిన ఆధారాలు కూడా ఉన్నాయని ఆయన చెప్పారు.

లంచం కోసం కాంట్రాక్టర్‌కు వేధింపులు!

- కులం పేరుతో దూషణ
- బీజేపీ ఎమ్మెల్యే అరెస్టు

బెంగళూరు, సెప్టెంబర్ 14: ఓ కాంట్రాక్టర్‌ను కులం పేరుతో దూషించి, చంపేస్తానని హెచ్చరించిన కర్ణాటక బీజేపీ ఎమ్మెల్యేను పోలీసులు అరెస్టు చేశారు. రాజరాజేశ్వరి నగర్ ఎమ్మెల్యే మునిరత్న తనను దూషించారని, బెదిరించారని కాంట్రాక్టర్ చెల్వరాజు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తనను ఎమ్మెల్యే లంచం కోసం వేధిస్తున్నాడని ఆయన ఆరోపించారు. ఈ మేరకు మీడియా ముందు ఒక ఆడియో రికార్డింగ్‌ను బయటపెట్టారు. దీంతో కులం పేరుతో దూషించినందుకు, బెదిరించినందుకు ఎమ్మెల్యేపై పోలీసులు కేసులు నమోదు చేశారు. శనివారం ఎమ్మెల్యేను పోలీసులు అరెస్టు చేశారు. కాగా, ఈ ఆరోపణలపై ఐదు రోజుల్లో వివరణ ఇవ్వాలని మునిరత్నకు కర్ణాటక బీజేపీ షోకాజ్ నోటీసులు జారీ చేసింది.

'సున్నిత అంశాల'పైనే జాప్యం

హైకోర్ట్ చీఫ్ జస్టిస్‌ల నియామకంపై కేంద్రం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 14: హైకోర్టులకు ప్రధాన న్యాయమూర్తుల నియామకాలకు సంబంధించి సుప్రీం కోర్టు కొలీజియం చేసిన సిఫారసులను అమలు చేయడంలో తాము 'సున్నితమైన అంశాల'లో జాప్యం చేస్తున్నామని కేంద్రం సుప్రీం కోర్టుకు తెలిపింది. ఈ విషయాన్ని అటార్నీ జనరల్ వెంకటరమణి చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్‌లు జేబీ పార్దీవాలా, మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనానికి విన్నవించారు. ఈ అంశాలు పబ్లిక్ డొమైన్‌లో బహిర్గత పరచడం సంస్థలకు, పాల్గొన్న న్యాయమూర్తులకు ప్రయోజనం కలిగించదని ఆయన అన్నారు. దీంతో ఈ కేసు తదుపరి విచారణను ఈ నెల 20వ తేదీకి వాయిదా వేస్తున్నట్టు ధర్మాసనం ప్రకటించింది.

అక్కగా చెప్తున్నా.. నిరసన వీడండి

సంక్షోభ పరిష్కారానికి మమత చివరి యత్నం

వీడియోగ్రాఫర్‌ను అనుమతించలేదని చర్చల నుంచి వెనుదిరిగిన జూనియర్ డాక్టర్లు



కోల్‌కతా: ఆర్‌జీ కర్ దవాఖాన ట్రైనీ వైద్యురాలిపై హత్యాచారం అనంతరం పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం, జూనియర్ వైద్యుల మధ్య ఏర్పడిన ప్రతిష్టంభన కొనసాగుతున్నది. దీనికి తెర దించేందుకు చివరి ప్రయత్నం చేస్తున్నానంటూ ముఖ్యమంత్రి మమత బెనర్జీ శనివారం జూనియర్ వైద్యుల ధర్నా స్థలం వద్దకు ఆకస్మికంగా వెళ్లారు. నిరసనలో పాల్గొన్నవారిని ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ, వర్షాలు పడుతూ ఉంటే, డాక్టర్లు రోడ్డు మీద ధర్నా చేస్తుండటం వల్ల తాను 34 రోజుల నుంచి నిద్రలేని రాత్రులు గడుపుతున్నానని చెప్పారు. తాను ఓ అక్కగా వచ్చానని, ముఖ్యమంత్రిగా కాదని, అందువల్ల నిరసన తెలుపుతున్నవారి మీద ఎలాంటి చర్యలు తీసుకోనని హామీ ఇచ్చారు. దీంతో సాయంత్రం మమత నివాసానికి జూనియర్ డాక్టర్లు వెళ్లారు. అయితే ఈ సమావేశాన్ని ప్రత్యక్ష ప్రసారం చేయాలని వారు పట్టుబట్టారు. 'ఇంట్లో 40 మందిని కూర్చోబెట్టగలమా? మొత్తం సమావేశాన్ని రికార్డ్ చేస్తున్నాం. దానిని మీకూ ఇస్తాం' అని చెప్పారు. అయితే తమ వీడియోగ్రాఫర్‌ను సమావేశానికి అనుమతించకపోవడం వల్ల చర్చలు జరగలేదని జూనియర్ డాక్టర్లు తెలిపారు.

డాక్టర్లపై దాడికి కుట్ర?

ధర్నా చేస్తున్న డాక్టర్లపై దాడికి కుట్ర జరిగిందని టీఎంసీ నేత కుణాల్ ఘోష్ ఆరోపించారు. శనివారం ఆయన విలేకరుల సమావేశంలో ఓ ఆడియో క్లిప్‌ను వినిపించారు. వైద్యులు సీఎంతో సమావేశమయ్యేందుకు వెళ్లినపుడు వారిపై దాడి చేయాలని ఆ ఆడియో క్లిప్‌లో ఉంది. ఆర్‌జీ కర్ మెడికల్ కాలేజీ మాజీ ప్రిన్సిపల్ సందీప్ ఘోష్, తొలుత కేసును విచారించిన ఎస్‌హెచ్‌వోను సీబీఐ శనివారం అరెస్టు చేసింది.

కోల్‌కతాలో బాంబు పేలుడు

శనివారం మధ్యాహ్నం సెంట్రల్ కోల్‌కతాలో ఎస్ఎన్ బెనర్జీ, బ్లోచ్‌మ్యాన్ కూడలిలో బాంబు పేలుడు సంభవించింది. ఈ ఘటనలో ప్లాస్టిక్ వస్తువుల్ని సేకరించే 58 ఏండ్ల వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు.

ఏచూరికి తుది వీడ్కోలు

వివిధ పార్టీ నేతల నివాళులు



ఏచూరి మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న శరద్ పవార్

న్యూఢిల్లీ: సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి వివిధ పార్టీల అగ్ర నేతలు శనివారం నివాళులర్పించారు. లాల్ సలామ్ నినాదాల మధ్య ఆయన పార్థివ దేహాన్ని ఆయన నివాసం నుంచి పార్టీ ప్రధాన కార్యాలయం ఏకేజీ భవన్‌కు తీసుకొచ్చారు. సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యులు ప్రకాశ్ కారత్, బృందా కారత్, పినరయి విజయన్, ఎంఏ బేబీ, కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ, ఎన్సీపీ (ఎస్పీ) చీఫ్ శరద్ పవార్, సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్, డీఎంకే నేతలు ఉదయనిధి స్టాలిన్, టీఆర్ బాలు; సీపీఐ ప్రధాన కార్యదర్శి రాజా తదితరులు ఆయనకు నివాళులు అర్పించారు. అనంతరం ఆయన పార్థివ దేహాన్ని ఎయిమ్స్‌కు అప్పగించారు.

మృతదేహాన్ని విరాళంగా ఇవ్వడం ఎలా?

అవయవాలను దానం చేయడానికి రెండు పద్ధతులు ఉన్నాయి. వ్యక్తి తాను జీవించి ఉన్న కాలంలో తన అవయవాలను విరాళంగా ఇవ్వాలని నిర్ణయించుకోవచ్చు. ఓ ఫారాన్ని నింపి, తాను సంతకం చేసి, ఇద్దరు సాక్షుల చేత సంతకాలు చేయించాలి. సాక్షుల్లో ఒకరు సమీప బంధువు అయి ఉండాలి. మరణానంతరం కుటుంబ సభ్యులు మరణించిన వ్యక్తి కోరిక మేరకు విరాళంగా ఇవ్వవలసి ఉంటుంది. వ్యక్తి జీవించి ఉన్న కాలంలో ఇటువంటి నిర్ణయం తీసుకోకపోతే, మరణానంతరం కుటుంబ సభ్యులు ఆయన అవయవాలను విరాళంగా ఇవ్వవచ్చు. మరణించిన తర్వాత నిర్దిష్ట సమయంలోగా అవయవాలను తొలగించి, దానం చేయాలి. మెదడు పని చేయడం ఆగిపోయిన సందర్భాల్లో మాత్రమే గుండె, కాలేయం, మూత్రపిండాలు, పేగులు, ఊపిరితిత్తులను దానం చేయవచ్చు. సహజంగా మరణించినపుడు కార్నియా, గుండె నాళాలు, చర్మం, ఎముకలను దానం చేయవచ్చు. గుండెను 4 గంటల్లోగా, కాలేయాన్ని 24 గంటల్లోగా, మూత్రపిండాలను 72 గంటల్లోగా, కార్నియాస్‌ను 14 రోజుల్లోగా, ఊపిరితిత్తులను 4-6 గంటల్లోగా మార్చవలసి ఉంటుంది.

దానంగా ఇచ్చే మృతదేహాలను ఏం చేస్తారు?

దవాఖానలకు దానంగా ఇచ్చే మృతదేహాలను ఎలా వినియోగిస్తారు? వాటిని తిరిగి కుటుంబ సభ్యులకు ఇస్తారా? అనే అంశాలపై చాలామందికి సందేహాలు ఉన్నాయి. వైద్యులు తెలిపిన వివరాల ప్రకారం, ఇలాంటి మృతదేహాన్ని ఫార్మాలిన్‌తో పరిరక్షిస్తారు. దీనివల్ల దానిపై బ్యాక్టీరియా లేదా క్రిములు పెరగవు. ఫలితంగా అది క్షీణించదు. కర్ర మాదిరిగా తయారవుతుంది. ఆ తర్వాత దానిని పరిశోధనల కోసం ఉపయోగిస్తారు. శరీరంలోని వివిధ భాగాల గురించి అధ్యయనం చేసే ప్రథమ సంవత్సరం వైద్య విద్యార్థులు ఇలాంటి మృత దేహాలను ఉపయోగించుకుంటారు. పదే పదే గాలి తగిలేలా ఉంచడం వల్ల కొన్ని రోజులకు ఇలాంటి మృతదేహాలు ఉపయోగించలేని పరిస్థితికి వస్తాయి. అప్పుడు వాటిని తిరిగి కుటుంబ సభ్యులకు ఇస్తారు. అంటే అప్పటికి మృతదేహం పూర్తిగా చెడిపోదు. శరీర నిర్మాణంలో మార్పులు వస్తాయి, ముఖాన్ని గుర్తు పట్టడం కష్టం కావచ్చు.

ఒప్పందం లాగా హిందూ పెండ్లిని రద్దు చేయలేం

అలహాబాద్ హైకోర్టు తీర్పు

ప్రయాగ్‌రాజ్, సెప్టెంబర్ 14: ఒక ఒప్పందం మాదిరిగా హిందూ వివాహాన్ని రద్దు చేయలేమని, హిందూ వివాహ బంధం నుంచి తొలగిపోవడం, రద్దు చేయడం కుదరదని అలహాబాద్ హైకోర్టు కీలక తీర్పు చెప్పింది. హిందూ వివాహ చట్టం ప్రకారం కొన్ని పరిమిత పరిస్థితులు, సందర్భాల్లో.. అది కూడా పార్టీల నేతృత్వంలోని బలమైన సాక్ష్యాల వల్ల మాత్రమే మత కర్మ ఆధారంగా జరిగిన హిందూ వివాహం రద్దు చేయవచ్చునని పేర్కొంది. ఒక మహిళ దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్‌లు సౌమిత్ర దయాల్ సింగ్, దొనాది రమేశ్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. అప్పీల్‌దారు ఒకసారి వివాహ రద్దుకు అనుమతి తెలిపి, తర్వాత దానిని రద్దు చేసుకున్నాక ముందుగా ఆమోదించిన సమ్మతికి అప్పీల్‌దారు కట్టుబడి ఉండాలని దిగువ కోర్టు బలవంతం చేయడం తగదని హైకోర్టు ధర్మాసనం తీర్పు చెప్పింది. 2011లో బులంద్‌షహర్ అడిషనల్ జిల్లా కోర్టు తమ వివాహం రద్దు చేయడాన్ని సవాల్ చేస్తూ ఒక మహిళ దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు విచారించింది.



ఢిల్లీలోని ప్రధాని నరేంద్ర మోదీ నివాసంలోకి ఒక కొత్త అతిథి అడుగుపెట్టింది. తన నివాస ప్రాంగణంలో గోమాత ఒక దూడకు జన్మనిచ్చిందని, దాని నుదిటిపై కాంతి గుర్తు ఉన్నందున దానికి 'దీప్‌జ్యోతి'గా నామకరణం చేసినట్టు ప్రధాని మోదీ ఎక్స్‌లో వెల్లడించారు.

వందేండ్ల కోసం నిర్మాణం.. ఐదేండ్లకే కూల్చివేతకు సిద్ధం


ఇది గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో నిర్మించిన హత్కేశ్వర్ ఫ్లైఓవర్. ఆ రాష్ట్ర బీజేపీ ప్రభుత్వం రూ.44 కోట్లు వెచ్చించి దీనిని నిర్మించింది. 2017లో అట్టహాసంగా ప్రారంభించింది. వందేండ్ల వరకు ఫ్లైఓవర్ చెక్కు చెదరదని గొప్పగా ప్రకటించింది. తీరా చూస్తే ఐదేండ్లకే 2022లో ఫ్లైఓవర్ బీటలు వారింది. రాకపోకలు సైతం నిలిచిపోయాయి. నాణ్యత లేని నిర్మాణంతో పిల్లర్లలో బలం తగ్గింది. మరమ్మత్తులు చేసినా ఫలితం లేదని, కూల్చడం తప్ప మరో మార్గం లేదని నిపుణులు తేల్చిచెప్పారు. దీంతో సర్కారు ఇప్పుడు ఫ్లైఓవర్‌ను కూల్చి, మళ్లీ కట్టాలని నిర్ణయించింది. ఇందుకు రూ.52 కోట్లు వృథా చేయనుంది.





సౌండ్ ప్రూఫ్ రహదారి.. రెండేండ్లకే బీటలు బారి

ఎక్కడికక్కడ పగుళ్లు ఏర్పడిన ఈ ఎలివేటెడ్ రోడ్డు మధ్యప్రదేశ్‌లోని సియోని జిల్లాలో ఉంది. 44వ జాతీయ రహదారిపై రూ.960 కోట్లతో కేంద్రం నిర్మించింది. ఇక్కడి పెంచ్ టైగర్ రిజర్వ్‌లో కింది నుంచి వన్యప్రాణులు వెళ్లేలా నిర్మాణం చేపట్టింది. వన్యప్రాణులకు ఇబ్బంది కలగకుండా సౌండ్ బ్యారియర్లు, హెడ్‌లైట్ రెడ్యూసర్లు ఏర్పాటు చేసింది. రెండేండ్ల క్రితం కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ఈ రోడ్డును ప్రారంభించారు. దీనిని ఆసియాలోనే అతిపెద్ద సౌండ్, లైట్ ప్రూఫ్ రోడ్డుగా కేంద్రంగా ఘనంగా ప్రకటించింది. అయితే, నాణ్యతా లోపం కారణంగా రెండేండ్లకే రహదారిపై ఓ వంతెన బీటలు వారింది.



భయంకర బాహుబలి గుండె పోటుతో మృతి

న్యూఢిల్లీ: ప్రపంచంలోని అత్యంత భారీ బాడీ బిల్డర్‌గా గుర్తింపు పొందిన ఇల్లియా 'గోలెమ్' యెఫించిక్ (36) గుండెపోటుతో మరణించారు. ఆయనను 'ది మ్యుటెంట్' అని ముద్దుగా పిలుస్తారు. 6 అడుగుల ఎత్తు, 340 పౌండ్ల బరువు గల ఆయన ప్రపంచంలో అత్యంత భయంకరమైన బాడీ బిల్డర్(బాహుబలుడి)గా పేరు సంపాదించినప్పటికీ ఎన్నడూ ఏ పోటీల్లోనూ పాల్గొనలేదు. ఆయన సతీమణి అన్నా మాట్లాడుతూ.. ఈ నెల 6న ఆయన గుండె చాలా వేగంగా కొట్టుకుందని, అంబులెన్స్ వచ్చే లోపల ఆయన ఛాతీపై ఒత్తి, ప్రాణాలను కాపాడే ప్రయత్నం చేసినప్పటికీ మరణించారని చెప్పారు. యెఫించిక్ కండలు 25 అంగుళాల చుట్టుకొలత కలిగి ఉండేవి. ఆయన రోజుకు 16,500 క్యాలరీల ఆహారాన్ని తీసుకునేవారు.

నమస్తే తెలంగాణ
జిందగీ
హైదరాబాద్
ఆదివారం 15 సెప్టెంబర్ 2024 11
www.ntnews.com

నేనేంటో.. 'గూగుల్' చేయండి







సోషల్ మీడియా.. ఎప్పుడు ఎవర్ని స్టార్‌ను చేస్తుందో ఊహించలేం! అప్పుడెప్పుడో 'కచ్చా బాదాం!' అంటూ పాడిన భుబన్ బద్యాకర్, ఒక్కరోజులోనే బాలీవుడ్ సింగర్‌గా మారిన రానూ మండల్.. ఓవర్‌నైట్‌లో ఫేమస్ అయినవారే! ఇప్పుడు తరుణ్ రాయన్ వంతు. 'నా గురించి తెలుసుకోవాలంటే.. నా పేరును గూగుల్‌లో వెతకండి!' అంటున్న ఈ తోపుడుబండి కుర్రాడు.. సోషల్‌మీడియాలో తాజా సెన్సేషన్!

చెన్నైకి చెందిన రాయన్.. ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో బయోటెక్నాలజీలో పీహెచ్‌డీ చేస్తున్నాడు. కుటుంబానికి ఆర్థికంగా అండగా ఉండేందుకు తోపుడు బండిపై చపలూరించే పాకాలు చేసి విక్రయిస్తున్నాడు. ఈ క్రమంలోనే అమెరికాకు చెందిన వ్లాగర్ క్రిస్టఫర్ లూయిస్.. తన వీడియోల్లో తమిళనాడును ఎక్స్‌ప్లోర్ చేస్తూ.. తరుణ్ రాయన్ బండి దగ్గరికి వచ్చాడు. చికెన్ 65 ఆర్డర్ ఇచ్చి.. ఎంతో ఉత్సాహంగా పనిచేస్తున్న రాయన్‌ను పలకరించాడు. తన గురించి చెప్పమంటూ అడిగాడు. అప్పుడు రాయన్ చెప్పిన సమాధానం విని.. క్రిస్టఫర్ మాత్రమే కాదు సోషల్ మీడియానే నోరెళ్లబెట్టింది. 'నా పేరును గూగుల్‌లో వెతకండి. నా పీహెచ్‌డీ పరిశోధనా వ్యాసాలు మీకు కనిస్తాయి!' అని చెబుతున్న రాయన్ వీడియో.. సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నది. ఇప్పటికే లక్షలాదిగా వ్యూస్‌ను సాధించింది. ఈ వీడియోలో రాయన్‌ను చూసినవారంతా.. అతణ్ని తెగ పొగిడేస్తున్నారు. ఓవైపు ఉన్నత విద్యాభ్యాసం చేస్తూనే.. కుటుంబం కోసం వీధి వ్యాపారిగా రాణిస్తున్నాడని, అతని కష్టపడేతత్వానికి ముగ్ధులవుతున్నారు.

బాలీవుడ్‌లో బాడీ షేమింగ్!



ఇండస్ట్రీలోకి వచ్చిన కొత్తలో కొందరు తనను 'బాడీ షేమింగ్' చేసినట్లు చెప్పుకొచ్చింది బాలీవుడ్ బ్యూటీ ఈశా డియోల్. బీటౌన్ స్టార్ కపుల్ ధర్మేంద్ర – హేమమాలిని కూతురిగా చిత్రసీమలో అరంగేట్రం చేసింది ఈశా. తన మొదటి సినిమా సందర్భంగానే.. తాను బాడీ షేమింగ్‌కు గురయ్యానని చెప్పింది. మొదట్లో తాను కొంచెం బొద్దుగా ఉండేదాన్ననీ.. దాంతో తన బరువు, ఫ్యాట్ గురించి కొందరు హేళన చేసేవారని చెప్పుకొచ్చింది. తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఈశా మాట్లాడుతూ.. ''నేను ఇండస్ట్రీలోకి వచ్చినప్పుడు నా వయసు 18 సంవత్సరాలు. కానీ, అందరూ నన్ను అప్పటికే 200కు పైగా సినిమాలు చేసిన మా అమ్మతో పోల్చి చూసేవారు. చూసేందుకు నేను మా అమ్మ లాగే ఉండేదాన్నని అనేవారు'' అంటూ నాటి సంగతులను గుర్తుచేసుకున్నది. అయితే, తాను మాత్రం ఆ సినిమాలో చాలా క్యూట్‌గా కనిపించాననీ, ఆ పాత్రకు తగిన న్యాయం చేశాననీ వెల్లడించింది.

అతని సలహాకు జోహార్

అతిలోకసుందరి శ్రీదేవి నట వారసురాలు జాన్వీకపూర్ టాలీవుడ్ ఎంట్రీకి.. కరణ్ జోహార్ ఇచ్చిన సలహానే కారణమని బీటౌన్ కోడై కూస్తున్నది. ఆర్ఆర్ఆర్ తర్వాత తారక్ పాన్‌ఇండియా హీరో అయ్యారనీ, పైగా ఎంతో టాలెంట్ ఉన్న నటుడు కాబట్టి.. ఎన్టీఆర్ పక్కన నటిస్తే అడ్వాంటేజ్ ఉంటుందని 'దేవర'కు ఓకే చెప్పించాడట కరణ్ జోహార్. 2018లో వచ్చిన 'ధడక్' చిత్రంతో బాలీవుడ్ ఎంట్రీ ఇచ్చింది జాన్వి. అందంలో అదరహో అనిపించినా.. నటిగా విమర్శకుల ప్రశంసలు పొందినా.. ఒక్క కమర్షియల్ హిట్‌ను కూడా అందుకోలేక పోయింది. దాంతో ఒకప్పుడు తనతల్లి శ్రీదేవి మకుటంలేని మహారాణిగా వెలుగొందిన దక్షిణాదివైపు దృష్టిపెట్టింది. అయితే, టాలీవుడ్ – కోలీవుడ్ ఈ రెండిటిలో ఏ పరిశ్రమను ఎంచుకోవాలో నిర్ణయించుకోలేక పోయిందట. ఇదే విషయంపై తన మెంటార్ కరణ్ జోహార్‌ను సలహా అడిగితే.. టాలీవుడ్ ద్వారా దక్షిణాదిలోకి ఎంట్రీ ఇస్తే కచ్చితంగా స్టార్ హీరోయిన్‌గా పేరు దక్కించుకునే అవకాశాలు ఉన్నాయని చెప్పాడట. ఆయన చెప్పినట్టుగానే.. తెలుగులో మొదటి సినిమా విడుదల అవ్వకుండానే, మరో స్టార్ హీరో రామ్‌చరణ్‌తో కలిసి నటించే చాన్స్ కొట్టేసి.. టాలీవుడ్‌ను ఏలేసేందుకు రంగం సిద్ధం చేసుకున్నది.





తెలుగు హీరో అంటే...
ఒంటి చేత్తో డజన్ల మంది విలన్లను
కొట్టేస్తాడు. బైకులు.. సుమోలు..
లారీలు.. ఆ మాటకొస్తే రైళ్లనూ చూపుడు
వేలుతో నియంత్రిస్తాడు. కత్తులతోనే కాదు..
కంటిచూపుతో కూడా విలన్లను రఫ్ఫాడిస్తాడు.
ఒక్కమాటలో చెప్పాలంటే.. తెలుగు హీరోకు
అతీంద్రియ శక్తులు ఉన్నాయనిపిస్తుంది. కథ.. కథలోని
హీరోయిన్.. ఇతర పాత్రలు.. సన్నివేశాలు.. అన్నీ హీరో
చుట్టూ తిరగాల్సిందే! గతకాలమంతా ఇంతే! రోజులు మారాయి..
మన హీరో మారుతున్నాడు.. కథలో తనో పాత్రగానే కాదు..
కథ వెంటే తన పాత్రని తిప్పుతూ.. నేచురల్‌గా నటిస్తున్నాడు..
ఒక్క ఫైట్ కూడా చేయకుండానే తనెంత బలవంతుడో చెబుతున్నాడు..
అతిగా డైలాగ్స్ చెప్పకుండా.. మనలాగే మాట్లాడుతున్నాడు..

మన హీరో మారుతున్నాడు



బడ్జెట్‌లు.. భారీ సెట్‌లు.. ఎందుకులే.. మంచి కథ చాలని సింపుల్‌గా సిల్వర్ స్క్రీన్ పై కనిపిస్తున్నారు మన హీరోలు. ఇమేజ్‌ని పక్కన పెట్టేసి ప్రపంచ సినిమాలో మనం ఎక్కడున్నాం? ఏం చేస్తున్నాం? అని ఆలోచిస్తున్నారు. హీరోయిజాన్ని సంస్కరించుకుంటున్నారు. పాత్రలో ఎక్కువ, తక్కువలు చూడకుండా.. ప్రపంచ సినిమాని నెగ్గే ప్రయత్నం చేస్తున్నారు మన కథానాయకులు.

సిక్స్ ప్యాక్‌లు.. స్టయిలిష్ లుక్‌లపైనే కాకుండా.. కథల ఎంపికపైనా మన హీరోలు బాగానే కసరత్తులు చేస్తున్నారు. కథను మింగేయాలనే ధ్యాస మానుకుని.. కథకు మేమెంత మేరకు న్యాయం చేయగలమా? అని ఆలోచిస్తున్నారు. ఈ తరం హీరోలే కదా ఇలా ఆలోచించేది... అగ్ర కథానాయకుల ఫార్మాట్ ఎప్పుడు మారింది గనుకా!? అనుకోవద్దు. మన బాలయ్య చేసిన నేలకొండ భగవంత్ కేసరి కథని గమనిస్తే మీకే అర్థం అవుతుంది. కథా వస్తువుకు విలువనిచ్చేలా తన పాత్రలో ఒదిగిపోయాడు. నేటి తరం ఆడపిల్లల్ని హీరోలు చేస్తూ తనో మామూలు మధ్యతరగతి వ్యక్తిగా కథలో ఇమిడిపోయాడు. విజ్జూ పాపకి రక్షణగా నిలుస్తూ.. 'గుడ్ టచ్... బ్యాడ్ టచ్' ఏంటో చెబుతూ ప్రేక్షకుల హృదయాలను తాకాడు. అంతేనా.. అంతకుముందు మెగాస్టార్ చిరంజీవి సైతం 'సైరా..'లో కథనే హీరోను చేశాడు. మన వెంకీ ఓటెప్పుడూ కథలకే. ఎప్పుడో మల్లీశ్వరీతో మొదలుపెట్టి.. ఎఫ్2 దాకా.. ఇమేజ్ చట్రాన్ని పూర్తిగా బ్రేక్ చేసి అబ్బురపరుస్తున్నాడు.



తరంలో మార్పు..


వారసత్వంగా నటన వైపు అడుగులేసిన కథానాయకులు తెలుగు సినిమా స్టామినాని పాన్ ఇండియాకే కాదు.. ప్రపంచానికే పరిచయం చేస్తున్నారు. కారణం.. ఇమేజ్ చట్రంలో ఇరుక్కోకుండా.. ఇంకేదో చేయాలని తపిస్తుండటమే. మగధీరుడిగా దూసుకెళ్తున్న రామ్‌చరణ్ ఒకవైపు.. అరవింద సమేత వీరరాఘవుడిగా బాక్సాఫీస్‌పై విరుచుకుపడిన జూనియర్ ఎన్టీఆర్ మరోవైపు.. స్టైలిష్ స్టార్ అల్లు అర్జున్ ఇంకో వైపు.. భిన్నమైన కథలకు మొగ్గు చూపుతూ తమలో నటనకు సాన పెడుతున్నారు. 'రంగస్థలం'లో సిట్టిబాబే కనిపిస్తాడు గానీ.. రామ్‌చరణ్ కనిపించడు. పాత్ర కోసం హ్యాండ్‌సమ్ చెర్రీ.. వినికిడి లోపం ఉన్న వ్యక్తిలా మారిపోయాడు. కథ కోసం తనని తాను ఎంతో తగ్గించుకుని.. పాత్ర రూపంలో ఎంతో ఎత్తుకు ఎదిగాడు. 'పుష్ప'తో అల్లు అర్జున్ పాన్ ఇండియా మొత్తానికి తగ్గేదేలేదని బలంగా మన టాలీవుడ్ పేరు వినిపించేలా చేశాడు. యాస.. బాష.. బాడీలాంగ్వేజ్‌తో పుష్ప అంటే.. 'ఫ్లవర్ కాదు.. ఫైరూ' అంటూ భుజం ఎగరేశాడు. ఇదంతా గమనించాడో ఏమో.. మన జక్కన్న ఏకంగా.. రెండు కత్తుల్ని ఒకే ఒరలో పెట్టేసి.. 'ఆర్ఆర్ఆర్'తో ప్రభంజనం సృష్టించాడు. ప్రపంచ సినిమా వేదికలపై మా హీరోలు మారడమే కాదు.. కలిసికట్టుగా కథల్ని భుజాన వేసుకుని ఎంత రిస్క్ చేయడానికైనా వెనకాడరని నిరూపించాడు. ఇంతకంటే ఏం కావాలి.. మన హీరో మారుతున్నాడని చెప్పడానికి!!

నేచురల్ స్టార్ అనిపించుకున్నాడు..

అసిస్టెంట్ డైరెక్టర్‌గా తన జర్నీ మొదలెట్టి.. హిట్టు మీద హిట్టుతో దూసుకెళ్తున్న నాని నేచురల్ స్టార్‌గా స్థిరపడ్డాడు. ఎప్పుడో పుష్కరకాలం కిందట వచ్చిన 'భీమిలీ కబడ్డి జట్టు'లో ఒకడిగా కనిపించి.. ఏడిపించిన సూరిబాబు ఇంకా మనకి గుర్తుకొస్తాడు. కథలో ఈగ హీరో అయినా నాకేం ఫరక్ లేదని ఎప్పుడో ప్రూవ్ చేశాడు. 'ఎవడే సుబ్రహ్మణ్యం'లో తన పాత్రకి న్యాయం చేస్తూనే... మరో పాత్ర తాలూకు భావజాలాన్ని చివరి వరకూ మోసుకెళ్లి 'రిషి' గొప్పతనాన్ని చాటిచెప్పాడు. భిన్నమైన కథల్ని చేస్తూ 'హాయ్.. నాన్నా' సినిమాలో ఓ తండ్రిని హీరోని చేశాడు. అమ్మ కథని కూతురికి చెబుతూ.. అమ్మని హీరోని చేశాడు. బిడ్డని తల్లికి పరిచయం చేసి.. కూతుర్ని హీరోని చేశాడు. ఆ ఫీల్‌గుడ్ మూవీ వైబ్స్ అలాగే ఉన్నాయి. అంతలోనే 'సరిపోదా శనివారం' అంటూ థియేటర్లలో సందడి చేశాడు. ప్రతినాయకుడు సూర్యనే సినిమాలో హీరో అని బాహాటంగా ప్రకటించాడు. హీరో విలన్‌ని పొగడటం అంటే.. మన కథానాయకుడు మారుతున్నట్టేగా!

చిన్న సినిమాల్లోనూ..

ఒకప్పుడు చిన్న సినిమా అయినా.. పెద్ద సినిమా అయినా.. హీరో ఎంట్రీ సీన్ వచ్చిందంటే.. పూనకాలు వచ్చేవి. కాళ్ల నుంచి కెమెరా స్లో మోషన్‌లో హీరో ముఖం దగ్గరికి రావడానికి చాలా టైమ్ పట్టేది. కానీ, ఇప్పుడొస్తున్న బడ్జెట్ సినిమాల్ని చూస్తే కథే హీరో అంటే... నమ్మి తీరాల్సిందే! నమ్మకపోతే 'బలగం' సినిమా సిల్వర్ స్క్రీన్ పైకి వచ్చేదే కాదు. దిల్ రాజు ఆ సినిమా నిర్మించే వాడే కాదు. హీరో రానా పబ్లిసిటీ చేసేవాడే కాదు. ఫిల్మ్‌ఫేర్‌లో ఉత్తమ చిత్రంగా నిలిచేది కాదు. బలగం సినిమాలో ప్రియదర్శిని హీరోగా చూపించలేదు దర్శకుడు వేణు. తెలంగాణ సంస్కృతినే కథానాయకుణ్ని చేశాడు. అందుకే, ఆ సినిమాకు కథే హీరో అయింది.



ఇంకా చెప్పాలంటే.. ఈ మధ్య పలు సినిమాల్లో హీరోగా కనిపిస్తున్న సుహాస్ కూడా కథనే నమ్ముకుంటున్నాడు. ఒడ్డూ.. పొడుగూ.. రంగు.. రూపం.. అంటూ గీసిన గీతల్ని చెరిపేసి మంచి కథలు ఎంచుకుంటూ మాయ చేస్తున్నాడు. 'పద్మవిభూషణ్'లో అమ్మ చాటు రచయితగా ప్రేక్షకుల్ని మెప్పించాడు. 'అంబాజీపేట మ్యారేజ్ బ్యాండు'లో ఒకడిగా.. సామాజిక అంశాల్ని బలంగా చెప్పే ప్రయత్నం చేశాడు. ఇక 'బేబీ' సినిమాలో హీరోయిన్ వైష్ణవే అసలు హీరో. అయినా, ఆనంద్ దేవరకొండ, విరాజ్ తమ పాత్రలకు అంతే హుందాగా న్యాయం చేశారు. ఈ కాలం కుర్ర హీరోలు.. తమ ఈక్వేషన్స్ అండ్ కాలిక్యులేషన్స్ వేరని చెప్పకనే చెబుతున్నారు.


ఆ 'సీత'కి రాముడు కాలేకపోయారు!!

మనోళ్లు ఎంత మారారని చెప్పుకొన్నా.. కావ్యాల్లాంటి కథలు కొన్ని మనోళ్లని దాటుకుని పక్క ఇండస్ట్రీ హీరోల దగ్గరికి వెళ్తున్నాయి. అందులో 'సీతారామం' ఒకటి. హను రాఘవపూడి చిత్రీకరించిన ఆ కథలో రాముడి పాత్ర గురించి ఎంత చెప్పినా తక్కువే! యుద్ధంతో రాసిన ప్రేమకథలో నటించాలంటే.. హీరో మంచి సైనికుడై ఉండాలి. కానీ, మన తెలుగు హీరోలు రాజులా ఆలోచించి ఉంటారేమో. అందుకే ఈ కథని వదులుకుని ఉంటారు. అలాగే, ఎప్పుడో విడుదలైన 'గజినీ' సినిమా గుర్తుండే ఉంటుంది. ఈ కథను మురగదాస్ ఇంచుమించు 12 మందికి చెప్పాడట. అందులో మన తెలుగు హీరోలు కూడా ఉన్నారట. చివరికి సూర్య ఓకే చేశాడట. గతేడాది విడుదలై మంచి టాక్ సొంతం చేసుకున్న ధనుష్ 'సార్' సినిమాను మన తెలుగు దర్శకుడు వెంకీ అట్లూరి డైరెక్ట్ చేశాడు. ఈ కథ మన తెలుగు హీరోలను దాటుకుని ధనుష్ చేతిలో పడింది. ధనుష్ 'సా....ర్' ఏం పెర్ఫార్మెన్స్ అని తెలుగోళ్లతో అనిపించుకున్నాడు. సో.. ఎప్పుడూ మంచి కథే హీరో అని నమ్ముతున్న రోజుల్లో... మన హీరోలు మరింత సెన్సిబుల్‌గా కథల్ని ఎంచుకొని సక్సెస్‌లు కొట్టాలని కోరుకుందాం.

... రాజేశ్ యడ్ల

'స్టార్ కిడ్స్'కే ఫస్ట్ చాన్స్!

చిత్రసీమలో బంధుప్రీతి వల్ల తానూ ఇబ్బందిపడ్డాననీ, 'నెపోటిజం'తో మంచి అవకాశాలను కోల్పోయాననీ బాంబ్ పేల్చింది రకుల్‌ప్రీత్ సింగ్. ఒకప్పుడు టాలీవుడ్ టాప్ హీరోయిన్‌గా ఓ వెలుగు వెలిగింది ఈ పంజాబీ సోయగం. కెరీర్ మొదట్లో హిట్లు పలకరించినా.. ఆ తర్వాత వరుస ఫ్లాపులతో డీలా పడిపోయింది. దాంతో కోలీవుడ్.. అట్నుంచి బాలీవుడ్ బాటపట్టింది. అయితే.. అక్కడా ఆమెకు సరైన హిట్ దక్కలేదు. తాజాగా, నెపోటిజంపై ఆమె చేసిన కామెంట్స్.. పరిశ్రమలో హాట్ టాపిక్‌గా మారాయి. ఓ ఇంటర్వ్యూలో రకుల్ మాట్లాడుతూ.. ''ఇన్నేళ్ల నా సినిమా కెరీర్‌లో నెపోటిజం కారణంగా ఎన్నో అవకాశాలను వదులుకున్నాను. అయినా ఆ విషయంలో ఏమాత్రం బాధపడలేదు. కొన్ని విషయాల గురించి నేను ఎక్కువగా ఆలోచించను. సినిమా చాన్స్‌లు మిస్సవడం అనేది.. లైఫ్‌లో ఒకపార్ట్ మాత్రమే! దాని గురించే ఆలోచిస్తూ.. నా టైం వేస్ట్ చేసుకోను. 'నేను ఎలా ఎదగాలి!?' అనే దాని గురించి మాత్రమే ఆలోచిస్తాను'' అని చెప్పుకొచ్చింది. చివరిగా.. ఇండస్ట్రీలో స్టార్ కిడ్స్‌కు వచ్చినన్ని అవకాశాలు మిగతావారికి రావడం చాలా కష్టమని ఆవేదన వ్యక్తం చేసింది రకుల్.



హర్మన్ డబుల్

- పాకిస్థాన్‌పై భారత ఘన విజయం
- ఏషియన్ చాంపియన్స్ ట్రోఫీ హాకీ



హులున్‌బుయిర్(చైనా): ఏషియన్ చాంపియన్స్ ట్రోఫీలో భారత హాకీ జట్టు వరుస విజయాలతో దూసుకెళుతున్నది. డిఫెండింగ్ చాంపియన్ హోదాలో ఇప్పటికే సెమీఫైనల్ బెర్తు ఖాయం చేసుకున్న టీమ్‌ఇండియా..తమ ఆఖరి లీగ్ మ్యాచ్‌లోనూ అదరగొట్టింది. శనివారం జరిగిన మ్యాచ్‌లో భారత్ 2-1తో దాయాది పాకిస్థాన్‌పై విజయదుందుభి మోగించింది. తద్వారా టోర్నీలో వరుసగా ఐదో విజయాన్ని ఖాతాలో వేసుకుంది. మరోవైపు టోర్నీలో ఇప్పటి వరకు అపజయమెరుగని పాక్..భారత్ చేతిలో తొలి ఓటమి ఎదుర్కొంది. భారత్ తరఫున కెప్టెన్ హర్మన్‌ప్రీత్‌సింగ్(13ని, 19ని) డబుల్ గోల్స్‌తో అదరగొట్టగా, అహ్మద్ నదీమ్(8ని) పాక్‌కు ఏకైక గోల్ అందించాడు. 2016 నుంచి పాక్‌పై తమ అప్రతిహత విజయాలతో ఆకట్టుకుంటున్న టీమ్‌ఇండియా అదే పరంపరను కొనసాగించింది. గతేడాది హంగ్జౌ వేదికగా జరిగిన ఆసియా గేమ్స్‌లో 10-2తో భారీ విజయం సాధించిన భారత్..చెన్నైలో ఏసీటీ టోర్నీలోనూ 4-0తో చిత్తు చేసింది.

ఆది నుంచే జోరు:

చిరకాల ప్రత్యర్థుల మధ్య పోరు ఆరంభం నుంచే ఆకట్టుకుంది. మ్యాచ్ మొదలైన తొలి నిమిషం నుంచే ఇరు జట్ల ప్లేయర్లు గోల్ లక్ష్యంగా ముందుకు కదిలారు. బంతిని తమ ఆధీనంలో ఉంచుకునేందుకు అన్ని రకాలుగా ప్రయత్నించారు. అయితే మ్యాచ్ 8వ నిమిషంలో మిడ్‌ఫీల్డర్ హన్నన్ షాహిది అందించిన పాస్‌ను నదీమ్ ఫీల్డ్ గోల్‌గా మలువడంతో పాక్ 1-0 ఆధిక్యంలోకి వెళ్లింది. వెంటనే తేరుకున్న భారత ఎదురుదాడికి దిగింది. పాక్ గోల్‌పోస్ట్‌ను లక్ష్యంగా చేసుకుంటూ మన దళాలు చురుకుగా ముందుకు కదిలాయి. ఆరు నిమిషాల తేడాతో దక్కిన రెండు పెనాల్టీ కార్నర్లను స్టార్ డ్రాగ్‌ఫ్లికర్ హర్మన్‌ప్రీత్‌సింగ్ గోల్స్ చేయడంతో భారత్ ఆధిక్యం 2-1కి పెరిగింది. హర్మన్ కొట్టిన పవర్‌ఫుల్ షాట్లను అడ్డుకోవడంలో పాక్ గోల్‌కీపర్ మునీబ్ విఫలమయ్యాడు. అయితే స్కోరును సమం చేసేందుకు పాక్ ప్లేయర్లు ఎంతగా ప్రయత్నం చేసినా లాభం లేకపోయింది. రెండో క్వార్టర్ ముగుస్తుందనగా దక్కిన పెనాల్టీ కార్నర్‌ను పాక్ సద్వినియోగం చేసుకోలేకపోయింది. కీలకమైన చివరి క్వార్టర్‌లో భారత్‌కు మూడు పెనాల్టీ కార్నర్లు దక్కినా..గోల్స్‌గా మలువలేకపోయింది. ఇదిలా ఉంటే హర్మన్‌ప్రీత్‌కు పాక్ ప్లేయర్ అష్రాఫ్ వహీద్‌కు మధ్య మాటల తూటాలు పేలాయి. జుగ్‌రాజ్‌సింగ్‌ను వహీద్ దురుసగా అడ్డుకోవడంతో 10 నిమిషాల పాటు సస్పెన్షన్‌కు గురయ్యాడు.

3

అంతర్జాతీయ హాకీ మ్యాచ్‌ల్లో భారత్ తరఫున అత్యధిక గోల్స్ చేసిన మూడో ప్లేయర్‌గా హర్మన్‌ప్రీత్‌సింగ్(203) నిలిచాడు. ధ్యాన్‌చంద్(570), బల్బీర్ సింగ్ (246) ముందువరుసలో ఉన్నారు.





లివింగ్‌స్టోన్ విజృంభణ

ఆసీస్‌పై ఇంగ్లండ్ విజయం

కార్డిఫ్: ఆస్ట్రేలియాతో రెండో టీ20లో ఇంగ్లండ్ హార్డ్‌హిట్టర్ లియామ్ లివింగ్‌స్టోన్ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. ఆఖరి వరకు ఆసక్తికరంగా జరిగిన మ్యాచ్‌లో ఇంగ్లండ్ 3 వికెట్ల తేడాతో ఆసీస్‌పై విజయం సాధించింది. కంగారూలు నిర్దేశించిన 194 పరుగుల లక్ష్యఛేదనలో ఇంగ్లండ్ మరో ఓవర్ మిగిలుండగానే 7 వికెట్లు కోల్పోయి విజయాన్నందుకుంది. 79 పరుగులకే విల్‌జాక్స్(12), జోర్డాన్ (0), కెప్టెన్ ఫిల్‌సాల్ట్(39) వికెట్లు చేజార్చుకున్న ఇంగ్లండ్‌ను లివింగ్‌స్టోన్(87) ఆదుకున్నాడు. ఆసీస్ బౌలింగ్ దాడిని సమర్థంగా తిప్పికొడుతూ నాలుగో వికెట్‌కు జాకబ్ బెతెల్(44)తో కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. వీరిద్దరు కలిసి 90 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. షార్ట్ (5/22) ఐదు వికెట్లతో రాణించాడు. అంతకుముందు ఆసీస్.. జేక్ ఫ్రెజర్(50), ఇంగ్లిస్ (42) ఆకట్టుకోవడంతో 20 ఓవర్లలో 193/6 స్కోరు చేసింది. బ్రైడన్ కార్స్(2/26), లివింగ్‌స్టోన్(2/16) రెండేసి వికెట్లు తీశారు. అర్ధసెంచరీతో జట్టును గెలిపించిన లివింగ్‌స్టోన్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది. ఇరు జట్ల మధ్య మూడో టీ20 ఆదివారం జరుగుతుంది.

జాతీయ హాకీ జట్టులోకి జ్యోతి

ప్రాబబుల్స్‌కు ఎంపికైన రాష్ట్ర యువ ప్లేయర్



బెంగళూరు: జాతీయ క్యాంప్ కోసం ఎంపిక చేసిన భారత హాకీ జట్టు ప్రాబబుల్స్‌లో తెలంగాణ యువ ప్లేయర్ ఈదుల జ్యోతిరెడ్డి చోటు దక్కించుకుంది. స్వదేశం వేదికగా వచ్చే నెల 11 నుంచి మహిళల ఆసియా చాంపియన్స్ ట్రోఫీ సన్నాహకాల్లో భాగంగా 33 మందితో కూడిన జట్టును హాకీ ఇండియా(హెచ్‌ఐ) శనివారం ప్రకటించింది. బెంగళూరులోని జాతీయ క్రీడా ప్రాధికార సంస్థ (సాయ్) ఆదివారం నుంచి అక్టోబర్ 9 వరకు క్యాంప్ నిర్వహిస్తున్నారు. ఇందులో మెరుగైన ప్రదర్శన కనబరిచిన వారితో తుది జట్టును ఎంపిక చేయనున్నారు. ఇదిలా ఉంటే జాతీయ హాకీ జట్టుకు ఎంపికైన జ్యోతిరెడ్డిని శనివారం సాట్స్ చైర్మన్ శివసేనారెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. సాట్స్ నుంచి పూర్తి సహాయ, సహకారాలు ఉంటాయని పేర్కొన్నారు.

సాబ్లెకు నిరాశ

3000మీ స్టిపుల్‌చేజ్‌లో 9వ స్థానం



బ్రస్సెల్స్: ప్రతిష్ఠాత్మక డైమండ్ లీగ్‌లో భారత అథ్లెట్ అవినాశ్ సాబ్లెకు నిరాశే ఎదురైంది. శుక్రవారం అర్ధరాత్రి(భారత కాలమానం ప్రకారం) జరిగిన పురుషుల 3000 మీటర్ల స్టిపుల్‌చేజ్‌లో సాబ్లె తొమ్మిదో స్థానంలో నిలిచాడు. శుక్రవారం 30వ పడిలోకి ప్రవేశించిన సాబ్లె తన రేసును 8:17: 09 సెకన్ల టైమింగ్‌తో పేలవ ప్రదర్శన కనబరిచాడు. మొత్తం 10 మంది రేసర్లు పోటీపడ్డ రేసులో కెన్యాకు చెందిన అమోస్ సెరెమ్ (8:06:90సె), సోఫైన్ ఎల్ బకాలీ (8:08:60సె), అమిన్ జినాహ్ (8:09:68సె) వరుసగా స్వర్ణ, రజత, కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు. ఇటీవల ముగిసిన పారిస్ ఒలింపిక్స్‌లోనూ సాబ్లె స్థాయికి తగ్గ ప్రదర్శన కనబర్చడంలో విఫలమై 11వ స్థానంలో నిలిచిన సంగతి తెలిసిందే.

తిలక్‌వర్మ శతక జోరు

ఇండియా 'ఏ' రెండో ఇన్నింగ్స్ 380/3 డిక్లేర్డ్



అనంతపూర్: దులీప్ ట్రోఫీలో మ్యాచ్‌లు రసవత్తరంగా సాగుతున్నాయి. దేశవాళీలో సత్తాచాటి జాతీయ జట్టులో చోటు ఆశిస్తున్న ప్లేయర్లు అదరగొడుతున్నారు. ఇండియా-'డీ'తో జరుగుతున్న మ్యాచ్‌లో ఇండియా 'ఏ' బ్యాటర్లు హైదరాబాదీ తిలక్‌వర్మ(193 బంతుల్లో 111 నాటౌట్, 9ఫోర్లు), ఓపెనర్ ప్రథమ్ సింగ్(189 బంతుల్లో 122, 12ఫోర్లు, సిక్స్) సూపర్ సెంచరీలతో కదంతొక్కారు. వీరిద్దరి విజృంభణతో ఇండియా 'ఏ' రెండో ఇన్నింగ్స్‌లో 380/3 వద్ద డిక్లేర్ చేసింది. తిలక్, ప్రథమ్ కలిసి రెండో వికెట్‌కు 104 పరుగులు జోడించారు. ఆ తర్వాత బ్యాటింగ్‌కు దిగిన ఇండియా 'డీ' వికెట్ కోల్పోయి 62 పరుగులు చేసింది. రికీ భుయ్(44), యశ్ దూబే(15) క్రీజులో ఉన్నారు.

ఆదుకున్న అభిమన్యు: ఇండియా 'సీ'తో జరుగుతున్న మ్యాచ్‌లో ఇండియా 'బీ' ఎదురీదుతున్నది. సహచరులు విఫలమైన చోట కెప్టెన్ అభిమన్యు ఈశ్వరన్(143 నాటౌట్) అజేయ సెంచరీతో ఆదుకున్నాడు. ఓవర్‌నైట్ స్కోరు 124తో మూడో రోజు ఆట కొనసాగించిన ఇండియా'బీ' వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయింది. ముషీర్‌ఖాన్ (1), సర్ఫరాజ్‌ఖాన్(16), రింకూసింగ్ (6), నితీశ్‌కుమార్‌రెడ్డి(2), సుందర్ (13) స్వల్ప స్కోర్లకే వెనుదిరిగారు. అయినా వెనుకకు తగ్గని ఈశ్వరన్..జట్టుకు గౌరవప్రదమైన స్కోరు అందించాడు. చేతిలో మూడు వికెట్లు ఉన్న ఇండియా 'బీ' 216 పరుగుల వెనుకంజలో కొనసాగుతున్నది.



మద్రాస్ ఇంటర్నేషనల్ సర్క్యూట్ వేదికగా శనివారం జరిగిన ఇండియన్ రేసింగ్ లీగ్(ఐఆర్ఎల్)లో చెన్నై టర్బో రైడర్స్ డ్రైవర్ జాన్ లాంకస్టర్ విజేతగా నిలిచాడు. గాబ్రియెలా జిల్కోవ, రుహాన్‌న అల్వ..రెండు, మూడు స్థానాలు దక్కించుకున్నారు. ఫార్ములా-4లో జాడెన్ పరియత్(బెంగళూరు స్పీడ్‌స్టర్స్) పోడియం ఫినిష్ చేశాడు.

అర్జున్ అదుర్స్


బుడాపెస్ట్: ప్రతిష్ఠాత్మక చెస్ ఒలింపియాడ్‌లో భారత యువ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేసి అర్జున్ అదరగొడుతున్నాడు. నాల్గో రౌండ్‌లో భాగంగా సెర్బియాతో జరిగిన మ్యాచ్‌లో భారత్ విజయం సాధించడంలో అర్జున్ కీలకమయ్యాడు. అలెక్సీ సరనాతో జరిగిన గేమ్‌ను ప్రజ్ఞానంద డ్రా చేసుకోగా, తనపై పెట్టుకున్న ఆశలను వమ్ముచేయని అర్జున్..ఇండిచ్ అలెగ్జాండర్‌ను ఓడించి వరుసగా నాలుగో విజయాన్ని ఖాతాలో వేసుకున్నాడు. మరోవైపు విదిత్ గుజరాతి, గుకేశ్ విజయాలతో భారత్ 3.5-0.5 తేడాతో సెర్బియాపై గెలిచింది.

కోహ్లీ, రాధిక సెల్ఫీ



భారత స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ, ప్రముఖ సినీ యాక్టర్ రాధికా శరత్‌కుమార్ సెల్ఫీ అభిమానులను ఆకట్టుకుంటున్నది. లండన్ నుంచి చెన్నై వెళ్తున్న విమానంలో కోహ్లీని కలుసుకున్న రాధిక ఆరాధ్య క్రికెటర్‌పై తన ఇష్టాన్ని చాటుకుంటూ ఫొటోను సోషల్‌మీడియాలో పోస్ట్ చేసింది.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.



సంగ్రామానికి సన్నద్ధం?

పవన్‌కల్యాణ్ సినిమాల అప్‌డేట్స్ కోసం ఆయన అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం ఆయన ఓజీ, హరిహర వీరమల్లు, ఉస్తాద్ భగత్‌సింగ్ సినిమాలు చేస్తున్న విషయం తెలిసిందే. వీటిలో 'ఓజీ' షూటింగ్ దాదాపుగా పూర్తికావచ్చింది. 'హరిహర వీరమల్లు' 60శాతం పూర్తయింది. 'ఉస్తాద్ భగత్‌సింగ్' షూటింగ్ చాలావరకు మిగిలివుంది. ప్రస్తుతం ఏపీ ఉప ముఖ్యమంత్రిగా పాలనా వ్యవహారాల్లో బిజీగా ఉన్న పవన్.. ఈ మూడు సినిమాల్లో ముందుగా దేని షూటింగ్‌లో పాల్గొంటారు అనేది అభిమాలకు మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. అయితే అందుతున్న సమాచారం ప్రకారం పవన్ ఈ నెల చివరి వారం నుంచి కానీ, వచ్చే నెల తొలివారం నుంచి కానీ 'హరిహర వీరమల్లు' షూటింగ్‌లో పాల్గొంటారని తెలుస్తున్నది. రోజులో ఒక పూట షూటింగ్‌కు, ఒక పూట పాలనకు కేటాయించాలని పవన్ నిర్ణయించారట. నిర్మాతకు ప్రతి క్షణం విలువైనదే కాబట్టి, సమయం వృథా కాకుండా షూటింగ్‌కి సంబంధించిన కార్యక్రమాలన్నీ ఒక ప్లాన్ ప్రకారం ముందుగానే పూర్తి చేస్తున్నారట. ఈ సినిమాకు ఏఎం రత్నం కుమారుడు జ్యోతికృష్ణ దర్శకత్వం వహిస్తున్న విషయం తెలిసిందే.

సిద్ధు స్టైలిష్ అవతార్



సిద్ధు జొన్నలగడ్డ నటిస్తున్న యూత్‌ఫుల్ ఎంటర్టైనర్ 'తెలుసు కదా'. ప్రముఖ స్టైలిస్ట్ నీరజ కోన ఈ సినిమాతో డైరెక్టర్‌గా మారారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఫస్ట్ షెడ్యూల్ హైదరాబాద్‌లో పూర్తి చేసుకుంది. ఇప్పటికే 50శాతం చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ చిత్రం గురించి మేకర్స్ చెబుతూ 'అవుట్‌పుట్ చూసుకున్నాం. చాలా సంతృప్తికరంగా వచ్చింది. నెలరోజుల పాటు జరిగిన ఈ షెడ్యూల్‌లో సిద్ధు, రాశిఖన్నా, శ్రీనిధి శెట్టి, వైవా హర్షలపై కొన్ని కీలక సన్నివేశాలను చిత్రీకరించాం. తొలి పాటను సిద్ధు, రాశీఖన్నాలపై షూట్ చేశాం. నెక్స్ట్ లెన్తీ షెడ్యూల్ కోసం శరవేగంగా పనులు జరుగుతున్నాయి. సిద్ధు జొన్నలగడ్డ ఇందులో న్యూ అండ్ స్టైలిష్ అవతార్‌లో కనిపించనున్నారు. ఆయన కెరీర్‌లోనే స్పెషల్ మూవీగా ఈ సినిమా నిలుస్తుంది.' అని తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: జ్ఞానశేఖర్ బాబా, సంగీతం: థమన్ ఎస్, సహనిర్మాత: వివేక్ కూచిభొట్ల.

లారెన్స్ భారీ యాక్షన్ అడ్వెంచర్



రాఘవ లారెన్స్ కథానాయకుడిగా రమేశ్‌వర్మ దర్శకత్వంలో ఓ చిత్రం రూపొందనుంది. ఇది నటుడిగా లారెన్స్ 25వ చిత్రం కావడం విశేషం. కోనేరు సత్యనారాయణ ఈ చిత్రానికి నిర్మాత. భారీ యాక్షన్ అడ్వంచరస్ మూవీగా ఈ చిత్రం తెరకెక్కనున్నదని, లారెన్స్ కెరీర్‌లో వైవిధ్యమైన సినిమాగా ఇది నిలుస్తుందని, నవంబర్‌లో ఈ సినిమా షూటింగ్ ప్రారంభించి 2025 సమ్మర్‌లో సినిమాను విడుదల చేస్తామని రమేశ్వర్మ తెలిపారు. ఈ సందర్భంగా ఈ సినిమా అనౌన్స్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. ఈ పోస్టర్‌పై షాడో అవతార్‌లో రాఘవ లారెన్స్ కనిపిస్తున్నారు. అత్యంత భారీ వ్యయంతో రూపొందనున్న ఈ పాన్ ఇండియా సినిమాకు సంబంధించిన మరిన్ని విశేషాలను త్వరలోనే తెలియజేస్తామని మేకర్స్ చెప్పారు.



కల్యాణ్‌రామ్ పోరాటాలు

నందమూరి కల్యాణ్‌రామ్ నటిస్తున్న యాక్షన్ ప్యాక్డ్ ఎంటర్టైనర్ 'ఎన్ఆర్‌కే 21'(వర్కింగ్ టైటిల్). ప్రదీప్ చిలుకూరి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో విజయశాంతి ప్రత్యేక పాత్ర పోషిస్తున్నారు. అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు నిర్మాతలు. ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతున్నది. ప్రస్తుతం భారీ యాక్షన్ ఎపిసోడ్‌ని చిత్రీకరిస్తున్నారు. ఈ ఎపిసోడ్‌లో 150మంది ఫైటర్లు, 300మంది జూనియర్ ఆర్టిస్టులు పాల్గొంటున్నారు. పీటర్ హెయిన్స్ పర్యవేక్షణలో చిత్రీకరిస్తున్న ఈ యాక్షన్ సీక్వెన్స్ సినిమాకు మేజర్ హైలైట్‌గా నిలుస్తుందని మేకర్స్ చెబుతున్నారు. ఈ సందర్భంగా విడుదల చేసిన వర్కింగ్ స్టిల్స్‌లో పీటర్ హెయిన్స్ ఆర్టిస్టులకు సజెషన్స్ ఇస్తూ కనిపిస్తున్నారు. చాలా కాలం తర్వాత పవర్‌ఫుల్ పోలీస్ అధికారి పాత్రలో విజయశాంతి నటిస్తున్న ఈ చిత్రంలో సోహైల్‌ఖాన్, సాయి మంజ్రేకర్, శ్రీకాంత్ కీలక పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: రామ్‌ప్రసాద్, సంగీతం: అజనీష్ లోక్‌నాథ్, నిర్మాణం: అశోక క్రియేషన్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్.

డాక్టర్‌పై చర్యలు తీసుకోండి



తమిళ నటీమణులపై అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేసిన చెన్నైకి చెందిన డాక్టర్ కాంత రాజ్‌పై తమిళ నటీనటులు అసోసియేషన్ నడిగర్ సంఘం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ మేరకు ఆయనపై చెన్నై సిటీ పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తున్నట్లు సీనియర్ నటి రోహిణి పేర్కొంది. నడిగర్ సంఘంలోని కీలకమైన అంతర్గత విచారణ కమిటీకి రోహిణి నేతృత్వం వహిస్తున్నారు. ఇటీవల ఓ యూట్యూబ్ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో డాక్టర్ కాంత రాజ్ తమిళ కథానాయికలపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. అవకాశాల కోసం కథానాయికలు అన్నింటికి సర్దుకుపోతారని అన్నారు. ఆయన మాటలపై పెద్ద ఎత్తున విమర్శలొచ్చాయి. ఆయన వ్యాఖ్యలు సినీరంగంలో పనిచేస్తున్న మహిళల మానసికస్థైర్యాన్ని దెబ్బతీసేలా ఉన్నాయని, వారి ప్రతిష్టకు భంగ కలిగిస్తాయని రోహిణి సైబర్ క్రైమ్ డిపార్ట్‌మెంట్‌కు ఫిర్యాదు చేసింది. ఆయన ఇంటర్వ్యూ వీడియోను తొలగించాలని యూట్యూబ్ సంస్థకు లేఖ రాస్తున్నట్లు ఆమె పేర్కొంది. ప్రస్తుతం ఈ వివాదం తమిళ సినీరంగంలో చర్చనీయాంశంగా మారింది.

దళపతితో ఆటపాట



కన్నడ సోయగం పూజాహెగ్డేకు గత కొంతకాలంగా అదృష్టం కలిసి రావడం లేదు. సినిమాలపరంగా భారీ అవకాశాలైతే వస్తున్నాయిగానీ ఆశించిన విజయాలు దక్కడం లేదు. మంచి హిట్‌తో తిరిగి ఫామ్‌లోకి రావాలనే పట్టుదలతో ఉంది భామ. తాజాగా ఈ అమ్మడు తమిళంలో బంపరాఫర్‌ను సొంతం చేసుకున్నట్లు తెలిసింది. వివరాల్లోకి వెళితే..తమిళ అగ్ర హీరో దళపతి విజయ్ రాజకీయరంగ ప్రవేశం చేయబోతున్న విషయం తెలిసిందే. 'తమిళ వెట్రి కళగం' పేరుతో ఆయన రాజకీయ పార్టీని స్థాపించారు. ఈ నేపథ్యంలో తన చివరి చిత్రానికి సన్నద్ధమవుతున్నారు విజయ్. దళపతి 69 వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కనున్న ఈ చిత్రానికి హెచ్.వినోద్ దర్శకుడు. శుక్రవారం అధికారిక ప్రకటన వెలువడింది. ఈ సినిమాలో పూజాహెగ్డే ప్రధాన నాయికగా ఖరారైందని చెన్నై సినీ వర్గాల్లో వినిపిస్తున్నది. గతంలో విజయ్‌తో కలిసి 'బీస్ట్' చిత్రంలో నటించింది పూజాహెగ్డే. మరోమారు ఈ జోడీ వెండితెరపై సందడి చేయడానికి సిద్ధమవుతుండటం విశేషం. కెరీర్‌పరంగా ఈ సినిమా పూజాహెగ్డేకు చాలా ప్లస్ అవుతుందని భావిస్తున్నారు.

భయపెట్టే సస్పెన్స్ థ్రిల్లర్



నటి వేదిక నటించిన సస్పెన్స్ థ్రిల్లర్ 'ఫియర్'. హరిత గోగినేని డైరెక్షన్‌లో తెరకెక్కిన ఈ చిత్రానికి ఏఆర్ అభి నిర్మాత. అరవింద్ కృష్ణ ప్రత్యేక పాత్ర పోషించారు. విడుదలకు ముందే వివిధ అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్స్‌లో 60కి పైగా అవార్డులను ఈ సినిమా గెలుచుకున్నదని మేకర్స్ తెలిపారు. ప్రఖ్యాత కొరియోగ్రాఫర్, నటుడు, దర్శకుడు ప్రభుదేవా సోషల్ మీడియా ద్వారా శనివారం ఈ సినిమా ఫస్ట్‌లుక్‌ని విడుదల చేసి చిత్ర యూనిట్‌కి శుభాకాంక్షలు అందించారు. ఒక చీకటి గదిలో ఓ మూల ముడుచుకొని కూర్చొని, భయంగా చూస్తున్న వేదిక స్టిల్ సినిమాపై ఆసక్తిని క్రియేట్ చేస్తున్నది. ఈ సినిమా థియేట్రికల్ రిలీజ్ త్వరలోనే ఉంటుందని మేకర్స్ తెలిపారు. జయప్రకాశ్, పవిత్రలోకేష్, అనీష్ కురువిల్ల, షాయాజీ షిండే, సత్యకృష్ణ, సాహితి దాసరి, షాని తదితరులు ఇతర పాత్రలు పోషించిన ఈ చిత్రానికి కెమెరా: ఐ ఆంద్రూ, సంగీతం: అనూప్ రూబెన్స్. సహ నిర్మాత: సుజాత రెడ్డి, నిర్మాణం: దత్తాత్రేయ మీడియా.

ఆ పాటతో కంగారుపడ్డాం



'ఇంటిమేట్ ముద్దు సన్నివేశాల్లో నటించడం తేలికైన విషయం కాదు. దానికి నటించే ఇద్దరి మధ్య సరైన అవగాహన, అనుబంధం ఉండాలి. చుట్టూ సౌకర్యవంతమైన వాతావరణం ఉండాలి. అప్పటికీ అది చేయడం కష్టమే.' అంటూ ఆసక్తికరమైన విషయాలు చెప్పుకొచ్చింది అందాలభామ మాళవిక మోహనన్. ఈ కేరళ బ్యూటీ 'యుధ్రా' చిత్రంతో బాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇస్తున్నది. ఈ సినిమాలోని ఓ పాటలో కథ డిమాండ్ మేరకు ఇంటిమేట్ సన్నివేశాల్లో నటించింది మాళవిక. ఆ సన్నివేశాలు చేస్తున్నప్పుడు తను పడ్డ అంతర్మథనం గురించి ఆమె తాజా ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చింది. 'ఈ సినిమాలో 'సాథియా..' అంటూ సాగే పాటను స్పైసీగా డిజైన్ చేశారు దర్శకుడు రవి ఉద్యావర్. ఈపాటలో ఇంటిమేట్ సన్నివేశాలు ఎక్కువగా ఉంటాయి. సాధారణంగా ఇలాంటి పాటలు తీసేటప్పుడు లొకేషన్లో అందర్నీ ఉండనివ్వరు. ఆ సన్నివేశాల కోసం ప్రత్యేకంగా ఇంటిమేట్ కో-ఆర్డినేటర్‌ను నియమిస్తారు. తను నటీనటులు ఇబ్బంది పడకుండా, ఆ సన్నివేశాల్లో ఎలా నటించాలో చెబుతుంటాడు. కానీ మా లొకేషన్‌లో అలాంటి కో-ఆర్డినేటర్ ఎవరూ లేరు. 'సాథియా..' పాట గురించి తెలుసుకొని హీరో సిద్ధార్థ్ చతుర్వేది, నేను కంగారుపడిపోయాం. అసలు ఈ పాట చేయగలమా? అని సందేహించాం కూడా. సముద్రతీరం.. అందునా భయంకరమైన చలి. ఇక తప్పేది లేక, కాస్త కష్టమైనా దర్శకుడు రవి ఉద్యావర్ చెప్పినట్టు చేసి, పాటను పూర్తి చేశాం. అయితే.. ఈ పాటలో ఎక్కడా అసభ్యత ఉండదు. కళాత్మకంగా ఉంటుంది.'అంటూ చెప్పుకొచ్చింది మాళవిక మోహనన్



మధ్యతరగతి తల్లి కథ

ప్రముఖ దర్శకులు ముత్యాల సుబ్బయ్య సమర్పణలో రూపొందుతున్న చిత్రం 'తల్లి మనసు'. రచిత మహాలక్ష్మి, కమల్ కామరాజు, సాత్విక్, సాహిత్య ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. వి.శ్రీనివాస్ (సిప్పీ) దర్శకుడిగా పరిచయమవుతున్నాడు. ముత్యాల అనంతకిషోర్ నిర్మాత. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ జరుగుతున్నది. రెండు పాటలతో పాటు 80శాతం చిత్రీకరణ పూర్తయిందని, ఈ నెలాఖరుకు షూటింగ్ మొత్తం పూర్తవుతుందని నిర్మాత ముత్యాల అనంతకిషోర్ తెలిపారు. ఓ మధ్యతరగతి తల్లి పడే తపన, సంఘర్షణను ఆవిష్కరిస్తూ, వాస్తవ జీవితానికి దగ్గరగా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నామని సమర్పకులు ముత్యాల సుబ్బయ్య తెలిపారు. రఘుబాబు, శుభలేఖ సుధాకర్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కథా విస్తరణ: ముత్యాల సుబ్బయ్య, సంగీతం: కోటి, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: వి.శ్రీనివాస్ (సిప్పీ).



చెంప ఛెళ్లుమనిపించా

'శారీరకంగా పురుషులు బలవంతులు కావచ్చు.. అంత మాత్రాన స్త్రీలను ఇబ్బందిపెట్టే హక్కు వారికి లేదు' అంటూ ఘాటుగా స్పందించింది బాలీవుడ్ భామ ఈషా దేవోల్. సమాజంలో మహిళలపై వేధింపులు శృతిమించుతున్నాయని, వాటిని ప్రతిఘటించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉన్నదని ఈషా దేవోల్ పేర్కొన్నది. ఈ సందర్భంగా తాజా ఇంటర్వ్యూలో తనకు ఎదురైన ఓ చేదు అనుభవం గురించి ఈషా గుర్తుచేసుకున్నది. 'ఓ వేడుకలో నాతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిని చెంప పగిలేలా కొట్టాను. అది జరిగి 20ఏండ్లు అవుతున్నది. అయినా ఆ జ్ఞాపకం అలాగే నా మనసులో ఉండిపోయింది. పూణెలో జరిగిన 'దాస్' మూవీ ప్రీమియర్ ఈవెంట్‌లో జరిగిన సంఘటన అది. ప్రధాన నటీనటులతోపాటు నేనూ ఆ కార్యక్రమానికి హాజరయ్యా. మమ్మల్ని చూసేందుకు జనం పెద్ద ఎత్తున వచ్చారు. వారిని కంట్రోల్ చేయడం బౌన్సర్ల వల్ల కూడా కాలేదు. ఇంతలో ఓ గుర్తు తెలియని వ్యక్తి సందట్లో సడేమియా అన్నట్టు నన్ను అభ్యంతరకర రీతిలో తాకాడు. నేను మెరుపు వేగంతో అతని చేయి పట్టుకొని గుంపులోంచి బయటకు లాగి, చెంప చెళ్లు మనిపించా. అది చూసిన అందరూ షాక్. నిజానికి నేను చాలా జోవియల్ పర్సన్‌ని. నాకు సహనం కూడా ఎక్కువే. అయితే దాన్ని పరీక్షిస్తూ ఎవరైనా ప్రవర్తిస్తే మాత్రం నా రియాక్షన్ వేరేలా ఉంటుంది. ఇలాంటి పరిస్థితి ఏ మహిళకు ఎదురైనా ఇలాగే స్పందించాలని నేను కోరుకుంటా.' అని తెలిపింది ఈషా దేవోల్.

మాస్ కథాంశంతో 'హరుడు'



శ్రీసీతారాములకల్యాణం చూతమురారండి, అన్నయ్య, ప్రేమ కోసం, శివరామరాజు చిత్రాలతో మంచి నటుడిగా గుర్తింపు తెచ్చుకున్న హీరో వెంకట్ కమ్ బ్యాక్ ఇస్తున్న మూవీ 'హరుడు'. రాజ్ తాళ్లూరి దర్శకుడు. డాక్టర్ ప్రవీణ్‌రెడ్డి, డాక్టర్ దిక్కల లక్ష్మణరావు నిర్మాతలు. ఈ సినిమా పనులు శరవేగంగా జరుగుతున్నాయి. నవంబర్లో సినిమా విడుదల చేయనున్నారు. అన్ని వర్గాల వారికీ నచ్చే పూర్తి మాస్ ఎంటర్టైనర్ ఇదని దర్శకుడు చెప్పారు. హెబ్బాపటేల్, సలోని, నాటషా, సుమన్, అలీ, శ్రీహరి, రవివర్మ, శుభాశ్రీ కీలకపాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: సన్నీ డి, ఆనంద్, సంగీతం: మని జీన్న, నిర్మాణం: మైత్రి ఆర్ట్స్, మైత్రి బాక్సాఫీస్.